

అహ్మదాబాద్: గాంధీ ఆశ్రమంలో రాట్నంపై నూలు వడుకుతున్న నటి హ్యూమా ఖురేషి


# ఆంధ్రప్రభ

Estd. 1938

www.prabhanews.com

Journalism first!





సంపుటి: 60 • సంచిక: 223 • గురువారం 17 ఆగస్టు 2017 • విజయవాడ ✻ పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad


**ముహూర్తం** శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ దశమి ఉ.11.03 వరకు, అనంతరం ఏకాదశి; నక్షత్రం: మృగశిర రా. 10.30 వరకు, అనంతరం ఆరుద్ర; అమృతకాలం: మ. 2.20 నుండి 3.50 వరకు; వర్జ్యం: ఉ. శే 6.51 వరకు; దుర్ముహూర్తం: ఉ. 9.59 నుండి 10.50 వరకు, తదుపరి మ. 3.05 నుండి 3.57 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు



# పెరిగిన వేడి.. అందని నాడి!



● పైకి ప్రచార ఆర్భాటం... ● లోన గుండెను పిండే బెంగ ● ప్రతి తలుపూ తడుతూ, ప్రతి ఓటరును పలకరిస్తూ... పదునైన ప్రసంగాలు... ఘాటైన విమర్శలు... ● పవన్ తటస్థం ఎవరికి లాభం? ● గంగుల చేరిక టీడీపీకి ఊపు?!

**నంద్యాల, ఆంధ్రప్రభ :** నంద్యాలలో ఎన్నికల వేడి పెరిగింది... అయితే, జనం నాడి మాత్రం అందడం లేదు... ప్రతి వీధి, ఊరు, వాడలను ప్రధాన పార్టీలు ఇప్పటికే రెండు మూడు సార్లు చుట్టేశాయి. ప్రతి తలుపూ తట్టాయి. అన్ని సామాజిక వర్గాలను పలకరించాయి. ఈ నేపథ్యంలో బుధవారం కీలక పరిణామాలు సంతరించుకున్నాయి. జనసేన అధినేత ఈ ఎన్నికల్లో తాము తటస్తంగా ఉంటామని ప్రకటించారు. మరోవైపు నంద్యాల నియోజకవర్గంలో బాగా పట్టున్న నేత గంగుల ప్రతాపరెడ్డి తెలుగుదేశంలో చేరడంతో రాజకీయం మంచి రసపట్టులో పడింది. ప్రధాన పార్టీలు స్థానిక నేతలతో నిత్యం చిన్న, పెద్ద సమావేశాలు జరుపుతూనే ఉన్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క ఓటును కూడా నిర్లక్ష్యం చేయరాదన్న పట్టుదల పార్టీల్లో ముఖ్యంగా తెదేపా, వైకాపాల్లో కనిపిస్తోంది. ఏ చిన్నపాటి అవకాశాన్నీ వదలకుండా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అన్ని ప్రయత్నాలను నేతలు చేస్తున్నారు. ప్రతి రోజూ లక్షలాది రూపాయలు వ్యయం చేసి భారీగా జనాన్ని పోగేసి మరీ ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధాన పార్టీలు ప్రచార లోపం లేకుండా విశ్వప్రయత్నాలు చేస్తున్నా, లోలోపల మాత్రం బెంగటిల్లుతున్నాయి. గెలుపు ఖాయమని ఘంటాపథంగా పైకి చెబుతున్నా, ప్రతి ఓటు ఎంతో అమూల్యమైనదిగానే పరిగణిస్తున్నారు. ప్రచార పర్వంలో వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి నూతన పంథాను ఆవిష్కరించగా, తెదేపా మాత్రం అంతు చిక్కని వ్యూహాలతో చాపకింద నీరులా పరిస్థితిని చక్కబెట్టేస్తోంది. గ్రామీణ స్థాయిలోనే కాకుండా మున్సిపాలిటీ పరిధిలో కూడా నాలుగు ఓట్లను వేయించగల గల్లీ స్థాయి నేతలను కూడా వదలడం లేదు. తనదైన శైలిలో పదునైన వ్యాఖ్యలతో వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి నిస్సందేహంగా ప్రచార పర్వంలో కొత్త అలజడిని సృష్టించారు. ఆయనకు ధీటుగా మంత్రులు స్పందిస్తున్నా అంతే స్థాయిలో ప్రభావం చూపించిందా అంటే చెప్పలేని పరిస్థితి. అయితే, జగన్‌తో పాటు

➪ 8వ పేజీలో...



# దేశంలోనే అత్యంత ఖరీదైన ఎన్నిక!

● నోరెళ్లబెట్టిన పరిశీలకులు

● ప్రజాస్వామ్య పరిరక్షణకు విఘాతం

● శృతిమించిన ఎన్నికల ప్రచారం

● ఆశ్చర్యపోతున్న స్థానిక జనం

● భవిష్యత్ ఎన్నికలపై పెను ప్రభావం

(నంద్యాల నుంచి ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి )

నంద్యాల ఉపఎన్నిక దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇంతవరకు దేశంలో ఏ ఉపఎన్నికపైనా దేశంలో చర్చలుజరగలేదు. ఇంతగా ఆకర్షించిన ఎన్నికల ప్రచారం కూడా ఇదివరెకన్నడూ సాగలేదు. ఇది కేవలం ఒక అసెంబ్లీ స్థానం కోసం జరుగుతున్న హోరాహోరీ యుద్ధంలా లేదు. అధికార, ప్రతిపక్షాలు రెండూ దీన్ని ప్రతిష్టాత్మకంగానే తీసుకున్నాయి. ఎవరు గెల్చినా పదవీకాలం ఏడాదిన్నరలోపే. అయినా సరే ఇందులో గెల్చితీరాలన్న పట్టుదలను ప్రధాన పార్టీలు రెండూ ప్రదర్శిస్తున్నాయి. ఇందుక్కారణం గత మూడున్నరేళ్ళ రాష్ట్ర ప్రగతిపై ప్రజల రిఫరెండెంగా ఈ ఎన్నికల ఫలితాల్ని విశ్లేషించగలిగే వీలుండడం.

నవనందుల ఆలయాల మధ్యనున్న నంద్యాల నియోజకవర్గం ఆదినుంచి రాజకీయంగాసంచలనమే. దేశంలోని మరే స్థానానికీలేని ప్రత్యేకత నంద్యాలకుంది. దేశానికి అధ్యక్షుడ్ని, ప్రధానిని కూడా అందించిన ఘనత నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గానిదే. ఆరవ రాష్ట్రపతి

➪ 3వ పేజీలో...

## జనసేన తటస్థం



● పార్టీ నిర్మాణం జరుగుతోంది ● నేరుగా సాధారణ ఎన్నికలకే వెళతాం ● మీడియాతో పవన్‌కల్యాణ్

2 లో



## వైసీపీకి షాక్!

● టీడీపీలో చేరిన మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి

● మలుపులు తిరుగుతున్న నంద్యాల రాజకీయాలు

2 లో

# నంద్యాల ముమ్మాటికీ రెఫరెండమే!



● చంద్రబాబు పాలనపై తీర్పు ఇవ్వండి ● నంద్యాలలో పింఛన్ల కుదింపు ● బియ్యానికే పరిమితమైన రేషన్ షాపులు ● రోడ్‌షోలో జగన్మోహన్‌రెడ్డి

**నంద్యాల , కెఎన్ఎన్ :** నంద్యాల ఉప ఎన్నిక ముమ్మాటికీ టీడీపీ మూడున్నరేళ్ల పాలనకు రెఫరెండమే నని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. నంద్యాల ఓటర్లు ఒక ఎమ్మెల్యేనే ఎన్నుకోవడం లేదని, అవినీతి, కుంభకోణాలు, మహిళలపై వేధింపుల పై తీర్పుగా ఆయన ఈ ఎన్నికలు అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన నంద్యాల నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా రోడ్ షోలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు డబ్బుల ప్రభావానికి, నైతికతకు మధ్య యుద్ధం లాంటిదని చెప్పారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రభుత్వ పాలనపై తీర్పు

➪ 8వ పేజీలో...

# బ్యాలెట్ బుల్లెట్‌తో కాల్చండి!

● బాబు సారధ్యంలో రాష్ట్రం ప్రగతి మయం ● శిల్పా సోదరులు పాలు తాగి తల్లి రొమ్ముగుద్దే రకం ● జగన్‌వన్నీ పచ్చి అబద్ధాలు ● రోడ్‌షోలో బాలకృష్ణ



**నంద్యాల, ఆంధ్రప్రభ:** బ్యాలెట్‌ను బుల్లెట్‌గా మార్చి ప్రత్యర్థులను కాల్చివేయాలని ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. లోటు బడ్జెట్‌లో వున్న రాష్ట్రాన్ని అనన్యమైన సమర్ధతతో, అపారమైన అనుభవంతో గాడిలో పెడుతూ ప్రగతిపథంలో పయనింపజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విధానాలను తప్పుపడితే ప్రజలే శాస్తి చెబుతారని హెచ్చరించారు. ఒకరోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన నంద్యాల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో మంత్రి అఖిలప్రియ, టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిలతో కలిసి నిర్వహించిన రోడ్‌షోలలో

➪ 8వ పేజీలో...



# భద్రతతోనే... ఆనంద ఆంధ్రప్రదేశ్

• ప్రజల భద్రత మీది..! మీ సంక్షేమం నాది..!

• డీజీపీ కార్యాలయం ప్రారంభించిన సీఎం

• రోబోల కంటే ఏపీ పోలీసు వేగం

• దేశంలోనే ఆక్టోపస్ నెం.1

3 లో

## ఖాకీలపై రాళ్లదాడి జనంపై విరిగిన లాఠీ

• వంశధార నిర్వాసిత గ్రామంలో ఉద్రిక్తత

8 లో

# నాబార్డు రుణాలకు ఆమోదం



• సాగునీటి ప్రాజెక్టులకు మరింత ఊతం

• రూ.9,020 కోట్ల నిధుల సమీకరణకు ఆస్కారం

• పోలవరం సహా పలు తెలుగు ప్రాజెక్టులకు మోక్షం

• కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** అనుకున్న సమయానికల్లా సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ మేరకు యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రాం (ఏఐబీపీ) కింద ఎంపిక చేసిన 99 కీలక సాగునీటి ప్రాజెక్టులతో పాటు ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై)లో భాగంగా చేపట్టిన పలు ప్రాజెక్టులను పూర్తి చేయడం కోసం నాబార్డు ద్వారా 6 శాతం వడ్డీతో రుణాలు అందజేయనుంది. ఇందులో భాగంగా 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ. 9.020 కోట్లు 'ఎక్స్‌ట్రా బడ్జెటరీ రిసోర్సెస్' రూపంలో సమీకరించుకునేందుకు బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బాండ్లను జారీ చేయడం ద్వారా ఈ నిధులను సమీకరించనున్నారు. యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రామ్ (ఎఐబిపి)లో తలపెట్టిన భారీ మరియు మధ్యతరహా నీటిపారుదల పథకాలకు తగినంత నిధుల లభ్యత లేక పనులు ముందుకు సాగడం లేదు. 2016-17 సంవత్సరంలో పిఎమ్‌కెఎస్‌వై - ఎఐబిపి లో భాగంగా నిర్మాణంలో ఉన్న 99 ప్రాజెక్టులను గుర్తించి వాటిని 2019 డిసెంబర్ కల్లా దశల వారీగా పూర్తి చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పించారు. ఈ పథకాలకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు నాబార్డ్ లో ఒక ప్రత్యేక లాంగ్ టర్మ్ ఇరిగేషన్ ఫండ్ (ఎల్‌టిఐఎఫ్)ను ఏర్పాటు చేస్తామని 2016-17 బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. 2016-17 సంవత్సరంలో నాబార్డు రూ. 9,086.02 కోట్లను లాంగ్ టర్మ్ ఇరిగేషన్ ఫండ్ రూపంలో భాగంగా వివిధ ప్రాజెక్టులకు విడుదల చేసింది. ఇందులో రూ. 2,414.16 కోట్లు పోలవరం ప్రాజెక్టు కోసం విడుదల చేయగా, మిగతా రూ. 6,671.86 కోట్లు ఇతర కీలక పథకాలకు విడుదల చేయడమైంది. అంతేకాక రూ. 924.9 కోట్లు బడ్జెటరీ ప్రొవిజన్ ద్వారా కేంద్ర సహాయం రూపంలో ఇచ్చారు. 201617లో రూ. 2,187 కోట్లు నాబార్డ్ సమీకరించింది. 201718 లో ఎల్‌టిఐఎఫ్ ద్వారా రూ. 29,000 కోట్ల వరకు

➪ 8వ పేజీలో...

## ఔరా..!




# ఆరోగ్య నగరి

• హెల్త్, టూరిస్ట్ హబ్‌గా అమరావతి • యూకే హెల్త్ మెడిసిటీకి సీఎం శంకుస్థాపన • చంద్రబాబు కృషి ప్రశంసనీయం • కేంద్రమంత్రి అనుప్రియ పటేల్



**అమరావతి, ఆంధ్రప్రభ :** భవిష్యత్తులో నవ్యాంధ్ర రాజధాని అమరావతి హెల్త్, టూరిస్ట్ హబ్‌గా రూపొందనుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం చూపంతా అమరావతివైపే ఉందని, దీనికి కారణం రైతుల త్యాగమేనని, వారి రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేనని అన్నారు. రానున్న రోజుల్లో వైద్యం కోసం గల్ఫ్, యూరప్ దేశాల నుంచి వైద్యం కోసం అమరావతికి వచ్చే పరిస్థితి ఉందన్నారు. తద్వారా టూరిజం కూడా అభివృద్ధి అవుతుందని అన్నారు. బుధవారం విజయవాడలోని

➪ 8వ పేజీలో...




# పట్టుకోసం పార్టీల తంటాలు

**●జెండాలు మారినా అజెండా ఒకటే ●గెలుపు అంచనాల్లో సైకిల్, ఫ్యాన్ గిరికీలు ●శిల్పా, భూమా వర్గాల హోరాహోరీ పోరు**

**నంద్యాల, ఆంధ్రప్రభ:** ప్రతిష్టాత్మ కంగా మారిన నంద్యాల శాసన సభా నియోజకవర్గంలో గెలుపు కోసం ప్రధాన పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. 2014లో జరిగిన ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన పక్షంలో ఉప ఎన్నికలో ఓటర్లను ఆకర్షించేందుకు అన్ని రాజకీయ పక్షాలు వ్యూహప్రతివ్యూహాలతో ప్రచా రాన్ని రక్తి కట్టిస్తున్నాయి. గత సాధారణ ఎన్నికలలో ప్రధాన పక్షాలైన వైసీపీ, తెలుగుదేశం పార్టీలు నంద్యాల టౌన్, గోస్పాడు, నంద్యాల రూరల్ పరిధిలో దాదాపు సమానంగా ఉనికి చాటుకున్నాయి. ప్రస్తుత ఎన్నికలలో జెండాలు మారినప్పటికీ, అభ్యర్థులు మాత్రం అదే రెండు కుటుంబాలకు చెందినవారు కావడంతో మళ్ళీ ఎన్నిక నువ్వా, నేనా అనే రీతిలో తీవ్రమైన పోటీ నెలకొంది. నంద్యాల రూరల్ పరిధిలో గత సాధారణ ఎన్నికలలో విజయం సాధించిన వైసీపీకి 2,648 ఓట్ల మెజారిటీ వచ్చింది. అదే విధంగా గోస్పాడు మండలంలో 757 ఓట్ల మెజారిటీ మాత్రమే లభిం చింది. హోరాహోరీగా ప్రచా రం జరిగిన నంద్యాల టౌన్‌లో వైసీపీకి కేవలం 199 ఓట్ల మెజారిటీ మాత్రమే లభించింది. ఫలితంగా కేవలం స్వల్ప ఓట్లతో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన ప్రస్తుత వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి పరాజయం పాలయ్యారు. 2014లో జరిగిన ఎన్నికలలో మెజారిటీ వ్యక్తిని బట్టి వచ్చిందా, లేదా పార్టీ జెండాను చూసి ఓట్లు వేశారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రజలకు భూమా నాగిరెడ్డితో వున్న అనుబంధం, టీడీపీపై వున్న వ్యతిరేకత ,ఇతర కారణా లతో అప్పుడు నంద్యాలలో వైసీపీ విజయం సాధించిందని భావిస్తున్నారు. అప్పటి ఎన్నికలలో చివరిదాకా ఇరు పక్షాలు గెలుపుపై ధీమా వ్యక్తం చేశాయి. చివరికి ఓటరు నాడిని అంచనా వేయడంలో నేతలు విఫలమయ్యారు. అయితే, సమస్యలపై భూమా నాగిరెడ్డి ఓటర్లకు ఇచ్చిన భరోసా బాగా ప్రభావితం చేసింది. మరోవైపు ప్రతిపక్షం కేవలం వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై, వైసీపీ జెండా చూసి మాత్రమే అధిక సంఖ్యలో ఓట్లు పడ్డాయనే అభిప్రాయం కూడా వుంది. ఈ విధంగా గత సాధారణ ఎన్నికలలో వచ్చిన మెజారిటీ ఈసారి తమ వైపు వుంటుందంటే, కాదు తమ వైపు వుంటుందంటూ వైసీపీ, టీడీపీలు పోటీపడి చెప్పుకుంటుండటం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. గత ఎన్నికల సందర్భంగా కొన్ని రౌండ్లలో టీడీపీ, ఎక్కువ రౌండ్లలో వైసీపీ ఆధిక్యత లభించింది. గత ఎన్నికల అనుభవం రీత్యానే ఇరు పార్టీలు గోస్పాడు, నంద్యా ల రూరల్, నంద్యాల టౌన్ ప్రాంతాలలో గతంలోకన్నా ఎక్కువ మెజారిటీ వచ్చేలా వ్యూహ ప్రతివ్యూహాలతో పావులు కదుపుతున్నాయి. ఈ క్రమంలోనే తెలుగు దేశం పార్టీ పద్దెనిమిది క్లస్టర్లుగా నంద్యాల నియోజకవర్గాన్ని విభజిం చింది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలతో క్షేత్రస్థాయి కార్యాచరణకు దిగింది. గత రెండు రోజులుగా ఈ కార్యక్రమం ముమ్మరమైన నేపథ్యంలో ప్రజలకు మరింతగా చేరువ అయ్యేందుకు కసరత్తు ప్రారంభించింది. ప్రతి క్లస్టర్‌కు ఒక ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరు కైజాలా బృందం సభ్యులు కూడా వున్నారు. ప్రతి క్లస్టర్‌లో ఎమ్మెల్యేలు వెళ్ళిన చోటల్లా ప్రజలతో మమేకమయ్యే సిబ్బంది కైజాలా యాప్‌లో అక్కడికక్కడే ప్రజల నుంచి సేకరించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తున్నారు. 18 మంది ఎమ్మెల్యేలకు తోడు మరో 36 మంది కైజాలా బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. అదే విధంగా వైఎస్సార్‌సిపి కూడా 26 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దింపింది. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోని గోస్పాడు, నంద్యాల టౌన్, నంద్యాల రూరల్ ప్రాంతాలలో విస్తృతంగా పర్యటిస్తు గతంలో కన్నా అత్యధికంగా మెజారిటీని అందించాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. 2014 ఎన్నికలలో మూడు నుంచి ఆరు రౌండ్లలో టిడిపి అభ్యర్థిగా బరిలో దిగిన శిల్పా మోహన్ రెడ్డికి మెజారిటీ లభించింది. పదవ రౌండ్‌లో 20 ఓట్లతో స్వల్ప మెజారిటీ కనబరిచిన శిల్పా మోహన్ రెడ్డి 14, 15 రౌండ్లలోనూ మెజారిటీ సాధించారు. వైసీపీ తరపున బరిలో నిలిచి తొలి రెండు రౌండ్లలో ఆధిక్యత కనబరిచిన అప్పటి వైసీపీ అభ్యర్థి భూమా నాగిరెడ్డి 8 వ రౌండ్‌లోనూ ఆధిక్యత సాధించి చివరి దాకా నిలిచారు. విజయం సాధించారు. భూమా నాగిరెడ్డికి వచ్చిన మొత్తం మెజారిటీ 3,604 ఓట్లు మాత్రమే. నంద్యాల మండల పరిధిలో అత్యధికంగా 2,648 ఓట్ల మెజారిటీ లభించింది. ఈ విధంగా నంద్యాల మండల పరిధిలో అత్యధికంగా 20 గ్రామ పంచాయతీలలోని 1 నుంచి 17 , 167 నుంచి 201 బూత్‌లు మొదటి నుంచి ఆధిక్యతను తెచ్చాయి.




### గ్రూపులకే ప్రాధాన్యం

నంద్యాల ఎన్నికలలో మొదటి నుంచీ ఓటర్లు గ్రూపు రాజకీయాలకే పెద్ద పీట వేస్తున్నారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు గోస్పాడు నంద్యాల నియోజకవర్గంలో చేరింది. ప్రస్తుత ఉప ఎన్నికలో వివిధ గణాంకాలతో గెలుపు తమదేననే ధీమాతో ఇరు పార్టీలు ధీమాగా వున్నాయి. అయితే అప్పట్లో మెజారిటీ దేనిని బట్టి వచ్చిందనే డైలమా కూడా లేకపోలేదు. లోతైన విశ్లేషణలతో ఎవరికి వారు గత గెలుపు కోణాలను అన్వేషిస్తున్నారు. అప్పట్లో శోభానాగిరెడ్డి మృతి కూడా ఎన్నికలలో ప్రభావం చూపిందని అంటున్నారు. భూమా గ్రూపును చూసి ఓట్లు పడ్డాయని మరోవర్గం చెబుతోంది. పాత లెక్కలతో ప్రచార వ్యూహాలకు పదును పెడుతుండటంతో ఎన్నికల ప్రచారం ఒక్కసారిగా వేడెక్కింది. మండలాలలోని 35 గ్రామాలలో అత్యధిక ఓటర్లు వున్న ప్రాంతాల్లో పార్టీల నేతలు దృష్టి సారించారు. మెజారిటీని మరింతగా పెంచుకునేందుకు పావులు కదుపుతున్నారు.

## బాలకృష్ణ స్పీచ్.. బాబు స్క్రిప్టే

**●జగన్‌తోనే రాజన్న రాజ్యం: రోజా**



**నంద్యాల, ఆంధ్రప్రభ :** వాస్తవాలు తెలుసుకోకుండా నటుడు రోడ్‌షోలలో మాట్లాడుతున్నారని వైసీపీ ఎమ్మెల్యే ఆర్.కె.రోజా ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టునే చదివారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బుధవారం నంద్యాల నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. రోజా మాట్లాడుతూ చంద్రబాబు వెన్నుపోటుకు, జగన్ విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి అన్నారు. బాబు ఒత్తిడితోనే భూమా నాగిరెడ్డి చనిపోయారన్నారు. నంద్యాల దెబ్బకు బాబు అబ్బ అనాలన్నారు. శోభా నాగిరెడ్డి చివరి రక్తపు బొట్టు వరకు చంద్రబాబుకు వ్యతిరేకంగాపోరాడారని అన్నారు. ఇప్పుడేమో అఖిలప్రియ అవేమీ పట్టించుకోకుండా చంద్రబాబు పంచన చేరడం విడ్డూరమన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు బాలకృష్ణను వాడుకుంటున్నారని ఆమె విమర్శించారు. ఇరవై మంది ఎమ్మెల్యేలను కోట్లాది రూపాయలు కుమ్మరించి కొనుగోలు చేసిన చరిత్ర చంద్రబాబుది అని పేర్కొన్నారు. ఇప్పటివరకు వారితో రాజీనామా చేయించలేదని మండిపడ్డారు. ఆ విషయం తెలుసుకోకుండానే బాలకృష్ణ ప్రచారంచేస్తున్నారని అన్నారు. రాజకీయాలు మాట్లాడేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలన్నారు. ముందుగా చంద్రబాబు నిజస్వరూపం ఏమిటో గుర్తించాలన్నారు.

## జగన్‌వన్నీ అసందర్భ ప్రేలాపనలు

**●హామీలపై చర్చకు సిద్ధమా? టీజీ వెంకటేష్ సవాల్**



**నంద్యాల, ఆంధ్రప్రభ :** తమ ప్రభుత్వం ఇచ్చిన నెరవేర్చలేదంటూ వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి చేస్తున్నవన్నీ అసంబద్ధ ఆరోపణలని తెలుగుదేశం పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యుడు టీజీ వెంకటేష్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. ఏయే హామీలు నెరవేర్చలేదో, ఎక్కడ అభివృద్ధి జరగలేదో వివరాలతో రావాలని ఆయన సవాల్ చేశారు. నంద్యాల నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఆయన బుధవారం 'ఆంధ్రప్రభ' ప్రతినిధితో మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేస్తున్న వ్యాఖ్యలు అసందర్భమైన ప్రేలాపనలన్నారు. ఎక్కడైనా పనులు జరగకపోతే ప్రభుత్వ దృష్టికి తేవాలి కదా అని ప్రశ్నించారు. 2014లో కేవలం రెండు వేల ఓట్లతో ఓడిపోయినప్పటికీ, ఉప ఎన్నికలో మాత్రం 20 వేలకు మెజారిటీని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీసీలతో మొదటి నుంచి టీడీపీ ప్రభుత్వం మమేకమవుతోందని, అదే ఒరవడిని ఇంకా కొనసాగుతోందన్నారు. కాపుల ఓట్లు చీలినట్టుగా అనిపించినా, ఇప్పుడు అంతా టీడీపీకే మద్దతుగా నిలిచేందుకు నిర్ణయించారని తెలిపారు. కాపుల విషయంలో ఎన్నికల ముందే వైసీపీ నేతలు చేతులెత్తేశారన్నారు. నంద్యాలలో గత మూడు సంవత్సరాలలో వైశ్యులు ప్రశాంతమైన జీవనం సాగిస్తున్నారని, కార్పొరేషన్‌ను బ్రాహ్మణుల కోసం ఏర్పాటు చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. మైనారిటీలకు కూడా టీడీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. చంద్రన్న తోఫా, ముస్లిం యువతులకు రూ.50 వేలతో పాటు నంద్యాలకు ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ పదవి కూడా లభించిందని తెలిపారు.షాపుల కూల్చివేతపై కూడా ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. బాధితులకు, నంద్యాల ప్రజలకు మేలు చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉప ఎన్నిక అనంతరం కూడా మరో రెండు సంవత్సరాలపాటు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని తెలిపారు. అందువల్ల అభివృద్ధి ఆగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

## వైకాపా నేత ఇంట్లో రూ.1.55 లక్షలు స్వాధీనం



**నంద్యాల రూరల్, కెఎన్ఎన్ :** నంద్యాల మండలంలోని చాబోలు గ్రామంలో వైసీపీ నేత బాల హుసేని ఇంట్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అతని ఇంట్లో రూ. 1.55 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అదనపు ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మికంగా తనిఖీలు జరిపి నగదుతోపాటు వైఎస్సార్ జెండాలను స్వాధీనం చేసుకుంది. అదనపు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై రమేష్‌బాబు తనిఖీల్లో పాల్గొన్నారు. బాల హుసేని మాట్లాడుతూ తాను బుధవారం బ్యాంక్‌లో బంగారు ఆభరణాలను కుదవ పెట్టి సొమ్ము తెచ్చుకున్నానని చెప్పారు. బ్యాంక్ రశీదులను చూపించినా ఆ డబ్బు నీకు ఎక్కడిదని ప్రశ్నిస్తూ నంద్యాల పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ తీసుకొని వెళ్లిపోయారన్నారు.

## సమస్యల పరిష్కారానికి ముందుంటా



రిటైల్ మర్చంట్స్ ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి అఖిలప్రియ

**నంద్యాల క్రైం, కెఎన్ఎన్ :** మెడికల్ అసోసియేషన్ సమస్యల పరిష్కారంలో ముందుంటానని మంత్రి అఖిలప్రియ అన్నారు. హోటల్ సూరజ్‌లో రాత్రి కాత్యాయని మెడికల్, మారుతి, డా. బాబన్ ఆధ్వర్యంలో రిటైల్ మెడికల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశానికి టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, డా. నౌమాన్‌తో కలసి ఆమె హాజరై మాట్లాడారు. అసోసియేషన్ కమ్యూనిటి హాల్ భవన నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు శేషఫణి, కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు మారుతి కుమార్, కోశాధికారి నాగరాజులు మాట్లాడుతూ గతంలో నాగిరెడ్డికి మద్దతు ఇచ్చామని, ఇప్పుడు భూమా కుటుంబానికి తమ సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, నూర్ బాష తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీకి షాక్!

**●సైకలెక్కిన మాజీ ఎంపీ ప్రతాప్‌రెడ్డి ●మలుపులు తిరుగుతున్న నంద్యాల రాజకీయాలు**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఉప ఎన్నికల వేళ నంద్యాల రాజకీయాలు మలుపులమీద మలుపులు తిరుగుతున్నాయి. వర్గ రాజకీయాలకు పెట్టింది పేరుగా ఉన్న కర్నూలు జిల్లాలో బలమైన వర్గాల్లో ఒకటిగా వున్న గంగుల వర్గం వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీకి గట్టిషాకే ఇచ్చింది. గంగుల సోదరుల్లో ముఖ్యులైన మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి సైకిలెక్కేశారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో గంగుల ప్రతాప్ రెడ్డితోపాటు అయన సోదరులు, సుదర్శన్ రెడ్డి , తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. మరో ఇద్దరు సోదరుల్లో ఎమ్మెల్సీగా ఉన్న ప్రభాకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీలోనే ఉండిపోయారు. ఫ్యాక్షన్ గడ్డగా పేరుమోసిన ఆళ్లగడ్డ నియోకవర్గం నుంచి పలు మార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి నంద్యాల పార్లమెంట్ నియోజక వర్గం నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన గంగుల ప్రతాప్ రెడ్డికి నంద్యాల ప్రాంతంలో బలమైన అనుచర వర్గం ఉంది. అంతే కాకుండా నంద్యాల మాజీ ఎమ్మెల్యే జి.రామిరెడ్డి కుటుంబంతో గంగుల కుటుంబానికి బంధుత్వం కూడా ఉంది.

ఆళ్లగడ్డ నియోజక వర్గం పరిధిలో ఉన్న గోస్పాడు మండలం గత ఎన్నికలకు ముందే నియోజక వర్గ పునర్విభజనలో భాగంగా ఆళ్లగడ్డ నుంచి వేరుపడి నంద్యాల అంసెబ్లీ నియోజకవర్గం పరిధిలోకి చేరిపోయింది. ఈ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గంగుల కుటుంబానికి బలమైన అనుచర వర్గం ఉంది. నంద్యాల ప్రాంతంలో ఉన్న గంగుల వర్గాన్ని దృష్టిలో ఉంచుకునే నంద్యాల ఉప ఎన్నికల్లో వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ఒక దశలో గంగుల ప్రతాప్ రెడ్డిని ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా నిలపాలనికూడా అలోచించినట్టు సమాచారం. ఇటీవలే గంగుల సోదరుల్లో ఒకరైన ప్రభాకర్ రెడ్డి తెలుగుదేశంపార్టీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగన్‌కూడా ఎమ్మెల్యే కోటా కింద ప్రభాకర్ రెడ్డికి పార్టీలో చేరిన రెండు వారాల్లోపే ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారు. ఊహించని రీతిలో శిల్పా మోహన్ రెడ్డి వైకాపాలో చేరిపోవటంతో నంద్యాల రాజకీయ సమీకరణలు చకచక మారిపోయాయి.

### విజయంపై పెరిగిన ధీమా

నంద్యాల ఉప ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఈ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఎలాగైనా గెలిచితీరాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న తెలుగుదేశంపార్టీ శ్రేణులకు గంగుల పార్టీలో చేరిక కొత్త ఉత్సాహాన్నిఇచ్చి గెలుపుపై ధీమాను పెంచింది. గంగుల కుటుంబంతో సన్నిహితంగా ఉండే జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు గంగుల ప్రతాప్ రెడ్డితో వారంరోజులుగా చర్చలు జరిపి ముఖ్యమంత్రి వద్ద గంగుల చేరికకు లైన్ క్లియర్ చేయించారు. నంద్యాల, గోస్పాడు మండ లాలతోపాటు నంద్యాల పట్టణంలో కూడా ఫాలోయింగ్ ఉన్న గంగుల పార్టీలో చేరిక ద్వారా మరింత బలం పెరిగిందని టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి

### అనుభవాన్ని ఉపయోగించుకుంటాం

తెలుగుదేశం పార్టీలో గంగుల ప్రతాప్ రెడ్డి వంటి సీనియర్ నేత రాజకీయ అనుభవాన్ని ఉపయోగిం చుకుంటామని టీడీపీ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి వద్ద గంగుల చేరిక ఆకస్మికంగా జరగటంతో ఏవిధమైన హంగు ఆర్బాటాలు కనిపించలేదు.


### భూమా విజయానికి గంగుల కృషి

ఆళ్లగడ్డ రాజకీయాల్లో భూమా, గంగుల కుటుంబాల మధ్య నాలుగు దశాబ్దాలకు పైగా వైరం నడుస్తోంది. ఈ రెండు కుటుంబాల్లో భూమా ఒక పార్టీలో ఉంటే గంగుల మరో పార్టీలో ఉంటూ వచ్చారు. ఈ రెండు వర్గాల మధ్య చాలాకాలం పాటు ఫ్యాక్షన్ రాజకీయాలు కూడా నడిచాయి. భూమా నాగిరెడ్డి మృతితో జరుగుతున్న నంద్యాల ఉప ఎన్నికల్లో భూమా కుటుంబం నుంచే భూమా బ్రహ్మానందరెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. గంగుల కుటుంబం సహకారం ఉంటే నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం మరింత సునాయాశం చేసుకోవచ్చని భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గంగుల, భూమా కుటుంబాలను కలిపే ప్రయత్నంలో భాగంగా మాజీ ఎంపి ప్రతాప్ రెడ్డిని సైకిల్ ఎక్కించారు.

ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల తిమ్మారెడ్డి తనయుడిగా తండ్రి రాజకీయ వారసత్వం అందిపుచ్చుకున్న ప్రతాప్ రెడ్డి 1976లోనే ఆళ్లగడ్డ వర్గ రాజకీయ పగ్గాలను అందిపుచ్చు కున్నారు. అప్పటి పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ రాజశేఖరెడ్డితో పాటు అంసెబ్లీలో సహచరుడుగా ఉంటూ వచ్చారు. 1989లో నంద్యాల ఎంపీగా కొంతకాలం ప్రాతినిధ్యం వహించి ఆ తరువాత ప్రధాని పీవి నరసింహరావు కోసం నంద్యాల స్థానానికి రాజీనామా చేసి ప్రతిఫలంగా రాజ్యసభ పదవిని దక్కించుకున్నారు. కాంగ్రెస్‌ను వీడి కొంతకాలం బీజేపీలో కూడా పనిచేశారు. తరువాత 2004లో తిరిగి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆళ్లగడ్డ నుంచి విజయం సాధించారు . 2009తరువాత క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్న గంగుల ప్రతాప్ రెడ్డి నంద్యాల ఉప ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీలో చేరి తిరిగి క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తున్నారు.

# మెజారిటీ లక్ష్యాలను నిర్దేశించుకోండి

**●సర్వే ఫలితాలతో ఆగొద్దు ●మంత్రులతో సీఎం చంద్రబాబు**



**నంద్యాల, ఆంధ్రప్రభ:** నంద్యాలలో తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీ సాధించేదిశగా లక్ష్యాలను నిర్దేశించాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. నంద్యాలలో పార్టీపరంగా నిర్వహించిన ఒక సర్వేలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి 15 వేల నుంచి 18 వేల మధ్య మెజారిటీ లభిస్తుందని తేలిందని సమాచారం. ఈ నేపథ్యంలోనే మంత్రి భూమా అఖిలప్రియ సర్వే సారాంశాన్ని ముఖ్యమంత్రికి నివేదించారని తెలిసింది. టీడీపీ గెలుపు తథ్యమనే రీతిలో ఆమె పార్టీ నాయకత్వం దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి బుధవారం అందుబాటులో వున్న నంద్యాల మంత్రులతో సంభాషించారని సమాచారం. సొంత సర్వేలో తేలిన మెజారిటీ చాలా తక్కువ అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి 40 వేలకు తక్కువ కాకుండా మెజారిటీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కోరినట్టు సమాచారం. ఒక్కోసారి అంచనాలు తారుమారవుతాయని, అలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వరాదనే రీతిలో మాట్లాడిన ముఖ్యమంత్రి, మంత్రులతో మరింత బాధ్యతలను మోపారని తెలిసింది. నంద్యాలకు అభివృద్ధి విషయంలో ఎన్ని నిధులైనా ఇచ్చేందుకు సుముఖతను వ్యక్తం చేసిన సీఎం మరో రెండు సంవత్సరాలుకూడా టీడీపీ ప్రభుత్వం అధికారంలో వుంటుంది కదా అని మంత్రుల దృష్టికి తెచ్చారు. విజయం సాధించేదాకా అలక్ష్యంగా వుండరాదని పేర్కొన్న ముఖ్యమంత్రి రాజకీయంగా నంద్యాలలో విజయం సాధించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. సర్వే ఫలితాలపై సంతృప్తిని వ్యక్తంచేసిన ముఖ్యమంత్రి నంద్యాలలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఈ మెజారిటీ చాలదనే రీతిలో స్పందించారని సమాచారం. గోస్పాడు, నంద్యాల రూరల్, నంద్యాల టౌన్ ప్రాంతాలలో తాజా ప్రచార సరళి, నందమూరి బాలకృష్ణ రోడ్‌షో, అనుసరించనున్న వ్యూహంపై కూడా ఆయన మంత్రులతో మాట్లాడినట్టు తెలిసింది.

## సీఎం పర్యటన ఖరారు

**● 19న రోడ్‌షో, 20న నేతలతో భేటీ**

ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు నంద్యాల పర్యటన ఖరారైంది. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపును కాంక్షిస్తూ 19న నిర్వహించే రోడ్‌షోలో ఆయన పాల్గొంటారని పార్టీ వర్గాలు బుధవారం నాడిక్కడ తెలియజేశాయి. 20న మధ్యాహ్నం వరకు చంద్రబాబు నంద్యాలలోనే వుంటారని, ఈ సందర్భంగా పార్టీ నేతలతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారని పేర్కొన్నారు. కాగా నంద్యాల పట్టణంతో పాటు గోస్పాడు, నంద్యాల రూరల్ మండలాల పరిధిలో ఎంపిక చేసిన ప్రాంతాలలో చంద్రబాబు రోడ్‌షోలో పాల్గొనే విధంగా పార్టీ కార్యక్రమాన్ని రూపొందిస్తోంది. రోడ్‌షో ముగిసిన అనంతరం సీఎం మరోవైపు మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అమరనాథరెడ్డి, సిహెచ్. ఆదినారాయణ రెడ్డి, అఖిలప్రియ, కాల్వ శ్రీనివాసులుతో ప్రత్యేకంగా మాట్లాడతారు. అదే స్థానిక నాయకులతో, మండలాలతోనూ నేరుగా చంద్రబాబు తాజా పరిస్థితిపై సమీక్షిస్తారు. ఐ.టి. శాఖల మంత్రి లోకేష్ కూడా 18న నంద్యాల ఎన్నికల ప్రచారంలో ఒకరోజు పాల్గొనే అవకాశాలున్నాయి. అయితే ఇందుకు సంబంధించి ఇంతవరకు పార్టీ వర్గాలనుంచి స్పష్టత రాలేదు. సీఎం పర్యటన తేదీలు దాదాపుగా ఖరారైన నేపథ్యంలో రోడ్‌షోలను విజయవంతం చేసేందుకు టీడీపీ నేతలు కార్యక్రమాలను రూపొందిస్తున్నారు.

# జనసేన తటస్థం

**●పార్టీ నిర్మాణం జరుగుతోంది ●నేరుగా సాధారణ ఎన్నికలకే వెళతాం ●మీడియాతో పవన్ కల్యాణ్**




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కర్నూలు జిల్లా నంద్యాల ఉపఎన్నికలతో పాటు కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లో తటస్థంగా ఉండాలని జనసేన పార్టీ నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం జరిగాకే నేరుగా ఎన్నికల బరిలోకి దిగుతామని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారు. నంద్యాల ఉపఎన్నికలు, కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లో తాము ఏ పార్టీకి మద్దతు ప్రకటించలేదని ఎవరైనా తమ పార్టీ మద్దతు ఉందని ప్రకటిస్తే ఆ విషయాన్ని ఎవరూ పరిగణలోకి తీసుకోవద్దని పవన్ బుధవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చెప్పారు. నంద్యాల ఉపఎన్నికల్లో జనసేన పార్టీ వైఖరేంటని అన్ని రకాల వర్గాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయని తాము మాత్రం ఈ ఎన్నికల్లో తటస్థంగా ఉండాలన్న నిర్ణయానికి వచ్చామని పవన్ తెలిపారు. ఇటీవల తాను విజయవాడ వెళ్ళినపుడు మీడియా ప్రతినిధులు నంద్యాల ఉపఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇస్తారన్న అంశాన్ని ప్రస్తావించారని తాను ఈ విషయంలో ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని త్వరలోనే ప్రకటిస్తానని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి నంద్యాల ఉపఎన్నికల్లో తమ పార్టీ తరపున మైనారిటీ అభ్యర్థిని పోటీకి పెట్టామని ఈ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని లేఖ కూడా రాశారని ఆయన అన్నారు. జనసేన పార్టీ నిర్మాణ దశలో ఉందని ప్రజల్లో తమ పార్టీకి మద్దతు ఉన్నప్పటికీ నంద్యాల ఉపఎన్నికనేనని సాధారణ ఎన్నికలు కాకపోవడంతో తాము తటస్థంగా ఉండదలుచుకున్నామని చెప్పారు. విజయవాడ వెళ్ళినపుడే నంద్యాల ఎన్నికల్లో తమ పార్టీ వైఖరిపై నిర్ణయం ప్రకటించి ఉండేవాడినని అయితే క్షేత్రస్థాయిలో రకరకాల వర్గాల నుంచి, పార్టీ శ్రేణుల నుంచి, రాయలసీమలోని ముఖ్యుల నుంచి అభిప్రాయాలను సేకరించాకే ఉపఎన్నికల్లో తటస్థంగా ఉండాలని నిర్ణయానికి వచ్చామని ఆయన తెలిపారు. నిజంగా తాము ఉపఎన్నికలో ఒక వైఖరి తీసుకుని ఉంటే సభాముఖంగా, మీడియా ముఖంగా తన నిర్ణయాన్ని ప్రకటించేవాడినని అన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ మద్దతు ఎవరికీ లేదని ఎవరైనా తమ పార్టీ మద్దతు ఉందని ప్రకటించి ఉంటే అది సత్యదూరమని ఆయన అన్నారు. 2019 ఎన్నికల వరకు జనసేన దూరంగా ఉండాలని నిర్నయించుకుందని క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం జరిగాకే ప్రత్యక్ష ఎన్నికలకు సిద్ధమవుతామని అప్పటిదాకా ఏ ఎన్నికలు జరిగినా దూరంగా ఉంటామని చెప్పారు. పార్టీ నిర్మాణం పూర్తయ్యాకే నేరుగా సాధారణ ఎన్నికల బరిలోకి దిగుతామని పవన్ వివరించారు.

## సర్వేలు నిషేధం: ఈసీ ఉత్తర్వులు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఉప ఎన్నికలు జరుగుతున్న నంద్యాలలో సర్వేలను నిషే ధిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు, ఆయా పార్టీల నేతలు, సంఘాలు ఓటర్లను కలిసి వారి మనోభావాలను, వివిధ ప్రశ్నావళితో కూడిన అంశాలను ప్రశ్నించవద్దని.. అలా చేసిన వారిపై చర్యలు తప్పవని ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఎగ్జిట్‌పోల్స్, ఎన్నికల ముందు ఎటువంటి సర్వేలు జరపరాదని ఆదేశించింది. నంద్యాలలో విద్యార్థుల పేరుతో కొంతమంది యువతీ, యువకులు ప్రజలను నేరుగా కలుస్తూ త్వరలో జరిగే ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తారంటూ ప్రశ్నలు స్పంది స్తున్నారని, మరికొంతమంది ఆయా పార్టీల ముసుగులో నేరుగా ఓటర్లను కలుస్తూ వారి మనోభావాలను తెలుసుకుంటున్నారని ఈసీ గుర్తించింది. అయితే సర్వేల పేరుతో నంద్యాల నియోజకవర్గంలో జరుగుతున్న యువతీ, యువకులపై ఓ రాజకీయ పార్టీకి చెందిన నేతలు దాడికి దిగి వారిని గాయపర్చిన సంగతి తెలిసిందే. దీంతో, రెండు ప్రధాన రాజకీయ పక్షాల మధ్య వైరం అంతకంతకు పెరిగింది. ఇరు పార్టీల నేతలు పోటాపోటీగా ఎన్నికల సంఘాన్ని కలిసి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాలను అధ్యయనం చేసిన రిటర్నింగ్ అధికారి ఎన్నికల సంఘానికి నివేదిక ఇవ్వడంతో సర్వేలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



జనం మధ్య వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి



నంద్యాల ప్రచారంలో నందమూరి



అవ్వతో జగన్ మాటామంతీ...

# భద్రతతోనే ఆనంద ఆంధ్రప్రదేశ్

**• ప్రజల భద్రత మీది..! మీ సంక్షేమం నాది..! • డీజీపీ కార్యాలయం ప్రారంభించిన సీఎం చంద్రబాబు**
**• రోబోల కంటే ఏపీ పోలీసు వేగం • దేశంలోనే ఆక్టోపస్ నెం.1**



**ఆంధ్రప్రభ, అమరావతి :** 'రాష్ట్ర ప్రజలకు మీరు భద్రత కల్పించండి. మీ సంక్షేమం ప్రభుత్వం చూసుకుంటుంది' అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలీసులు ఫిట్‌నెస్‌గా ఉన్నప్పుడే నేరస్తులు భయపడి ప్రజలకు భద్రత ఉంటుందని, అప్పుడే ఆనందాంధ్రప్రదేశ్ సాధ్యపడుతుందని ఆయన అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ఆవరణలో రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించిన ఐదంతస్తుల పోలీసు ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రపంచ అత్యుత్తమ సాంకేతికత ముందుగా అమరావతికి రావాలని, అది కూడా ఏపీ పోలీసులకు దక్కాలని ముఖ్యమంత్రి చెప్పారు. పోలీసింగ్ కనబడాలే తప్ప పోలీసులు కనబడరాదని సీఎం అన్నారు. తద్వారా రాష్ట్రాన్ని నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పోలీసు అధికారులు ప్రయత్నించాలన్నారు. రాష్ట్ర పోలీసులు వ్యక్తిగత సామర్థ్యంతో ఉన్నప్పుడే నేరస్తులు భయపడతారని ఆయన చెప్పారు. ఇందుకు ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్ పొంది స్మార్ట్‌గా ఉండటంతో పాటు నేరగాళ్లు చూసి భయపడే విధంగా తయారు కావాలన్నారు. పోలీసు సిబ్బంది భద్రత, రక్షణకు కూడా పలు చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా అధికారి నుంచి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరికి గృహ వసతి కలిపించనున్నామని ఆయన తెలిపారు.

### రోబోలను మించి పోయారు

రాష్ట్ర పోలీసులు రోబోల కంటే వేగంగా వెళుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కితాబిచ్చారు. ఆక్టోపస్ సిబ్బంది రోడ్డు మీద నడిచినట్లుగా భవనం గోడలపై నడుస్తూ దిగడం అద్భుతమన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతి పట్టణంలో పోలీసులు నిర్వహించిన విన్యాసాలు అద్వితీయమన్నారు. మోటారు సైకిళ్లపై వారు చేసిన విన్యాసాలు చూసి తాను గర్వపడ్డానని, అదే మాదిరి ఆక్టోపస్ కమాండోలు శత్రువులను తుదముట్టించేందుకు, బాధితులను రక్షించేందుకు చేసిన ప్రదర్శనలు కూడా తాను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు.

### మన ఆక్టోపస్ దేశంలోనే నెం.1

ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. గత 20ఏళ్ల కిందటనే గ్రేహౌండ్స్ పటిష్టతకు ఆలోచన చేసినట్లు చంద్రబాబు నాయుడు తెలిపారు. మత కలహాలు, కుల ఘర్షణలు, ఉగ్రవాద, తీవ్రవాద చర్యలు ఏమెదురైనా ఎదుర్కొనే విధంగా తీర్చిదిద్దేందుకు గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. ఇటీవల వస్తున్న ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఆక్టోపస్ నిర్వహిస్తున్న పాత్ర ప్రశంసనీయమన్నారు. ఆక్టోపస్, గ్రేహౌండ్స్ బలగాల సామర్థ్యాలను చూస్తే శతృవులు భయపడక తప్పదని సీఎం అన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన పోలీసు ప్రధాన కార్యాలయం చూసి ఎంతో ఆనందిస్తున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు కలిపించడం ఒక ఎత్తయితే, పని తీరులో సామర్థ్యం చూపించడం మరో ఎత్తన్నారు. ఇలాంటి స్థితిలో అతి తక్కువ వ్యవధిలోనే డీజీపీ కార్యాలయాన్ని నిర్మించడం పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. కార్పోరేట్ వ్యవస్థలో సైతం ఈ తరహా భవనాన్ని నిర్మించడం సాధ్యపడదని చెప్పారు. ఆక్టోపస్ సమకూర్చుకున్న అధునాతన ఆయుధాలు, పరికరాలను పరిశీలించి వారు చేసిన విన్యాసాలను తిలకించారు. భవన నిర్మాణంలో భాగస్వాములైన పోలీసు గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి, ఇతర ఇంజనీర్లు, క్వాలిటీ కంట్రోల్ పర్యవేక్షణ చేసిన సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫేసర్ పాండు రంగారావును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్‌రావు, హోంమంత్రి నిమ్మకాయల చిన రాజప్ప, రాష్ట్రమంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, పరిటాల సునీత, పితాని సత్యనారాయణ, కొల్లు రవీంద్ర, డీజీపీ నండూరి సాంబశివరావు, సీనియర్ ఐపీఎస్ అధికారులు ఏ.ఆర్.అనురాధ, ఆర్.పి.ఠాకూర్, ఎం.మాలకొండయ్య, గౌతమ్ సవాంగ్, ఏబీ వెంకటేశ్వరరావు, ఎన్వీఎస్ సురేంద్రబాబు, హరిష్ గుప్తా, మీనా తదితర ఐపీఎస్ అదికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంతో మంగోలియా రాయబారి సురేష్‌బాబు భేటీ

**• రాష్ట్రంలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఆసక్తి**

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో చేపడుతున్న పర్యాటక రంగ అభివృద్ధిలో ఏపితో కలిసి పనిచేసేందుకు మంగోలియా ఆసక్తిగా ఉందని మంగోలియా భారత రాయబారి డాక్టర్ టి.సురేష్‌బాబు అన్నారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైన డాక్టర్‌సురేష్‌బాబు పర్యాటక రంగంలో పరస్పర సహకారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు ప్రతిపాదనలను ఉంచిన రాయబారి సురేష్‌బాబు పచ్చదనం, సుందర ప్రదేశాలకు నెలవైన మంగోలియా ప్రాంతంలో తెలుగు సినిమా షూటింగులకు అత్యంత అనువైన ప్రాంతంగా సురేష్‌బాబు పేర్కొన్నారు. అలాగే అక్కడి జనాభాలో 80శాతం మంది ప్రజలు బుద్దిజంను ఆదరిస్తారని, బౌద్ధులకు అత్యంత ఇష్టమైన అమరావతిలో మంగోలియాప్ ప్రజలు స్నేహ సంబంధాలు కొరుకుంటున్నారని సురేష్‌బాబు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. అలాగే మైనింగ్ రంగంలో మంగోలియాలో అపారమైన అవకాశాలున్నాయని, ఈ రంగంలో మంగోలియా-ఆంధ్రప్రదేశ్‌లు కలిసి పనిచేద్దామని సురేష్‌బాబు ముఖ్యమంత్రి వద్ద ప్రతిపాదనలు చేశారు. అలాగే పొరుగు దేశమైన చైనా కంటే మంగోలియన్లకే భారతదేశం అంటే ఆదరాభిమానాలు ఎక్కువగా ఉన్నాయని ముఖ్యమంత్రికి సురేష్‌బాబు వెల్లడించారు. ఒకసారి మంగోలియా దేశాన్ని సందర్శించాలని ఆదేశ భారత రాయబారి సురేష్‌బాబు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. మంగోలియా రాయబారి ఆహ్వానాన్ని అందుకున్న సిఎం ముందుగా మంగోలియాకు ఈడీబీ బృందాన్ని పంపిస్తానన్నారు. అక్కడి పరిస్థితులను అధ్యయనం జరిపించి ఏయే రంగాలలో అవకాశాలు ఉంటాయో పరిశీలిస్తామని, ఆతరువాత తాను మంగోలియాను సందర్శిస్తానని సిఎం చంద్రబాబు సురేష్‌కుమార్‌తో అన్నారు.

# దేశంలోనే అత్యంత ఖరీదైన ఎన్నిక!

(మొదటిపేజీ తరువాయి)

నీలం సంజీవరెడ్డి నంద్యాల లోక్‌సభ స్థానం నుంచే గెలుపొందారు. అప్పటి లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 42సీట్లలో ఒక్కటంటే ఒకటే జనతాపార్టీకి దక్కింది. అది నంద్యాల లోక్‌సభ స్థానం. ఇక్కడ్నుంచి గెలుపొందిన నీలం సంజీవరెడ్డి ఏకంగా రాష్ట్రపతై కూర్చున్నారు. అలాగే పివి నరసింహరావు ప్రధానిహోదాలో ఇక్కడ్నుంచి బరిలో దిగారు. రికార్డుస్థాయి మెజార్టీతో విజయం సాధించారు. నంద్యాలకు అకుంఠిత చారిత్రక నేపథ్యం కూడా ఉంది. విజయనగర సామ్రాజ్యంలో నంద్యాల ప్రాంతం అత్యున్నత సిరిసంపదల్తో బాసిల్లింది. అతిపెద్ద ఆధ్యాత్మిక కేంద్రంగా ఇది విరాజిల్లింది. కళలు, సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా పేరొందింది. స్వతంత్ర సమరంలోనూ నంద్యాల కీలకపాత్ర పోషించింది. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ తదితరులు స్వతంత్ర పోరాట సమయంలో నంద్యాలలో పర్యటించారు. అలాంటి నంద్యాలలో సిద్ధాంతాలకు పాలనాపటిమకు, సానుభూతి, వారసత్వాలకు మధ్య ఇప్పుడు పోరు జరుగుతోంది. మూడున్నరేళ్ళ తన పాలనా విధానాలకు ప్రజల ఆమోదం పొందాలని అధికార పక్షం తహతహలాడుతుంటే రానున్న మహాసంగ్రామానికి నంద్యాల విజయంతోనే సమరసంఖం పూరించాలని ప్రధాన ప్రతిపక్షం ఉత్సాహం కనురుస్తోంది. ఇప్పటికే ఇక్కడ జరుగుతున్న ప్రచారం శృతిమించింది. సిద్ధాంతాలు, విధానాల స్థాయి నుంచి వ్యక్తిగత దూషణల వరకు చేరింది. అధికార, ప్రధాన ప్రతిపక్షాల మధ్య సవాళ్ళు, ప్రతిసవాళ్ళు నిత్యకృత్యమయ్యాయి. సానుభూతిపవనాలను ఓట్లరూపంలోకి మార్చుకునేందుకు తెలుగుదేశం ప్రయత్నిస్తోంది. విలువల్తో కూడిన రాజకీయాల్తో ప్రజల మెప్పుపొందాలని వైకాపా ఉత్సాహపడుతోంది. తానధికారంలోకొస్తే చేపట్టబోయే నవరత్న కార్యక్రమాలకు నంద్యాల ప్రజల ఆమోదం కావాలంటూ జగన్ పరితపిస్తున్నారు. ఇన్నాళ్ళు గా రాష్ట్ర పునర్‌నిర్మాణానికి చేస్తున్న కృషికి ప్రజలు ప్రోత్సాహమివ్వాలంటూ చంద్రబాబు కోరుతున్నారు. యువతతో పాటు గ్రామీణ ప్రాంతాల్ని లక్ష్యంగా చేసుకుని ప్రచారం సాగుతోంది. అభ్యర్థుల గుణగణాలు, స్థానిక పరిస్థితులకంటే కూడా ప్రధాన పార్టీల ప్రచారమే ఓటర్లపై అధికంగా ప్రభావం చూపుతోంది. కేవలం ఏడాదిన్నర కాలపరిమితున్న పదవి కోసం ఇంతటి స్థాయిలో ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడ్డం స్థానికుల్ని కూడా తీవ్ర ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అలా గే ఇరు పార్టీలు వందలకోట్లలో వ్యయం చేస్తున్నాయి. డబ్బులు విచ్చలవిడిగా వెద జల్లుతున్నాయి. దేశంలోనే దీన్నొక అత్యంత వ్యయభరిత ఎన్నికగా మార్చేస్తు న్నాయి. ఢిల్లీ నుంచొచ్చిన రాజకీయ ఎన్నికల పరిశీలకులు కూడా ఇక్కడి వ్యయా న్ని చూసి నోరెళ్ళబెట్టారు. ఈ స్థాయిలో ఎన్నికలు ఖరీదైనవిగా మారడం రానున్న తరాల్లో స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య పరిరక్షణకు విఘాతంగా వీరభివర్ణించారు. నంద్యాల ఎన్నిక ఫలితాలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌నే కాదు.. మొత్తం భారత రాజకీయ వ్యవస్థపైనే ప్రభావం చూపుతుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రానున్న కాలంలో జరి గే ఎన్నికల తీరును సమూలంగా మార్చేసే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు.

## కాకినాడ ఎన్నికల పిటిషన్లపై ముగిసిన వాదనలు

**• తీర్పును వాయిదా వేసిన హైకోర్టు**

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై వాదనలు పూర్తయ్యాయి. అయితే హైకోర్టు తన నిర్ణయాన్ని మాత్రం గురువారానికి వాయిదా వేసింది. ఈ వ్యాజ్యాలపై ఉమ్మడి హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ పి.నవీన్ రావు బుధవారం మరో సారి విచారణ చేపట్టారు. కాకినాడ నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించే నిమిత్తం, సీట్ల నిర్ధారణ, వార్డుల ఏర్పాటు, రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి పుర పాలకశాఖ ఈ నెల 2న జారీ చేసిన జీ వోను, తదను గుణంగా, ఈనెల 3న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎన్నికల ప్రకటనను సవాలు చేస్తూ..హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ సందర్భంగా ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ ..ఓ సారి ఎన్నికల ప్రకటన వెలుపవడ్డాక ఆ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై న్యాయస్థానం విచారణ జరపాల్సిన అవసరం లేద న్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ఆ విషయాన్ని స్పష్టం చేస్తుందన్నారు. ఎన్నికల ప్రకటన జారీ చేసే నాటికి నగర పాలక సంస్థకు 50 వార్డులు ఉండేవన్నారు. ఆ తర్వాత హైకోర్టు ఆదేశాలతో రెండు వార్డులకు ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. గురు వారం 3 గంటలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగుస్తుందన్నారు. కొంత గడువిస్తే పూర్తి వివరాలతో ప్రమాణ పత్రాలు దాఖలు చేస్తామన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తరపున న్యాయవాది ప్రభాకరరావు వాదనలు వినిపిస్తూ ..ఎన్నికల ప్రకటన జారీ చేశాక వ్యాజ్యాలపై విచారణ జరపకుండా చట్ట నిబంధనల్లో నిషేధం ఉందని తెలిపారు. పిటిషనర్లు చాలా ఆలస్యం గా హైకోర్టును ఆశ్రయించారన్నారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ఎమ్మెస్ ప్రసాద్, సి.నాగేశ్వరరావు, మరో న్యాయవాది శాంసన్ బాబు వాదనలు వినిపించారు. కాకినాడ నగరపాలక సంస్థలో 50 వార్డులకు గాను ప్రస్తుతం 48 వార్డులకే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇది చట్ట విరుద్ధమని, మేయర్ పదవిని ఏ రిజర్వేషన్ అభ్యర్థికి కేటాయించారో పేర్కొనలేదని పేర్కొనలేదు. అన్ని వివరాలు తెలుసుకునే హక్కు ప్రజలకుంది. నిబంధనలకు విరుద్ధంగా జరగబోతున్న ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేయాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు అభ్య ర్థించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తన నిర్ణయాన్ని నేటికి వాయిదా వేశారు.

## 29, 30 తేదీల్లో ఏపీసీఆర్డీఏ ప్రజావేదికలు

**అమరావతి, ఆంధ్రప్రభ :** అమరావతి రాజధానిలో మౌలిక వసతుల కల్పన అంశాలపై రాజధాని ప్రజలతో చర్చించేందుకు ప్రజావేదికలు నిర్వహిస్తున్నట్లు ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. ఈనెల 29న తుళ్లూరు, నీరు కొండ గ్రామల్లోనూ 30 వతేదీన అనంతవరం, వెంకటపాలెంలో ప్రజావేదికలు నిర్వహిస్తామని, ఈవేదికలో రైతులు, ప్రజలు తమ సూచనలను, సలహాలను అందించాలని ఆయన కోరారు. అమరావతి రాజధాని సమగ్ర అభివృద్ధి ప్రాజెక్ట్‌లో బాగంగా ప్రాధాన్య మౌలిక రంగాల ప్రాజెక్ట్‌లకు ప్రపంచ బ్యాంకు సహకారం అందిస్తొన్న సంగతి తెలిసిందే. అందులో బాగంగానే పది ప్రాధాన్యతలు ముఖ్యంగా రహాదారులు, వరద నియంత్రణ పనులు, ప్రాజెక్ట్‌లకు సంబంధించిన పర్యావరణ, సామాజిక నిర్వహణ, పునరావాస పాలసీ నిబందనల నివేధికలను ఏపీసీఆర్‌డీఏ వెబ్‌సైట్ లో అమరావతి కేపిటల్ సిటీ సస్టేయినబుల్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ ప్రజల పరిశీలనకు ఉంచినట్లు కమిషనర్ తెలిపారు. అదేవిధంగా పునరావాస కార్యాచరణ ప్రణాళిక, పర్యావరణ నిర్వహన వంటి సబ్ ప్రాజెక్ట్ ల నిబంధనలతో కూడిన నివేధికల్ని వైబ్ సైట్ లో ఉంచినట్లు కమిషనర్ సి. శ్రీధర్ స్పష్టంచేశారు.

### టీటీడీ నిధులు వినియోగించే అధికారం మీకెక్కడిది?

**• ఏపీ దేవాదాయశాఖను నిలదీసిన హైకోర్టు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తిరుమల తిరుపతి దేవస్థానం నిధులను వినియోగించుకునే అధికారం మీకెక్కడి? నుంచి వచ్చిందో చెప్పాలని హైకోర్టు ఏపీ దేవాదాయ శాఖను ఆదేశించింది. తిరుపతి విమానాశ్రయం నుంచి కలూరు కూడలి వరకు తిరుపతి తిరుమల పట్టణాభివృద్ధి సంస్థ (తు డా) చేపట్టిన బ్యూటిఫికేషన్ పనులకు రూ.పది కోట్ల నిధులను విడుదల చేయరాదని తితిదే కార్యనిర్వహణాధికారిని హైకోర్టు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ రోడ్డు సుందరీకరణ, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర పనులను సొంత నిధులతో చేపట్టవచ్చునని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రదాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పూర్తి వివరాలతో ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఆ రోడ్డు సుందరీకరణ పనులకు రూ.పది కోట్ల నిధులు విడుదల చేయాలని తితిదే ను అభ్యర్థిస్తూ ఏపీ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీ వోను సవాలు చేస్తూ తిరుపతి కి చెందిన పి.నవీన్ కుమార్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది జక్కుల శ్రీధర్ వాదనలు వినిపిస్తూ ..తితిదే నిధుల్ని ప్రభుత్వం వినియోగించడానికి వీలులేదని, అందుకు నిబంధనలు అనుమతించవన్నారు. అందువల్ల ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీ వో 699ని కొట్టివేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ..తితిదే నిధుల్ని వినియోగించే అధికారం మీకెక్కడుందని దేవాదాయ శాఖ తరపు ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. ఆ నిధులను విడుదల చేయరాదని తితిదే కార్యనిర్వాహణాధికారిని ఆదేశించింది. పూర్తి వివరాలతో ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

### వెంకయ్య కార్యదర్శిగా మాజీ ఐఏఎస్ అధికారి

**న్యూఢిల్లీ:** మాజీ ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కార్యదర్శిగా నియమితులయ్యారు. కేబినెట్ నియామకయ కమిటి ఆయనను రెండేళ్ల పాటు భారత ఉపరాష్ట్రపతికి కార్యదర్శిగా కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించింది. ఈ నియామకానికి సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) ఉత్తర్వులిచ్చింది. సుబ్బారావు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 1979 వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి. వివిధ హోదాల్లో ఆయన పనిచేసి ఆగస్టు 2015 లో రిటైర్ అయ్యారు.

### 21న ఉపరాష్ట్రపతికి పౌర సన్మానం

**• తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఇటీవల భారత ఉప రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తెలుగుబిడ్డ ముప్పవరపు వెంకయ్య నాయుడును రాష్ట్ర ప్రభుత్వం తరపున పౌర సన్మానం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నిర్ణయించారు. అందుకోసం ఈనెల 21న తేదీని ఖరారు చేశారు. తెలంగాణ ప్రజలు, ప్రభుత్వం తరపున రాజ్‌భవన్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. అదేరోజు పక్కనే ఉన్న దిల్‌కుషా ప్రభుత్వ అతిథి గృహం ప్రాంగణంలో మర్యాద పూర్వక విందును కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాజకీయ, ఆర్థిక, వ్యాపార ప్రముఖులను ఆహ్వానించనున్నారు.

### ఏపీ ఎన్ఐటీకి డైరెక్టర్ పదవి మంజూరు

**• ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రివర్గం**

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)కి కొత్తగా ఒక డైరెక్టర్, 3 బోధనేతర సిబ్బంది పదవులకు కేంద్ర మంత్రివర్గం పచ్చ జెండా ఊపింది. ఈ మేరకు బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఎన్ఐటీకి వరంగల్ ఎన్ఐటీ మెంటార్ సంస్థగా వ్యవహరిస్తోంది. వరంగల్ ఎన్ఐటీ డైరెక్టరే ఏపీ ఎన్ఐటీలో అడ్మిషన్లు, ఇతర పాలనా వ్యవహారాలను చూసుకుంటున్నారు. వరంగల్ ఎన్ఐటీకి చెందిన ముగ్గురు సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ ఎన్ఐటీలోనే ఉండి పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం డైరెక్టర్ పదవి సహా 3 కొత్త పదవులను కేంద్రం ఏర్పాటు చేయడంతో ఆంధ్రప్రదేశ్ ఎన్ఐటీకి స్వతంత్ర లభించినట్టే. కొత్తగా ఏర్పాటైన డైరెక్టర్ పదవికి మూల వేతనంగా రూ. 75,000 తో పాటు రూ. 5,000 ప్రత్యేక అలవెన్సుగా కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. బోధనేతర పదవుల్లో రిజిస్ట్రార్, లైబ్రేరియన్‌తో పాటు ప్రిన్సిపల్ (స్టూడెంట్ యాక్టివిటీ - స్పోర్ట్స్) ఉన్నాయి. 2015-16 విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు చేపట్టి కార్యకలాపాలు ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ ఎన్ఐటీకి తాత్కాలిక క్యాంపస్‌లో తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం జరుగుతోంది.

## పనులు ప్రారంభించని సంస్థల భూములు స్వాధీనం

**• తిరుపతి ఎలక్ట్రానిక్స్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్ -2కి కేంద్రం ఆమోదం • కాపులపాడ, మంగళగిరి ఐటీ టౌన్‌షిప్‌లకు త్వరగా మౌలిక వసతులు కల్పించాలి • ఏపీఐఐసీ అధికారుల సమీక్షలో మంత్రి లోకేష్**



**అమరావతి, ఆంధ్రప్రభ :** భూములు తీసుకొని ఏళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించని కంపెనీలకు భూకేటాయింపులు రద్దు చేసి ఆభూమిని ఏపీఐఐసీ స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. సచివాలయంలో బుధవారం ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వ హించిన ఆయన అనంతపురంలో నిర్మి స్తున్న ఇంక్యుబేషన్ సెంటర్, తిరుపతిలో నిర్మిస్తున్న ఐ.టి బిజినెస్ సెంటర్, విశాఖపట్నంలో నిర్మి స్తున్న మిలీనియం టవర్స్ పనులు గురుంచి మంత్రి లోకేష్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కాపులపాడ ఐటీ టౌన్ షిప్, మంగళగిరి ఐటీ స్పేస్ లో మౌలిక వసతుల కల్పన త్వరగతిన పూర్తి చేయాలని సూచించారు. దీంతోపాటు ఐటీ కంపెనీలు రాష్ట్రానికి రావడానికి కావాల్సిన ఆఫీస్ స్పేస్ నిర్మాణం యుద్ద ప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ తిరుపతి ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ 2కి కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మంత్రి లోకేష్‌కు వివరించారు. ఈ సమావేశం లో ఐటి సెక్రటరీ విజయా నంద్, ఏపిఐఐసి ఎండి బాబు, ఏపీ ఇన్నోవేషన్ సొసైటి సీఈఓ వల్లి కుమారి, ఏపీ ఐటీ అడ్వైజర్ జేఏ చౌదరి, ఏపిఎన్ఆర్టీ చైర్మన్ వేమూరు రవి తదితరులు పాల్గొన్నారు.

#### కంపెనీలు వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి


రాష్ట్రంలో పెట్టబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన కంపె నీలకు వీలైనంత త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం సచివాల యంలోఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ, ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన ప్రతి వారం జరుగుతున్న పనులపై రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో పెట్టబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన కంపెనీలతో జరిగిన ఒప్పందాలు, జరుగుతున్న పనులను కంపెనీల వారీగా లోకేష్ సమీక్షించారు. విశాఖపట్నంలో ఫింటెక్ వ్యాలీ ఏర్పాటుకు వీలైనంత త్వరాగా పూర్తిచేయాలని, ఫింటెక్‌లో గ్లోబల్ లీడర్స్గా ఉన్న కంపెనీలను రాష్ట్రంలో పెట్టబడులు పెట్టడానికి ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఈసంవత్సరం జనవరి నుండి జులై వరకూ రాష్ట్రానికి 7100 ఉద్యోగాలు 1,982 కోట్లు పెట్టుబడులు వచ్చాయని మంత్రి లోకేష్ కు వివరించారు. ఈసమావేశంలో సంబధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

#### స్టార్టప్ కంపెనీలు గ్లోబల్ లీడర్స్‌గా ఎదిగేందుకు ప్రోత్సాహం

స్టార్టప్ కంపెనీలు గ్లోబల్ లీడర్స్ గా ఎదిగేందుకు ప్రోత్సాహం అందిచాలని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం సచివాలయంలో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన వారికి కావాల్సిన ఆఫీస్ స్పేస్ , ప్రొడక్షన్ స్పేస్, మౌలిక వసతులు కల్పించా లని అధికారులను ఆదేశించారు. నాస్కామ్, గోవిన్, ఎక్స్ఎల్ఆర్ 8 ఇంక్యుబేషన్ సెంటర్స్ పనితీరుపై చర్చించారు. అదేవిధంగా స్మార్ట్ సిటీ ఇన్నోవేషన్ ల్యాబ్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్, డ్రోన్ ఇంక్యు బేషన్ సెంటర్ ఏర్పాటుపై చర్చ జరిపారు. ఇంక్యుబేషన్ సెంటర్ల ద్వారా ఏర్పాటవుతున్న స్టార్టప్ కంపెనీలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈసమీక్షా సమావేశంలో సంబధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం

**• రైతుల ఆదాయ పెరుగుదలకు కార్యాచరణ • ఉద్యాన పంటల అభివృద్ధికి రూ. 1463.31 కోట్లు • స్థూల ఆదాయ ఉత్పత్తి విలువ రూ. 62,114 కోట్ల లక్ష్యం • ఈ ఏడాది 21,479 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటల సాగు • 15,993 హెక్టార్లతో పాత తోటల పునరుద్ధరణ • కరవు ప్రాంతాల్లో 726 నీటి కుంటల నిర్మాణం • ఉద్యాన ప్రదర్శనకు అనూహ్య స్పందన**



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన వన పంటల సాగును ప్రోత్సహిస్తూ రైతుల ఆదాయాన్ని మరింత రెట్టింపు జేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళుతున్నది. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం కూడా గణణీయంగా పెరిగింది.గత మూడు సంవత్సరాలుగా ఉద్యాన పంటల సాగు ,బిందు సేద్యానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ, అదే రీతిలో నిధుల కేటాయింపును కూడా ఇబ్బడిముబ్బడిగా పెంచడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.2014 -15 ఆర్థిక సంవత్సరంలో రూ. 420 కోట్లు, 2015 - 16లో రూ. 726 కోట్లు, 2016 - 17 ఆర్థిక సంవత్సరంలో 887 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించడం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ. 1463 కోట్లు కేటాయించడం గమనార్హం. సాధారణ పంటల సాగు నుంచి అత్యధిక దిగుబడులు తద్వారా అధిక ఆదాయం వచ్చే ఉద్యాన పంటల వైపు రైతుల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటుంది. ఇదే సందర్భంలో రైతులకు అనేక ప్రొత్సహకాలు ఇస్తూ ఆదరిస్తుంది. 2016 - 17 స్థూల ఆదాయ విలువలో ఉద్యాన రంగ వాటా రూ. 52,489 కోట్లుగా ఉండడం విశేషం. అదే విధంగా 2017- 18 ఆర్థిక సంవత్సరానికి స్థూల ఆదాయ ఉత్పత్తి విలువ రూ. 62,114 ల లక్ష్యంగా ప్రభుత్వం ఎంచుకుని,ఆ దిశగా చర్యలు తీసుకుని, రైతులకు భరోసాగా నిలుస్తుంది. ఇది గత సంవత్సరం కంటే 18.23 శాతం ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరంలో 21,479 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి, అరటి,బొప్పాయి.జీడి మామిడి, కోకోవా తదితర పంటల కొత్త తోటల ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. అదే విధంగా 15,993 హెక్టార్లలో దిగుబడి తక్కువ నిచ్చే మామిడి,జీడిమామిడి తోటలను పునరుద్దరించడంతో పాటు కేనోపీ మేనేజ్‌మెంట్ పథకాల ద్వారా ఉత్పత్తిని పెంచుటకు ప్రయత్నాలు చేస్తున్నారు. నీటి ఎద్దడి ,కరవు పరిస్దితులలో పండ్ల తోటలకు అవసరమైన నీటి తడులను అందించుటకు 726 నీటి కుంటలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. రక్షితసేద్య పథకం ద్వారా 6,36,545 చదరపు కిలో మీటర్లలో పాలీ హౌస్‌లు, షెడ్‌నెట్ హౌసులు నిర్మించి, అధిక విలువ కలిగిన పూలు,కూరగాయల ఉత్పత్తిని ప్రొత్సహించడం జరుగుతున్నది. 11,500 హెక్టార్లలో ఆయిల్ పామ్ తోటలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్దం చేశారు. సేంద్రీయ,సహజ వ్యవసాయన్ని విశాఖ, తూర్పు గోదావరి,ప్రకాశం,కర్నూలు,అనంతపురం,చిత్తూరు,కృష్ణా జిల్లాల్లో అమలు చేస్తున్నారు. ముఖ్యంగా మామిడి, జీడి మామిడి, కూరగాయల పంటలలో సేంద్రీయ పద్దతులు పాటించుటకు 'ఎకోవా ', సిమ్‌ఫెడ్ కంపెనీలు ఒక్కొక్కరికి 4250 హెక్టార్లను లక్ష్యంగా కేటాయించి, ఉద్యాన శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అదే విధంగా రాష్ట్రంలోని లక్ష మంది కొబ్బరి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, పశ్చిమగోదావరి, చిత్తూరు జిల్లాల్లో ప్రభుత్వం కొబ్బరి బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది.

#### ఉద్యానవన ప్రదర్శనకు అనూహ్య స్పందన

సేంద్రీయ పంటల ఉత్పత్తి,ఉత్పత్తుల మార్కెటింగ్, నర్సరీ యాజమాన్యం, ఉత్పత్తుల ఎగుమతులను దృష్టిలో ఉంచుకుని సీఐఐ,ఐసీసీఓఎ సౌజన్యంతో ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి విజయవాడలో నిర్వహిస్తున్న సేంద్రీయ,నర్సరీ ఎక్స్‌పో-2017 కు అనూహ్యమైన స్పందన లభిస్తుంది. అన్ని జిల్లాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి,ప్రదర్శనలోపాల్గొని,సేంద్రీయ ఉత్పత్తుల గురించి,ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. రైతులు,రైతు సంఘాలు ఉత్పత్తి చేసిన, చేస్తున్న సేంద్రీయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలకు కూడా ఈ ఎక్స్‌పో వేదికగా ఉపయోగపడుతుంది. ఈ ఎక్స్‌పోలో దాదాపు 127 స్టాల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. 42 సేంద్రీయ స్టాల్స్ కాగా, 17 నర్సరీ ,9 నీటిపారుదల విభాగం, మిగిలినవి రైతులు,ప్రభుత్వానికి సంబంధించిన స్టాల్స్ ఉన్నాయి.ఈ ఎక్స్‌పో రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.పంట సాగు దగ్గర నుంచి గిట్టుబాటు ధర,మార్కెటింగ్ అవకాశాలు,ఎగుమతులు ఎలా చేయాలనే అనేకాంశాలు తెలుసుకోగలుగుతున్నామని పలువురు రైతులు పేర్కొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 17 ఆగస్టు 2017

# జెండా పండుగలోనూ రాజకీయమేనా?

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, విద్యా సంస్థలూ, ఇతర పబ్లిక్ ప్రదేశాల్లో త్రివర్ణ పతాకాన్ని ఎవరు ఆవిష్కరించాలనే అంశంపై నియమ నిబంధనలు, విధి విధానాలు చాలా కాలంగా అమలులో ఉన్నాయి. అందుకు భిన్నంగా ఎవరు చేసినా అది ప్రోటోకాల్ ఉల్లంఘనవుతుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు ఆ అవకాశం ఇవ్వడం వల్ల అదే జిల్లాకు చెందిన మంత్రులు సొంత జిల్లా కేంద్రాల్లో పతాకావిష్కరణచేసే అవకాశాన్ని కోల్పోవడం మనం చూస్తున్నాం. విద్యా సంస్థల్లో జాతీయ పతాకావిష్కరణ ఆయా సంస్థల అధిపతులే నిర్వహించాలన్న ఆదేశాలు ఉన్నప్పటికీ, సంఘ్ పరివార్ అధినేత (ఆర్ఎస్ఎస్ చీఫ్) మోహన్ భగవత్ కేరళలోని పాలక్కాడ్ జిల్లాలోని ఒక పాఠశాలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సంఘటన వివాదాస్పదమైంది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రా ల్లో కూడా ఇలాంటి ఆదేశాలు జారీ అయ్యాయి. విద్యాసంస్థల్లో వాటి అధిపతులు మాత్రమే పతాకావిష్కరణ చేయాలనీ, జాతీయ గీతాన్ని ఆలపించాలని ఆ ఆదేశంలో స్పష్టంగా పేర్కొన్నారు. కేరళలో అందుకు భిన్నంగా జరిగింది. అక్కడ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించింది సంఘ్ పరివార్ స్థానిక నాయకులైతే పెద్దగా పట్టించుకోనవసరం లేదు. సాక్షాత్తూ సంఘ్ పరివార్ అధినేత ఆ పాఠశాలలో పతాకావిష్కరణ కోసం ప్రత్యేకంగా అక్కడికి వెళ్ళడం వెనుక వేరే ప్రయోజనం ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కేరళలో సంఘ్ పరివార్ శక్తులు బలం పుంజుకోవడానికి గడిచిన కొద్ది నెలలుగా ప్రయత్నిస్తున్నాయి. వారి యత్నాలను రాష్ట్రంలో అధికారంలో ఉన్న మార్క్సిస్టు పార్టీ సహజంగానే వ్యతిరేకిస్తోంది. ఇరు వర్గాల మధ్య తరచూ ఘర్షణలకు పరాకాష్టగా ఇటీవల రాజేష్ అనే ఆర్ఎస్ఎస్ కార్యకర్త హత్యకు గురయ్యారు. ఈ నేపథ్యంలో సంఘ్ పరివార్ తన సత్తాను చూపేందుకు ఇటీవల రాష్ట్రంలో పలు సమావేశాలను నిర్వహించింది. ఇప్పుడు మోహన్ భగవత్ నిబంధనలను ఉల్లంఘించి ఒక పాఠశాలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడాన్ని ఈ కోణం నుంచే చూడాలి. కేరళలో సంఘ్ పరివార్‌కి బలం ఉన్న ప్రాంతాలు ఇంకా ఉన్నాయి. తమ బలాన్ని ప్రదర్శించడానికి ఒక పాఠశాలనే భగవత్ ఎందుకు ఎంచుకున్నారన్న ప్రశ్నకు సంఘ్ పరివార్ నుంచి సహేతుకమైన సమాధానం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం పెత్తనం ఏమీ లేదనీ, రాష్ట్రాల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు తమ ప్రభుత్వం ఎటువంటి అవరోధం కలిగించడం లేదనీ, సహకార సమాఖ్య (కోఆపరేటివ్ ఫెడరలిజం) ను తమ ప్రభుత్వం తుచ తప్పకుండా పాటిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట బురుజుల నుంచి చేసిన ప్రసంగంలో ఘనంగా ప్రకటించారు. కేరళలో పాలక్కాడ్‌లోనూ, త్రిపురలోనూ అందుకు భిన్నంగా జరిగింది.

త్రిపురలో ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి, దూర్‌దర్శన్ ద్వారా చేసిన ప్రసంగంలో ఆ శాఖ వారు కత్తిరింపులు చేశారు. రాష్ట్రాల్లో అవినీతి గురించి ప్రధాన మంత్రి చేసిన ఆరోపణలకు ప్రత్యుత్తరంగా ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఇచ్చిన వివరణలను ఆయన ప్రసంగం నుంచి తొలగించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని అడ్డగోలుగా కత్తిరించడం సహకార సమాఖ్య విధానానికి భంగకరమే. రాష్ట్రాల్లో పరిస్థితిపై ప్రధానమంత్రి వివరించినప్పుడు తమ రాష్ట్రంలో యధార్థ పరిస్థితి గురించి వివరించే అధికారం ముఖ్యమంత్రికి ఉంది.

రేడియో, దూర్‌దర్శన్‌లలో తన ప్రసంగంలో మాణిక్ సర్కార్ ఇచ్చిన వివరణలు ప్రజలకు చేరకుండా సెన్సార్‌కి గురి కావడం ఆయనకు అవమానకరమే. రెండు వైపుల వాదనలు ప్రజల ముందు ఉంచినప్పుడే వార్తాప్రసార సాధనాలు నిష్పాక్షికంగా వ్యవహరించినట్టవుతుంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఆకాశవాణి, దూర్‌దర్శన్ ఏకపక్షంగా ప్రభుత్వానికి బాకాగా మారాయంటూ బీజేపీ మాతృక అయిన భారతీయ జనసంఘ్ నాయకులు అదే పనిగా ఆరోపించేవారు. ఇప్పుడు అదే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ఏకపక్ష విధానాన్ని అనుసరించడం బీజేపీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం.

జాతీయ పతాకావిష్కరణ విషయమే తీసుకుంటే, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చే వరకూ జాతీయ పతాకావిష్కరణల విషయంలో బీజేపీ వారు, సంఘ్ పరివార్ నాయకులు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. 2002లో వాజ్‌పేయి ప్రభుత్వం ఫ్లాగ్ కోడ్ (పతాకావిష్కరణ నియమావళి)ని ప్రకటించింది. ప్రోటోకాల్‌ని కూడా నిర్దేశించింది. అంటే ఎవరెవరు ఎక్కడ పతాకాన్ని ఆవిష్కరించాలో కూడా నిర్దేశించింది. ఇప్పుడు మోహన్ భగవత్ అందుకు భిన్నంగానే పతాకావిష్కరణ చేశారు. పైగా, జాతీయగీతాన్ని బదులు వందే మాతరం గీతాన్ని ఆలాపింపజేసి హడావుడిగా వెళ్ళిపోయారు. ఆ తర్వాత వెళ్ళిపోతున్న జనాన్ని వెనక్కి పిలిచి జాతీయగీతాలాపన ఏర్పాటు చేశారు. జెండా పండుగను కూడా రాజకీయం చేయడానికి సంఘ్ పరివార్ పెద్దలు వెనకాడరనడానికి ఇదే నిదర్శనం.


## రైతు భారతం పుస్తకానికి సలహాలు, సూచనలు, వ్యాసాలు పంపించండి

సెప్టెంబర్ 21న న్యూఢిల్లీలో విజ్ఞాన భవన్ నందు నేషనల్ కో- ఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సహకార భారతి కార్యక్రమం జరగనున్నది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారు. సహకార వ్యవస్థ భారతదేశంలో మరింత బలోపేతం కావాల్సిన అంశం గురించి, సహకార రంగంలో తీసుకురావలసిన సంస్కరణల గురించి, రైతుల సంక్షేమానికి మరిన్ని ప్రోత్సాహకాలు, రాయితీలు ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంలో వివిధ రంగాల నిష్ణాతులు సూచనలు ఇవ్వనున్నారు. అతిముఖ్యమైన 1250 మందిని మాత్రమే ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా ముద్ర అగ్రికల్చర్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రధాని చేతుల మీదుగా రైతు భారతం పుస్తకాన్ని ఆవిష్కరింపజేస్తున్నాము. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషలలో ఈ పుస్తకం ప్రచురితమవుతోంది. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఇటీవల ఢిల్లీ నుండి వాద్ నగర్‌కు నాలుగు రాష్ట్రాలలో 900 కి.మీ.లు రైతు చైతన్యయాత్ర పేరుతో జరిపిన పాదయాత్రలో అనేకమంది రైతులతో జరిపిన ముఖాముఖి చర్చల వివరాలను కూడా పొందుపరుస్తున్నాము. అమూల్యమైన అంశాలతో రూపొందిస్తున్న రైతు భారతం పుస్తకానికి అనేకమంది నుంచి సలహాలు, సూచనలు, వ్యాసాలు స్వీకరిస్తున్నాము. వీటిని సెప్టెంబర్ 7వ తేదీలోగా పంపించాలని మనవి. ఉత్తమ వ్యాసాలకు కొంతమేర నగదు బహుమతులు అందజేయబడును.

**-తిప్పినేని రామదాసప్ప నాయుడు**
**ఛైర్మన్, ముద్ర వ్యవసాయ నైపుణ్యాభివృద్ధి బహుళార్థ సహకార సంఘం**
**9989818212**


**మంచి మాట**

**కుటుంబం కోసం త్యాగం చేసేవాడు ఉన్నతుడైతే, దేశం కోసం త్యాగం చేసేవాడు మహాత్ముడవుతాడు.**



● గాంధీ

# ఘోర..క్‌పూర్...






స్వాతంత్ర్య సిద్ధించి 70 సంవత్సరాలు నిండటానికి కొద్ది రోజుల ముందు సుమారుగా 70మంది పసికందులు మృత్యువాత పడటం అత్యంత బాధాకరం. వీరి మృతికి కారణం ఆక్సిజన్ కొరత కావడం మరింత దయనీయం. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూ ర్‌లోని బిఆర్డీ వైద్య కళాశాల ఈ చిన్నారుల ప్రాణాలను చిదిమేసింది. ఇవి హత్యలు తప్ప మరోటి కాబోవు. కానేరవు. ఈ మరణాలకు బాధ్యత ఎవరు తీసుకుంటారు? ముఖ్యమంత్రా? ఆరోగ్య శాఖ మంత్రా? ప్రధాన మంత్రా?

సంఘటన జరిగింది ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ సొంత జిల్లాలో కావడం దీనికి మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. తప్పును అంగీకరించాల్సింది పోయి, జపనీస్ ఎన్సఫలైటిస్ కారణంగానే చిన్నారులు మృత్యువాత పడ్డారని ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నించారు. రెండు దశాబ్దాలు గోరఖపూర్‌కు పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించిన యోగి ఇక్కడ తెలుసుకోవాల్సింది ఒకటుంది. చిన్నారుల మృతికి సంబంధించి నిర్వహించిన చర్చలలో ఆరోగ్య, కుటుం సంక్షేమ శాఖ మంత్రిత్వ శాఖను ఆయనే స్వయంగా 90 ప్రశ్నలు వేశారు. ప్రతి ఏటా తూర్పు ఉత్తర ప్రదేశ్‌లో సంభవిస్తున్న చిన్నారుల మరణ మృదంగానికి సంబంధించిన కారణం యోగికి బాగా తెలుసు. తెలుసున్నప్పుడు వాటిని నిరోధించే చర్యలను ఆయన ఎందుకు తీసుకోలేదన్నది ప్రశ్న.

టొమేటోలు లేదా ఉల్లిపాయల ధరలు ప్రభుత్వాల్ని మోకాళ్ళ మీద వంగునేలా చేస్తాయి..దురదృష్టవశాత్తూ చిన్నారుల మరణాలు వాటిని కనీసం కదిలించలేకపోతున్నాయి. ఎందుకంటే వారు ఓటర్ల జాబితాలో లేకపోవడమే. అదే దురదృష్టం.

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోడీ గోరఖపూర్ దుర్ఘటనను ప్రస్తావించారు. జరిగేది జరుగుతుందనేవైఖరి నుంచి పరిస్థితుల్ని మార్చాలి అనే దిశగా తిప్పేందుకు ప్రయత్నించాలని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన మాటలు మాత్రం పరిస్థితుల్ని మార్చగలవా? లేవు. నిర్లక్ష్యం కారణంగానే ఈ మరణాలు సంభవించాయని పేర్కొంటూ సంబంధితులపై హత్యానేరాన్ని మోపాలి. కొరడా ఝుళిపిస్తే తప్ప...పాఠాలు నేర్చుకునే తత్వం ప్రస్తుతం కనిపించడం లేదు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ లేదా శిశు వైద్య విభాగ అధిపతినో సస్పెండ్ చేయడం దీనికి పరిష్కారం కాదు. తీసుకునే చర్య కఠినంగా, అందర్నీ ఉలిక్కిపడేలా.. అప్రమత్తమయ్యేలా ఉండాలి. రాజకీయ నేతల్నుంచి, వైద్యులు, అధికారుల వరకూ తద్వారా స్పష్టంగా సంకేతాలివ్వాలి. ఈ అంశంలో నేర కోణాన్ని ఇప్పుడు పరిశీలిద్దాం. ఆక్సిజన్ సరఫరాను నిలిపివేయడం వల్ల చిన్నారులు మరణించారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్సిజన్ సరఫరాను హఠాత్తుగా ఆపేశారా? లేదు. ఆ వైద్య శాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేసే, పుష్పసేల్స్ కంపెనీ బకాయిలు చెల్లించాలంటూ అనేక లేఖలు రాసింది. ఆఖరుకు ప్రిన్సిపల్‌కు బకాయి 70 లక్షల రూపాయలు చెల్లించాల్సిందిగా డిమాండ్ చేస్తూ, లీగల్ నోటీసు కూడా పంపింది. కానీ, ఈ విషయంలో ప్రిన్సిపల్ ఎటువంటి చర్యా తీసుకోలేదు. జూలై 30న లీగల్ నోటీసు పంపింది. స్పందన లేకపోవడంతో ఆక్సిజన్ సరఫరా నిలిపేయడం తప్ప, తమకు ప్రత్యామ్నాయం లేదని ఆగస్టు 1న తెలిపింది. బ్యాంకులకు, జీతాలకు చెల్లింపులు చేయాలంటే బకాయిలు చెల్లించకపోతే సాధ్యం కాదనీ పేర్కొంది. ఇవేవీ మెడికల్ కళాశాలలో చలనాన్ని తెప్పించలేకపోయాయి. ఆగస్టు 5 ప్రభుత్వం కాలేజీకి నిధులు విడుదల చేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి అశుతోష్ టాండన్ చెబుతున్నారు. అయినా ప్రిన్సిపల్‌లో స్పందన లేదు. దుర్ఘటనకు మూడు రోజుల ముందు ముగ్గురు ఆపరేటర్లు శిశు వైద్య విభాగ అధిపతికి అత్యవసర సందేశం పంపారు. ఆక్సిజన్ సరఫరా ఆందోళనకర స్థాయిలో పడిపోతోందన్నది ఆ సందేశం. ఈ సందేశానికి సైతం అధికారులను కదిలించలేదు. ఎందుకు స్పందించలేదు. ఆరోగ్య శాఖ మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్ వద్ద దీనికి బదులుంది. బకాయిలు 68 లక్షలు మాత్రమే ఉండగా, ఆగస్టు 5న ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం 2 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. కానీ, ఆస్పత్రి పాలనా విభాగం ఆగస్టు 11వ తేదీన కేవలం 11 లక్షలను మాత్రమే చెల్లించింది. ఎందుకు? తమకు రావాల్సిన కమిషన్ కోసమేనంటూ సింగ్ వ్యాఖ్యానించారు. డబ్బు యావ, కమిషన్ల కక్కుర్తి పిల్లల ఉసురును కర్కశంగా తీసేశాయని మన మాటల్లో చెప్పుకోవచ్చు. ఇది హత్య కాకపోతే మరేమిటి? ఆరోగ్య శాఖ మంత్రి సింగ్ సరైన కారణాన్ని కనుగొన్నారు. ఆక్సిజన్ లేక పిల్లలు మరణించలేదన్నది యోగి వాదన. 70 మంది పిల్లల మరణాలకూ యూపీ ప్రభుత్వం 70 కారణాలను చెప్పచ్చు. అందులో బ్రెయిన్ డ్యామేజి, సెరిబ్రల్ పాల్సీ, బరువు తక్కువగా పుట్టటం, సెప్సిస్, పౌష్టికాహార లోపం వంటివన్నమాట. చనిపోయిన శిశువుల్లో నెలలు నిండకుండానూ, తక్కువ బరువుతోనూ పుట్టినవారే. ఇందులో అనేకుమంది సెప్సిస్ వల్ల బాధపడుతున్నారు. హైపోక్సిక్ ఇస్మిక్ ఎన్‌సెఫాలోపతి, మూత్ర పిండాల వ్యాధులు, ఊపిరికి సంబంధించిన వ్యాధులు, హెపటిక్ ఎన్సెఫలోపతి, పౌష్టికాహార లోపం, చిన్నతనంలో సంక్రమించే కామెర్లు, న్యూమోనియా వంటి రుగ్మతలు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని విషమింపచేశాయి. బరువు తక్కువగా ఉండి జన్మించిన శిశువులు జీవించే అవకాశం తక్కువనీ, ఆక్సిజన్ అందకపోవడం ఒక కారణం మాత్రమేననీ ముఖ్యమంత్రి యోగి తప్పించుకోజూస్తున్నారు. వ్యాధిగ్రస్తులైన చిన్నారులకు ఆక్సిజన్ అందించడం మాత్రమే జీవనదాయని అనే లాజిక్‌ను ఆయన మిస్సవుతున్నారు. స్వతంత్ర విచారణతోనే అసలు నిజం బయటకు రాగలదు. తూర్పు యూపీలోని 300కిలోమీటర్ల పరిధిలో మెదడు వాపు వ్యాధి తీవ్రంగా ఉంది. నాలుగు దశాబ్దాలుగా గోరఖ్‌పూర్‌ను పట్టిపీడిస్తోంది. గోండా, బస్తీ, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలు, నేపాల్‌లోని తెరాయ్ నుంచి చిన్నారులను వైద్య చికిత్సకు బీఆర్డీ మెడికల్ కాలేజీకి తీసుకొస్తుంటారు. ప్రస్తుత ఘటన యూపీ ప్రభుత్వాన్నే కాకుండా కేంద్రాన్నీ మేల్కొలిపింది. నాలుగు దశాబ్దాల తరవాత ఈ స్థాయిలో చిన్నపిల్లలు మృత్యువాత పడడం వారి కళ్ళు తెరిపించింది. శిశు వ్యాధులపై పరిశోధనకు 85 కోట్ల రూపాయల ఖర్చుతో ఒక కేంద్రాన్ని స్థాపించాలని నిర్ణయించింది. దశాబ్దాల క్రితమే కేంద్రం చేసుండాల్సిన నిర్ణయమిది. జపనీస్ ఎన్సెఫలైటిస్‌ను దృష్టిలో ఉంచుకుని అక్కడే వైరల్ జ్వరాల పరిశోధన కేంద్రాన్ని కూడా స్థాపించాల్సిన అవసరముంది. వెనుకబడిన గోరఖ్‌పూర్‌కు కావల్సింది అత్యంత నాణ్యమైన పరిశోధన శాలలు కాదు... అధికార యంత్రాంగ ప్రక్షాళన. అదీ తక్షణం జరగాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే మహిళలు గర్భవతులైనప్పటి నుంచి సక్రమమైన పర్యవేక్షణ ఉంటే తక్కువ బరువుతోనూ, నెలలు నిండకుండానూ పిల్లలు పుట్టటం వంటి ముఖ్యమైన లోపాలను అధిగమించవచ్చు. ఈ ప్రాంతం అపరిశుభ్రత, మంచినీటి కొరత, దోమలు, వైద్య సదుపాయాలు లేకస్థానికంగానే వైద్యసేవలు పొందడం వంటి వాటికి పేరుపొందింది. ఏ ప్రభుత్వం వచ్చినా పోయినా.. గోరఖ్‌పూర్, పరిసరాలకు ఈ అవలక్షణాలు తప్పవు.. పోవు. అపారిశుద్ధ్యం, మూతలు లేని మురుగు కాల్వలు రోగాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. జపనీస్ ఎన్సెఫలైటిస్‌ను మూలమవుతున్నాయి. దీన్ని నివారించేందుకు గడప గడపకూ టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టాలి. వైద్యాధికారులు ప్రజల వద్దకు వెళ్ళాలి. ప్రాథమిక వైద్యాన్ని అందించాలి. జరిగేది జరుగుతుందనే వైఖరి ఉత్తర ప్రదేశ్‌లో ఎక్కువుంది. ఆస్పత్రుల్లో మరణాలను తేలిగ్గా తీసుకోవడం, ప్రశ్నించేవాడు లేకపోవడం వల్ల వైద్యాధికారులు నిర్లక్ష్యంగా తయారయ్యారు. ఆస్పత్రుల నిర్వహణ పర్యవేక్షణ కొరవడింది. ముఖ్యమంత్రి యోగికి తెలిసినంతగా ఈ విషయం మరెవ్వరికీ తెలీదు. 2003 నుంచి 2014 వరకూ గోరఖ్‌పూర్ ఎంపీగా యోగి కనీసం 20 సార్లు శిశు మరణాల గురించి ప్రస్తావించడమే దీనికి బలీయమైన సాక్ష్యం. మౌలికవసతుల కల్పన నుంచి బీఆర్డీ ఆస్పత్రిని ఎయిమ్స్ స్థాయికి పెంపొందించాలని ఆయన గోరఖ్ పూర్ ఎంపీ హోదాలో కోరారు. ఆయన జోక్యం పార్లమెంటులో 12 సందర్భాలలో తీవ్ర చర్చకు దారితీసింది. గోరఖ్‌పూర్ ఆరోగ్యం పేలడానికి సిద్ధంగా ఉన్న బాంబులా ఉందని యోగికి చాలా బాగా తెలుసు. ఇంత తెలిసున్న యోగి ముఖ్యమంత్రయిన తరవాత ఎందుకు చర్య తీసుకోలేదు?

2009 జూలై 13న లోక్‌సభలో యోగీ ఆదిత్యనాథ్ ఏమన్నారో చూద్దాం.. జూన్ 15 తరవాత వర్షాల అనంతరం అక్టోబర్, నవంబర్ వరకూ జపనీస్ ఎన్సెఫలైటిస్ గోరఖ్‌పూర్ ప్రాంతాన్ని పీడిస్తుంది. ఎన్డీఏ హయాంలో 5ఏళ్ళ పాటు ఈ ప్రాంతాన్ని వ్యాక్సినేషన్ కోసం దత్తత తీసుకున్నారు. ఆ ఏడాది జూలై 2009 వరకూ 98 మరణాలు నమోదు కావడం బాధాకరం. ఇంతవరకూ వ్యాక్సినేషన్ కానీ, వ్యాధి నిర్మూలనకు సరైన చర్యలను కానీ తీసుకోలేదు. తూర్పు యూపీ, పశ్చిమ బీహార్ ప్రాంతాలు 31 ఏళ్ళుగా అంటువ్యాధులతో సతమతమవుతోంది.

ప్రతి ఏడాది వేలాది మంది పిల్లలు దీనివల్ల చనిపోతున్నారు. బీఆర్డీ మెడికల్ కళాశాలలో 2005లో 937, 2006లో 431, 2007లో 516, 2008లో 410, 2009జూలై వరకూ 98మంది మరణాలు సంభవించాయి... అంటూ ఆయన గణాంకాలతో సహా చెప్పారు. 2004-2017 మధ్య జపనీస్ ఎన్సెఫలైటిస్ కారణంగా 15వేల 315 మంది మరణించగా, అందులో 54శాతం మంది అంటే 8,267 ఒక్క ఉత్తర ప్రదేశ్‌లోనే కన్నుమూశారు. పసికందుల మరణాలను పక్కన బెడితే, యూపీలో ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థే మరణశయ్యపై ఉంది. దానికవసరమైన ఆర్థిక, మౌలిక సదుపాయాలనే ఆక్సిజన్ అందకపోవడమే దీనికి కారణం. రాష్ట్రంలో ఉన్న వందలాది కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో స్పెషలిస్ట్ డాక్టరు లేరు. అత్యవసర సర్వీసులకు ఏర్పాట్లే లేవు. శిక్షణ పొందని ఫార్మసిస్టులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలనందిస్తూ కనిపిస్తారు. ఆరోగ్య ఉప కేంద్రాలైతే నెలకొకసారి మాత్రమే తెరుచుకుంటాయి. ప్రాథమిక స్థాయిలో వైఫల్యం కారణంగా పేదలు బీఆర్డీ వైద్య కళాశాలకు తరలివెడుతున్నారు. తమ పిల్లలు మరణించడాన్ని కళ్ళారా చూస్తున్నారు. చిన్న పిల్లలు మరణించడంపై ఆందోళనను వ్యక్తం చేయడం మాని, ఎదుటివాడిలో తప్పులు వెతకడానికే ఇండియాలో కాసుకుని కూర్చుంటారు.

విచిత్రమైన అంశమేమంటే రాజకీయ నేతలంతా యోగీపైనే నెపాన్ని నెడుతున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఆరోగ్య విభాగంలో నెలకొన్ని చీకటి కోణాన్ని వారు మరుస్తున్నారు. మనం చంద్రుణ్ణి చేరుకుంటాం...అంగారకుణ్ణి అందుకుంటాం. గోరఖ్‌పూర్ వంటి మురికి కూపాల్లో అత్యవసర పరిస్థితుల్ని మాత్రం పట్టించుకోం.

జపనీస్ ఎన్సెఫలైటిస్ వంటి ప్రాణాంతక వ్యాధులను ఎదుర్కొనే స్థిరచిత్తం మనకు లేదు. అన్ని చోట్లా వ్యాపించిన అవినీతి అంతమొందించే కృతనిశ్చయం కానరాదు. ఈ స్వాతంత్ర్య దినాన మనం సాధించిన అంశాలపై గర్వపడగలవా అంటే సమాధానం లేదనే వస్తుంది... గోరఖ్‌పూర్ నుంచి. బీఆర్డీలో కన్నుమూసిన చిన్నారుల తల్లిదండ్రుల కన్నీళ్ళను తుడవడానికి కనీసం బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. యోగీ! మీరా పనిచేయగలరా!

## యాగీ అయిన యోగీ..!



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాజకీయాలకు కొత్త కాకపోయినా, పాలనా వ్యవహారాలకు కొత్తే. ఆయన గోరఖ్‌పూర్ ఎంపీగా ఐదు సార్లు గెలిచారు. ఆయన యోగి కావడం వల్ల సంసారం బాదరబందీ లేకపోవడం, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం ఆయనకు కలిసొచ్చిన అంశాలు. ఆయన అధికారంలోకి వచ్చి ఐదు మాసాలు కావస్తోంది. ఆయన ఇంకా అసెంబ్లీకి కానీ, శాసనమండలికి కానీ ఎన్నిక కాలేదు. ఆయన కోసం శాసనమండలిలో ఓ స్థానాన్ని సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్సీ ఒకరు ఖాళీ చేసి ఇచ్చారు. ఆ స్థానానికి ఆయన ఎప్పుడైనా ఎన్నిక కావచ్చు. మూడువందల పైగా ఎమ్మెల్యేలు ఉండగా, ఎంపీని ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేయడమేమిటని బిజేపీ ఎమ్మెల్యేలు ఇప్పటికీ అసంతృప్తితో ఉన్నారు. అయితే, మోడీ నిర్ణయాన్ని వ్యతిరేకించే ధైర్యం ఎవరికీ లేదు. ఆయనను బద్నామ్ చేసేందుకు పార్టీ ఎమ్మెల్యేల్లో కొందరు కాచుకుని కూర్చున్నారు. అలాంటి వారికి గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో శిశుమరణాలు మంచి అస్త్రంగా ఉపయోగపడుతోంది. గోరఖ్‌పూర్ యోగి సొంత నియోజకవర్గం కావడం వల్ల ఆ నగరంలోని పేరొందిన ఆస్పత్రిలో జరిగిన ఘోరానికి ఆయన నైతిక బాధ్యతవహించి రాజీనామా చేయాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ, బీఎస్పీ తదితర ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ఈ ఆస్పత్రిలో ఇలాంటి మరణాలు మామూలేననీ, ఇప్పుడు తనను అప్రదిష్ట పాలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన కన్నీటి పర్యంతమై వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, బీఎస్పీ పాలనలో కన్నా ప్రభుత్వాసుపత్రుల పరిస్థితి ఇప్పుడు అధ్వాన్నంగా ఉందని నిరూపించడం కోసం ప్రతిపక్షాలు, బిజేపీలోని అసమ్మతి వాదులు కలిసి ఈఘటనపై ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారన్నది యోగి అనుమానం. నిప్పులేనిదే పొగ రాదన్నట్టుగా పెద్ద సంఖ్యలో శిశుమరణాలు సంభవించడం వల్లనే యోగి చిక్కుకుని పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లాలో ఆరోగ్య కేంద్రాల కొరత 54 శాతం వరకూ ఉంది.జిల్లాలో మూడువేలకు పైగా గ్రామాలుఉండగా, వెయ్యి గ్రామాలకుపైగా సరైన వైద్య సౌకర్యాలు లేవు. ఆరోగ్య సౌకర్యాలు లేని పెద్ద రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. జాతీయ ఆరోగ్యమిషన్ నిధులు సక్రమంగా ఖర్చుఅయి ఉంటే ఇలాంటి పరిస్థితులు తలెత్తి ఉండేవి కావు.

# విద్యలో సాంకేతికతకు ప్రధాన మార్గాలు

పరీక్షల కోసమే విద్యార్థులకు బోధించడం వల్ల కలిగే నష్టాల గురించి మంచి ఉపాధ్యాయులందరికీ అవగాహన ఉంటుంది. తాము బోధించే అంశాల పట్ల వారికి అద్భుతమైన జ్ఞానం ఉండటమే కాదు విద్యార్థులు ఆయా అంశాల పట్ల తమంతట తాముగా తెలుసుకునేందుకు అన్వేషించేలా తగిన అవకాశాలనూ కల్పిస్తారు. విద్యా రంగంలో భారీసంఖ్యలో ప్రొఫెషనల్స్ అవసరమూ ఉంది. ఆ కోణంలో చూస్తే, టీచింగ్ కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. విద్యకు సాంకేతికత ఆరు రకాలుగా ఉపయోగపడుతుంది.

***విస్తరణపరంగా వైవిధ్యం...***

ఇది అసాధ్యమేమీ కాదు. ప్రపంచంలో ప్రతి మూలకూ చేరుకునే శక్తి సాంకేతికతకుంది. మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు (ఎంఓఓసీ) చేరికతో పాటుగా ఇతర ఓపెన్ కోర్సులు దీనికి ప్రధాన ఉదాహరణలు. ప్రతిచోటా నాణ్యమైన కంటెంట్ అందుబాటు లోకొచ్చింది. శక్తిమంతమైన ఆలోచనను సాంకేతికత ఎక్కడికో తీసుకువెళ్తుంది. అంతర్జాతీయ వినియోగానికి అవసరమైన అంశాలను మాత్రమే సృష్టించాల్సిన అవసరం లేదు.

**అనుభవాల ప్రాప్యత:** బోధన ఇప్పటికీ సందేశాత్మకంగానే ఉంది. దీనిలో కంటెంట్‌ను ఉపయోగించడంతో పాటుగా దీర్ఘకాలం దాన్ని గుర్తుంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. చురుకైన బోధన వైపు మళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రయోగం చేస్తూ, సహకరించ డం ద్వారా అభ్యసించడానికి ఇప్పుడు ఎన్నో అవకాశాలున్నాయి. అభ్యాస అంశాలలో అభ్యాసకులకు తోడ్పాటునందించడానికి మనం ఏవిధంగా సహాయపడగలం? వారి వ్యక్తిగత అనుభవాలను ఏవిధంగా వినియోగించగలం? ఎంఓఓసీలు లాంటి కార్యక్రమాలలో అభ్యాసకులు సోషల్ మీడియా అనుభవాలను ఉపయోగించుకోవడమనేది ఈ దిశగా వేసిన చిన్న అడుగులు.

**నిమగ్నత:** విద్యా సాంకేతికతలో నిమగ్నమైన అభ్యాసం వాస్తవిక అనుభవంలో పాల్గొనేలా ఓ అభిప్రాయాన్ని సృష్టించడం. ఈ నిమగ్నమయ్యే అభ్యాస విధానంలో సిమ్యులేషన్స్, గేమ్స్ తొలిదశ. ఇవి ఇప్పుడు వర్చ్యువల్ రియాల్టీ వైపు మళ్లుతున్నాయి. వర్చ్యువల్ రియాల్టీ హ్యాండ్‌సెట్‌ను ధరించడం ద్వారా అభ్యాసకులు తమకు తాముగా పూర్వశిలాయుగపు వయసులో లేదంటే... వైవిధ్యమైన గ్రహం మీదకు వెళ్లిపోతారు. సాంకేతికత ద్వారా అసలైన ప్రపంచాన్ని అనుభవించడానికి ఇది చాలా దగ్గరగా ఉంటుంది. బోధన, అభ్యాసంలో వీఆర్ అనేది ఇంకా అన్వేషించాల్సిన అవసరముంది. అభ్యాస సాంకేతిక నిపుణులు ఇప్పుడు సంధిస్తున్న ప్రశ్న విద్యార్థులకు బహుళ దృష్టికోణాలు, సందర్భాలలో ప్రత్యక్ష అనుభవాలను అందించడంలో వీఆర్‌ను ఏ విధంగా ఉపయోగించాలి, ఏ విధంగా విద్యార్థులు ఆ ప్రపంచంలో సంభాషిస్తూ సమాచారం సంగ్రహించాలీ వంటివి సాధ్యమవుతాయి.

**అనుసంధానం:** కనెక్టెడ్ లెర్నింగ్‌కు అభ్యాస కమ్యూనికేషన్ సరళతరం చేస్తుంది. అభ్యాస కోణంలో అనుబంధాలకూ తోడ్పడుతుంది. ఉన్నత, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులు స్మార్ట్ డివైస్‌ను ఉపయోగించడంతో పాటుగా ఇప్పటికే ఒకరితో ఒకరు ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్ లాంటి వాటి ద్వారా సంభాషిస్తున్నారు. మనం ఈ సహకార టూల్స్‌ను ఉపయోగించుకుని అభ్యాస, బోధనను అనుసంధానిత విధానంలో తరగతి బయట కూడా ఏ విధంగా ఉపయోగించగలం? ఓ సహకార ప్రాజెక్ట్ ను ఉపయోగించడం ద్వారా ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ అంశాలను గుర్తించడం, సాధ్యమైన పరిష్కారాలను రూపొందించడం ఓ ఉదాహరణ. సహకార అభ్యాస వాతావరణం చుట్టూ రూపొందించిన టాస్క్‌లు విద్యార్థుల జీవితాలకు దగ్గరగా ఉండాలి తప్ప అనాసక్తికరమైన టెక్స్చువల్ కంటెంట్ చుట్టూ తిరగకూడదు.


**వ్యక్తిగతీకరణ:** సంప్రదాయ విద్యా సాంకేతికత అనేది సమానత్వ నిర్మాణంలో మూలాలను కలిగి ఉంది. యానిమేషన్లు, వీడియోలు వైట్‌బోర్డ్‌పై ప్రాజెక్ట్ చేయడంతో పాటుగా విద్యార్థులందరికీ అందుబాటులో ఉంచడమనేది సంప్రదాయ లెక్చర్స్ కు ఏమంత భిన్నంగా ఉండదు. వైవిధ్యమైన సూచనలలో, ఒకే సమయంలో విద్యార్థులందరూ ఒకే టాస్క్‌ను చేయాల్సిన అవసరం లేదు. చిన్నారులు ఉన్నత తరగతులలోకి వెళ్లేకొద్దీ ప్రామాణీకరణ ఏర్పడుతుంది. స్వీయ అభ్యాస విధానంలో వ్యక్తిగతీకరించిన అభ్యాసాన్ని గురించి ఊహించడం సులభం కానీ, తరగతి గదులలో దీని అవకాశాలను తొలగించలేం.

**ఉపాధ్యాయుల సహకారం:** ఉపాధ్యాయులు చేసే అనేక పనులు సులభంగా టెక్నాలజీ ద్వారా ఆటోమేటెడ్ చేయవచ్చు, తద్వారా వారు తమ వృత్తికి ఏది ముఖ్యమో అది అంటే.. బోధన మీద శ్రద్ధ చూపడం సాధ్యమవుతుంది. టైమ్ టేబుల్స్ సృష్టించడం, విద్యా ప్రణాళికలు, హాజరు తీసుకోవడం, ప్రశ్నాపత్రాల తయారీ - వంటి అంశాలన్నీ కూడా టెక్నాలజీ ద్వారా సులభంగా చేయవచ్చు. చాలా పాఠశాలల్లో డిజిటల్ విధానాలను అనుసరిస్తున్నారు. సాంకేతికత ఆదర్శంగా ఉండాలంటే అది కచ్చితంగా వెనుక ఉండటంతో పాటుగా టీచర్ చేతిలో అతి చురుకైన సాధనంగా ఉండాలి. అప్పుడు సాంకేతికత తరగతి గదిలో వింతగా కనిపించదు. మొత్తాన్నీ సంక్షిప్తీకరిస్తే, సాంకేతిక నిపుణులు మన అత్యుత్తమ టీచర్ల క్లాస్‌రూమ్ ప్రాక్టీసెస్‌ను, విద్యావేత్తలు, విద్యారంగంలో అత్యుత్తమమైన, ఫెయిల్ అయిన సవరణలను సైతం దగ్గరగా పరీక్షించాలి. ఈ డిజిటల్ పరిణామంలో అతిపెద్ద విజేతగా అభ్యాసకుడుని నిలుపడానికి నిబద్ధత చాటాలి.

**-అనిల్ మమ్మెన్**
**(రచయిత టాటా క్లాస్ ఎడ్జ్‌లో లెర్నింగ్ డిజైన్ అండ్ సోషల్ ఇంపాక్ట్ చీఫ్)**

# హరికథా పితామహ ఆదిభట్ల

## నేటి నుంచి విజయవాడలో జయంత్యుత్సవాలు



హరికథ అంటే విష్ణు కథ. విష్ణు కథను పుట్టినప్పటి నుంచి వింటూనే ఉన్నాం. విష్ణువు స్థితికారకుడు కనుక, ఈ జగత్తులో ఉండే విషయాలన్నింటినీ క్రోడీకరించి కథరూపంలో చెప్పడమే హరికథ. ఒక్కొక్క భాషలో ఒక్కొక్క పేరుతో ప్రసిద్ధి చెందిన హరికథను తెలుగులో అందించింది హరికథా పితామహ శ్రీమజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు. ఆయన విజయనగరం జిల్లా ఆదిభట్ల గ్రామంలో జన్మించారు. భారత, రామాయణ, భాగవతాది కథలను సంగీతం, సాహిత్యాలతో పాటు లౌకిక విషయాలు మేళవించి హరికథగా ప్రాచుర్యంలోకి తెచ్చిన వారు నారాయణదాసు. సంగీత, సాహిత్యాలే కాకుండా, నృత్యాన్ని కూడా జోషించి మూడు గంటల సేపు ప్రేక్షకులను కదలనివ్వకుండా కథ చెప్పడం సామాన్యమైన విషయం కాదు.

ఆదిభట్ల నారాయణదాసు వేదశాస్త్ర, పురాణేతిహాసాల్లో పండితుడు. తెలుగు భాషలోనే కాకుండా, సంస్కృతం, హిందీ, ఉర్దూ, పారశీకము, అరబ్బీ భాషల్లో పండితుడు. తారకం, హరికథామృతం అనే సంస్కృత కావ్యాలను రాసి జర్మన్ పండితుల ప్రశంసలను అందుకున్నారు. హరికథలో సత్యం, భూతదయ, ముఖ్యాంశాలుగా ఉండాలని దాసుగారు నిర్వచించారు. కర్నాటక, హిందూస్థానీ బాణీలను సమన్వయించి సరికొత్త ఫక్కీలో అద్భుత సంగీత కచ్చేరిని మైసూరు సంస్థానంలో ఆయన నిర్వహించినప్పుడు మైసూరు మహారాజుఎంతో ఆనందించి సంగీతాన్ని మీరెక్కడ నేర్చుకున్నారని ప్రశ్నించారట. కళలకు పుట్టినిల్లయిన విజయనగరంలో ఆనందగజపతి మహారాజుని విద్యాపరిరక్షణ వేళలో మెప్పించి విజయరామ గానకళాశాల ప్రథమ ప్రధానాచార్యగా దాసుగారు బాధ్యతలను నిర్వర్తించారు. ఆయన శిష్యుల్లో నేతి లక్ష్మీనారాయణ భాగవతులుది విశిష్టస్థానం.

కాకినాడలో 1904లో సరస్వతి గానసభ స్థాపితమైనది మొదలు 1942 వరకూ ఏటా ఆ సభలు దాసుగారి కథలోనే ప్రారంభమయ్యేవి. 1923లో కాకినాడ కాంగ్రెస్ మహాసభల సందర్భంగా దాసుగారు రుక్మిణీ కల్యాణం కథను చెప్పినప్పుడు సరోజినీ నాయుడు ఎంతో ప్రశంసించారు. దాసుగారు ఉమర్‌ఖయ్యాం విజయనగర మహారాణి ప్రోత్సాహంతో రాసినప్పుడు రాణిగారు ఆ గ్రంథం అచ్చువేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో తొలిపలుకులు రాయించారు.

1951లో విజయవాడ సత్యనారాయణపురం శివాలయంలో నేతి లక్ష్మీనారాయణ, వాజపేయాజుల సుబ్బయ్య భాగవతులు, పెద్దింటి సూర్యనారాయణ దీక్షితులచే ఆగమోక్తంగా నారాయణదాసుగారి విగ్రహం ప్రతిష్ఠితమై గడిచిన 65 సంవత్సరాల నుంచి పూజాదికాలను అందుకుంటున్నది. దాసుగారి జయంతి శ్రావణ బహుళనాడు, వర్ధంతి పుష్యబహుళ పంచమినాడు ఆరాధనోత్సవాలు ఏటా నిరాఘాటంగా నిర్వహిస్తున్నారు.

**- యనమండ్ర వెంకటకృష్ణయ్య**

రాజమహేంద్రిలో..

### నారాయణ దాస ఆరాధన

నారాయణదాసుగారిపేరిట తెలుగు రాష్ట్రా ల్లో ఎన్నో వెలిశాయి. కానీ, రాజమహేంద్రిలో ఆరు దశాబ్దాల క్రితం బుర్రకథ సామ్రాట్ నిడదవోలు అచ్యుతరా మయ్య, గానకళారాధక బుగ్గా పాపయ్య శాస్త్రిలు స్థాపించిన త్యాగరాజ నారాయణదాస సేవా సమితి అటు సంగీత సభల నిర్వహణ లోనూ, ఇటు హరికథల నిర్వహణలోనూ ప్రజల ప్రశంసలందు కుంటోంది. ఆనాటి నుంచి ఏటా సంగీత కచ్చేరీలు, హరికథలు పదిరోజుల పాటు నిర్వహిస్తూ ప్రజలను రంజింపజేస్తోంది. ఈ కార్యక్రమాలను మొదట ఇన్నీసుపేట నిడమర్తి వారి వీధిలో నిర్వహించేవారు. ప్రస్తుతం రోడ్డుకమ్ రైలు బ్రిడ్జి పూర్వపు కార్యాలయం ఆవరణలో నిర్మించిన భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ సంగీత సభల నిర్వహణ కారణంగా ఇన్నీసుపేటకు త్యాగరాజ నగర్ అని పేరు వచ్చింది.

# మోడీ విధానాలతోనే పాక్ రెచ్చిపోతోంది

- ప్రధానిపై రాహుల్ విమర్శల దాడి
- స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగంపై వ్యంగ్యాస్త్రాలు
- యూపీఏ పదేళ్ల కృషిని మోడీ నెల రోజుల్లో ధ్వంసం చేశారు
- కాశ్మీర్‌లో శాంతిస్థాపనకు మన్మోహన్ సర్కారు ఎంతో చేసింది



**బెంగళూరు :** జమ్ము-కాశ్మీర్ విషయంలో పాక్ దుశ్చర్యలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనుసరిస్తున్న విధానాలే కారణమని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. బుధవారం బెంగళూరులో ఇందిర క్యాంటీన్లను ప్రారంభించిన అనంతరం బహిరంగసభలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు కాశ్మీర్ సమస్య తిట్లతోనో, బుల్లెట్లతోనో పరిష్కారం కాదంటూ ఎర్రకోటపై నుంచి ప్రధాని వ్యాఖ్యానించిన మరుసటి రోజే రాహుల్ మోడీ విమర్శల దాడికి దిగారు. జమ్మూకశ్మీర్‌లో శాంతి స్థాపన కోసం పదేళ్లు తమ ప్రభుత్వ కష్టపడిందని, కానీ మోడీ ప్రభుత్వం ఒక్క నెలలోనే దాన్ని నాశనం చేసిందన్నారు. మొట్టమొదటి సారి పాకిస్థాన్‌కు రష్యా ఆయుధాలు అమ్ముతున్నదని, మోడీ ప్రభుత్వం స్నేహపూర్వక దేశాలతో అనేక సమస్యలను తీసుకువచ్చిందన్నారు. భారతీయుల ప్రతినిధిగా ఉన్న మోడీ, అసలైన ప్రధానిగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. జమ్ము-కాశ్మీర్‌లో విద్వేషం, ఆగ్రహ వాతావరణానికి మోడీయే కారణమని రాహుల్ ఆరోపించారు. మన్మోహన్‌సింగ్‌తో కలిసి జమ్ము-కాశ్మీర్‌లో శాంతిని స్థాపించేందుకు చిదంబరం, జైరాం రమేష్ వంటి నేతలతో కలిసి కృషిచేశామని, తమ పదేళ్ల కృషిని మోడీ ఒక్క నెలరోజుల్లో వృథా చేశారని రాహుల్ ధ్వజమెత్తారు. 2004 నాటికి వాజ్‌పేయి ప్రభుత్వహయాంలో కాశ్మీర్ అల్లర్లతో అట్టుడికిపోతున్నది. మన్మోహన్ ప్రధాని అయ్యాక పరిస్థితులు చక్కబడ్డాయని గుర్తుచేశారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాం, ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకున్నాం, వేలాది మంది మహిళలు బ్యాంకు లావాదేవీలు నిర్వహింకో గలిగారు. ఇదంతా కాంగ్రెస్ చలవేనని రాహుల్ అన్నారు.

**మోడీ ప్రసంగంపై రాహుల్ సెటైర్లు**

కాంగ్రెస్ వత్తిడి వల్లే మహారాష్ట్ర, యూపీ రాష్ట్రాల్లో రైతుల రుణాలు మాఫీ చేసిందన్నారు. ప్రధాని దగ్గర చెప్పుకోవడానికి ఏమీ లేదని, అందుకే ప్రసంగ సమయాన్ని తగ్గించారన్నారు. దేశంలో నిరుద్యోగ శాతం గత 8 ఏళ్లలో అత్యధికంగా ఉందని, ఆ విషయాన్ని మోడీ తన ప్రసంగంలో చెప్పలేదన్నారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు, కానీ ఆ అంశాన్ని ప్రస్తావించలేదన్నారు. బీజేపీ తీసుకున్న ఆరోగ్య విధానాల వల్లే గోరఖ్‌పూర్‌లో 90 మంది చిన్నారులు చనిపోయారన్న విషయాన్ని మోడీ తన ప్రసంగంలో వెల్లడించలేదని రాహుల్ విమర్శించారు. హెల్త్ బడ్జెట్‌ను మోడీ ప్రభుత్వం తగ్గించిందని, అందువల్లే పిల్లలకు అవసరమయ్యే ఆక్సిజన్‌ను హాస్పటల్ కొనలేపోయిందని రాహుల్ అన్నారు. అప్పుడెప్పుడో చైనా అధ్యక్షుడు భారత్‌కు వచ్చారని, అప్పుడు అతన్ని మోడీ హగ్ చేసుకున్నారని, అదే సమయంలో వేలాది మంది చైనా సైనికులు మన దేశంలోకి చొరబడ్డారని ప్రధానిపై వ్యంగ్యవ్యాఖ్యలు చేశారు.

భూటాన్‌లోనే చైనా దళాలు ఉన్నాయన్న అంశాన్ని మోడీ చెప్పారని, ఈ విషయాన్ని ఎవరైనా గమనించారా అని రాహుల్ ప్రశ్నించారు. పాకిస్థాన్, చైనా తప్ప మనచుట్టు ఉన్న అన్ని దేశాలు మనతో స్నేహంగా ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందన్నారు. నేపాల్ మనకు దూరమైందని, శ్రీలంకలో చైనా పోర్ట్ నిర్మిస్తున్నదని రాహుల్ తెలిపారు.

## లాల్‌చౌక్‌లో అరోరా వందేమాతరం నినాదం

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లోని ఏర్పాటువాద ప్రాంతాలు మినహా ఇతర ప్రాంతాల్లో పంద్రాగస్టు వేడుకలను నిర్వహించారు. కశ్మీర్‌లోని బక్షి స్టేడియంలో భారత జెండా ఎగరవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. కానీ వేర్పాటువాదుల ప్రభావిత ప్రాంతాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పరిమితులు విధించారు. అయితే ఏర్పాటువాదుల ప్రభావం ఎక్కువగా శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ ప్రాంతంలో అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా సీఆర్‌పీఎఫ్ బలగాలు మోహరించాయి. అయినా లాల్‌చౌక్‌లో భారత్‌మాతాకీ జై నినాదాలు వినిపించాయి. జెండా ఎగురవేసేందుకు అక్కడకు చాలామంది చేరుకున్నారు. వారిని భద్రతా బలగాలు అడ్డుకుని వెనక్కి పంపాయి. అయితే ఇంతలో ఉన్నట్టుండి సునీతా అరోరా అనే మహిళ లాల్‌చౌక్ దగ్గరకు చేరుకుంది. వస్తూనే 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేసింది. దీంతో సైనికులు ఆమె దగ్గరకు వచ్చారు. ఆమె వారితో 'ఇది నా కర్తవ్యం. నేను హిందూ దేశస్థురాలిని. మనం ఇప్పుడు పాకిస్థాన్‌కు జవాబు చెప్పాల్సిన అవసరం ఉంది. అందుకే నేను ఈ నినాదాలు చేశాని' చెప్పింది. దీంతో వారు ముందు జాగ్రత్త చర్యగా ఆమెను అరెస్టుచేసి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఆమెను విడిచిపెట్టేశారు. ఈవీడియోకు సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ వచ్చింది. ఈవీడియోను భారత బ్యాట్‌మెన్ సురేష్‌రైనా షేర్ చేశారు. 'ఆమె చాలా ధైర్యవంతురాలు, ఆమె చేసిన సాహసానికి సెల్యూట్' అంటూ పోస్టు చేశారు. ఆమె చేసిన నినాదాలు అన్ని ఉద్రిక్తల మధ్య సంతోషాన్ని కలిగించిందంటూ ప్రశంసించారు.

### సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా

# కేంద్రం నియంతృత్వ ధోరణి

- బీజేపీయేతర రాష్ట్రాలపై పెత్తనం
- కేంద్రసర్కార్ తీర్పుపై మండిపడ్డ సీతారాం ఏచూరి



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ప్రసంగాన్ని ఆలిండియా రేడియో, ప్రసార భారతిలో ప్రసారం చేయక పోవడం తీవ్ర దుమారాన్ని రేపింది. పైపెచ్చు ప్రసంగంలోని కొన్ని అంశాలను మార్చుకోవాలంటూ ప్రసార భారతి సూచించడం వివాదాన్ని రాజేసింది. ఈ చర్యపై సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య వేడుకలకు ముందే దూరదర్శన్ సీఎం ప్రసంగాన్ని రికార్డు చేసి ప్రసారం చేయకపోగా, ప్రసంగాన్ని మార్చుకోవాలనడం ఇందిరాగాంధీ కాలం నాటి ఎమర్జెన్సీ పరిస్థితుల కన్నా దారుణమని మండిపడ్డారు. ఢిల్లీలోని సీపీఐ(ఎం) ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏచూరి మాట్లాడారు. ప్రసార భారతి త్రిపుర ముఖ్యమంత్రికి లేఖ రాయడాన్ని ఆయన తప్పు పట్టారు. ''ప్రధాని ప్రసంగంలో రాజకీయ అంశాలు ఉండొచ్చు గానీ, మాణిక్ సర్కార్ ప్రసంగంలొ రాజకీయ అంశాలు ఉండకూడదా..? ఓ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏం మాట్లాడాలన్నది మీరెలా నిర్ణయిస్తారు?'' అని ఏచూరి ప్రశ్నించారు. ప్రజల చేత ఎన్నికైన ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రసారం చేయక పోవడమనేది రాష్ట్రాల హక్కులపై కేంద్రం జోక్యం చేసుకోవడమేనని ఆయన మండిపడ్డారు. విజయదశమి సందర్భంగా ఆరెస్సెస్ చీఫ్ ప్రసంగాన్ని డీడీలో ప్రసారం చేయడంపై ఏచూరి విమర్శలు గుప్పించారు. ఆరెస్సెస్ విధానాలు మాత్రమే ప్రసారం చేస్తూ, భారత్‌ను హిందుత్వ దేశంగా మార్చేందుకు కేంద్రం ప్రభుత్వ వ్యవస్థలను, మీడియాను బీజేపీ ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని చేసిన ప్రసంగంపై ఏచూరి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ''నోట్ల రద్దు ద్వారా ఎంత డబ్బు వచ్చింది...? 8 నెలలైనా ఎంత మేర పాత నోట్లు జమ అయ్యాయో ప్రభుత్వం ఎందుకు చెప్పలేదు..? అఖిలపక్ష కాశ్మీర్ పర్యటనలో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు పరచడం లేదు'' అని ఆయన ప్రధానిని ప్రశ్నించారు. బీజేపీయేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించి ఈ విషయాలపై ముందుకెళ్తామని తెలిపారు. గురువారం పాట్నాలో జరిగే ప్రతిపక్షాల సజా విరాసత్ బచావ్ సమ్మేళన్ కార్యక్రమానికి సీతారాం ఏచూరి హాజరు కానున్నారు.

## మధ్యప్రదేశ్ పురపాలికలో బీజేపీ విజయబావుటా

**భోపాల్:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మరో ఎన్నికల్లో ఘన విజయం సొంతం చేసు కుంది. మధ్యప్రదేశ్‌లోని నగర పాలక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మట్టి కరిపించింది. మొత్తం 43 నగర పాలక సంస్థలకు ఎన్నికలు జరిగాయి, వీటిలో 26 నగర పాలక సంస్థల చైర్మన్ స్థానాలు బీజేపీ వశమయ్యాయి. కాంగ్రెస్ 14 నగర పాలక సంస్థలను దక్కించుకుంది. మూడు నగర పాలక సంస్థల్లో స్వతంత్రులు పాగా వేశారు. నగర ప్రజలు ఇచ్చిన తీర్పు పట్ల మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల కృషి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా నాయ కత్వం కారణంగా ఈ ఫలితాలు వచ్చాయని పేర్కొంటూ వారం దరికీ కృతజ్ఞతలు తెలిపారు.



# బెంగళూరులో ఇందిర క్యాంటీన్లు

- రూ.5కి అల్పాహారం
- రూ.10కి భోజనం
- ప్రారంభించిన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ

**బెంగళూరు:** తమిళనాడులో అమలవుతున్న అమ్మ క్యాంటీన్ల తరహాలోనే కర్నాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వం ఇందిర క్యాంటీన్లను ప్రారంభించింది. పేదలకు తక్కువ ధరకే రుచికరమైన భోజనాన్ని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'ఇందిర క్యాంటీన్'లను కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం ప్రారంభించారు.

మెట్రోపాలిటన్ నగరమైన బెంగళూరులో ఇక రూ.10కే భోజనం, రూ.5కు అల్పాహారం లభించనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బృహత్ బెంగళూరు మహానగర పాలిక(బీబీఎంపీ) బెంగళూరు నగరంలో మొత్తం 101 క్యాంటీన్లను నిర్మించింది. జయనగర్‌లోని కనకనపాల్య వద్ద ఏర్పాటుచేసిన క్యాంటీన్‌ను ప్రారంభించిన రాహుల్ వెంట కర్నాటక ముఖ్య మంత్రి సిద్ధరామయ్య, మంత్రులు, బెంగళూరు మేయర్ సహా పలువురు నేతలు ఉన్నారు. రిబ్బన్ కట్ చేసిన అనంతరం లోపలికి వెళ్లిన రాహుల్.. క్యాంటిన్‌లో కలియతిరిగి, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

### జాట్ కులస్తుల ఆందోళన

## 22కు వాయిదా

**జైపూర్:** రాజస్థాన్‌లోని ధోల్పూర్, భరత్‌పూర్ జిల్లాలో జాట్ కులస్థులు తలపెట్టిన ఆందోళనను ఈనెల 22కు వాయిదా వేశారు. జాట్ వర్గీయులు తమకు రిజర్వేషన్లను అమలు చేయాలని కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 15 లోగా ప్రభుత్వం వారి రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాలని జాట్ ఆరాక్షణ ఆందోళన సంఘర్షణ సమితి తెలిపింది. ఈ నేపథ్యంలో జాట్ కమ్యూనిటి రిజర్వేషన్ల సమస్యపై నిర్ణయం తీసుకొంటామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో వారు తలపెట్టిన ఆందోళనను వాయిదా వేసినట్లు జాట్ ఆరాక్షణ ఆందోళన సంఘర్షణ సమితి ప్రతినిధి విశ్వేంద్రసింగ్ తెలిపారు.

## గోరఖ్‌పూర్ ఘటన ఆక్సిజన్ లోపం కాదు..

**కేంద్ర బృందం వెల్లడి**

**గోరఖ్‌పూర్:** గతవారం గోరఖ్‌పూర్‌లో జరిగిన ఘోరం యావత్ దేశాన్ని కదిలించింది. పసిపిల్లల మరణ మృదంగం విషాదాన్ని నింపింది. చిన్నారులకు ప్రాణవాయువు అందించాల్సిన ఆవశ్యకత ఉన్నా తెలిసి తెలిసి జరిగిన ఈ దారుణం తీవ్ర కలకలం సృష్టించింది. ఘటనకు బాధ్యులపై బాధితు శాపనార్థాలు, ప్రభుత్వంపై విపక్షాల విమర్శలు, మానవ హక్కుల సంఘాల ఆరోపణలు హోరెత్తాయి. ఈ విషాద ఘటన తరువాత యూపీ ప్రభుత్వం ఆస్పత్రి చీఫ్ రాజీవ్ మిశ్రాను సస్పెండ్ చేసింది. ఈ తరువాత మరుసటి రోజు ఆస్పత్రి పేడియాట్రిక్స్ విభాగం చీఫ్, మెదడు వాపు వ్యాధి వార్డు ఇంచార్జ్ చీఫ్ కపిల్ ఖాన్‌ను కూడా విధుల నుంచి తప్పించింది.

కేంద్ర ప్రభుత్వం మొత్తం ఈ సంఘటనపై విచారణకు ఆదేశించింది. దీనిని విచారించేందుకు ముగ్గురు వైద్యులతో కేంద్ర ప్రభుత్వం ఒక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో చిన్నారుల మరణం ఆక్సిజన్ కొరత వల్ల ఏర్పడిందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొంది. గత నెలతో పోల్చుకుంటే తక్కువ మంది మరణించారని కేంద్రబృందం తెలిపింది. చికిత్స పొందే చిన్నారుల కేర్ షీట్ లను పరిశీలించినప్పుడు మరణానికి



ఖచ్చితమైన వాస్తవాన్ని కనుగొనలేకపోయామని విచారణ బృందంలోని డాక్టర్ హరీష్ చైలానీ తెలిపారు. ఆక్సిజన్ సరఫరాలో రెండు గంటలు మాత్రమే అంతరాయం కలిగిందని ఈ సమయంలో వారికి వేరే విధంగా ఆక్సిజన్ ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇంతటి అతిపెద్ద ఆస్పత్రిలో ఆరోగ్య సంరక్షణ, నిర్వహణ తీరు, అవినీతి అంశాలపై ప్రతిపక్షాల విమర్శలను యోగీ ప్రభుత్వం ఎదుర్కొంటోంది.

### దేశ మిశ్రమ సంస్కృతిని

## కాపాడేందుకు పోరాటం

### శరద్ యాదవ్

**న్యూఢిల్లీ:** జేడీయూ మాజీ అధ్యక్షుడు శరద్ యాదవ్ ప్రతి పక్షాల ఉమ్మడి శక్తితో తన బలాన్ని నిరూపించుకొనే ప్రయత్నంలో ఉన్నారు. అందులో భాగంగా గురువారం ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశారు. దానికి అన్ని ప్రతి పక్షా పార్టీల నాయకులను ఆహ్వానించారు. కాంగ్రెస్ నుంచి సోనియాగాంధీ, రాహుల్ సూచనతో ఆజాద్, అహ్మద్ పటేల్, తదితరులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రతిపక్ష నాయకులంతా తప్పకుండా హాజరవుతారని శరద్ యాదవ్ ఆశిస్తున్నారు. నితీష్‌కుమార్‌మ ఎన్డీఏ కూటమిలో చేరడం సరైన నిర్ణయం కాదని ఈ బల ప్రదర్శన ద్వారా నిరూపించాలన్నదే ఆయన ఉద్దేశంగా శరద్‌యాదవ్ సన్నిహితులు చెబుతున్నారు. భారతదేశంలోని మిశ్రమ సంస్కృతిని కాపాడేందుకే తమ పోరాటమని ఆయన ప్రకటించారు. గురువారం నాటి సమావేశానికి రైతులు, నిరుద్యోగులు, దళితులు, గిరిజనులు కూడా హాజరవుతారని చెప్పారు.

## రాయ్‌బరేలీలో సోనియా మిస్సింగ్ పోస్టర్లు

**లక్నో:** కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లో పోస్టర్లు కలకలం సృష్టిస్తున్నాయి. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ 'మిస్సింగ్' అంటూ అమేథిలో పోస్టర్లు వెలిసి వారం రోజులు గడవకముందే, తాజాగా కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ కనిపించడం లేదంటూ రాయ్ బరేలిలో వాల్‌పోస్టర్లు దర్శనమిచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లోని అమేథి, రాయ్ బరేలి నియోజక వర్గాల నుంచి రాహుల్, సోనియా గాంధీలు ఎంపీలుగా కొనసాగుతున్న తెలిసిందే. రాయ్‌బరేలీ నియోజకవర్గంలోని గోరాబజార్, మహానందపూర్, ప్రభుత్వ కాలనీలో 'లోక్‌సభ ఎంపీ సోనియా గాంధీ కనిపించడంలేదు. ఆమె ఆచూకీ తెలిపిన వారికి తగిన రివార్డును అందజేస్తాం' అని పేర్కొంటూ ముద్రించిన పోస్టర్లు డజన్ల కొద్దీ కనిపించాయి. ఈ పోస్టర్లు రాయ్‌బరేలీ పీపుల్ పేరిట ప్రత్యక్షమయ్యాయి. ఇటీవల ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో సోనియా గాంధీ ఆమె నియోజకవర్గంలో ఉన్న సమస్యల గురించి చర్చించలేదనే ఆగ్రహంతో ప్రజలు ఇలా చేశారని పలువురు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సోనియా గాంధీ ఒక్కసారి కూడా రాయ్‌బరేలీకి వెళ్లలేదట. ఆర్ఎస్ఎస్, భాజపాకు చెందిన నేతలే ఈ చర్యలకు పాల్పడి ఉంటారని స్థానిక కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

### రాకాసి వరదలో

## తుడిచిపెట్టుకుపోయిన ఫ్రీటౌన్

- 400 మంది మృతి, 3 వేల మంది నిరాశ్రయులు
- సాయం చేసేందుకు ముందుకొచ్చిన యూఎన్ఓ



**ఫ్రీటౌన్ :** ఆఫ్రికా దేశం సియోర్రా ప్రకృతి ప్రకోపానికి క కావికలమైంది రాకాసి వరదలతో సియోర్రా రాజధాని ఫ్రీటౌన్‌లో 400 మంది ప్రాణాలు కోల్పోగా... వేలాది మంది నిరాశ్రయులయ్యారు. కొండ చరియలు విరిగిపడటం తో ఇంకా 600మంది జాడ తెలియలేదు. దీంతో రంగంలోకి దిగిన సహాయక బృందాలు శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి పిలుపుతో సియోర్రాకు ఆపన్నహస్తం అందించేందుకు ప్రపంచ దేశాలు ముందుకు వచ్చాయి. సియోర్రా బాధితులను ఆదుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు బ్రిటన్ ప్రకటించింది. బాధితులకు అత్యవసరమైన ఆహార పదార్థాలు, బట్టలు సరఫరా చేసేందుకు ఐక్యరాజ్యసమితి ఏర్పాట్లు చేసింది. రాకాసి వరదలతో తుడిచిపెట్టుకుపోయిన తమ దేశాన్ని అన్ని విధాల ఆదుకోవాలని సియోర్రా అధ్యక్షుడు ఎర్నెస్ట్ బామ్ కొరోమా ప్రపంచదేశాలను అర్థించారు. వరదల కారణంగా ఫ్రీటౌన్‌లో 3000 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.

## అమెరికన్ల బంకర్ల బాట

- ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలతో భయం
- భూగర్భంలో నివాసాలకు ప్రాధాన్యం

**కాలిఫోర్నియా:** ప్రపంచ దేశాల ఆంక్షలను, అమెరికా హెచ్చరికలను భేఖాతరు చేస్తూ వరుస క్షిపణి పరీక్షలు చేస్తున్న ఉత్తర కొరియా తీరుతో అమెరికా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అమెరికా సరిహద్దు ప్రాంతాల్లో ఉత్తర కొరియా ఎప్పుడు న్యూక్లియర్ బాంబులు వేస్తుందోనన్న భయంతో ప్రజలు బంకర్ల బాటపట్టారు. బాంబుపేలుళ్లు జరిగినా ఎలాంటి హానీ కలగకుండా భూగర్భంలో నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్-ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమనే పరిస్థితి ఉన్న నేపథ్యంలో తమ ప్రాణాలకు రక్షణ కరువైందన్న భావనలో ఉన్న అమెరికన్లు బంకర్లను నిర్మించుకుంటున్నారు. దీంతో బంకర్లు నిర్మించే వారికి గిరాకీ పెరిగిపోయింది. బాంబు పేలుళ్లను సైతం తట్టుకునే 10 నుంచి 50 ఫీట్ల బంకర్ ధర లక్షా 10వేల అమెరికన్ డాలర్లు పలుకుతోంది. వినియోగదారులకు అనుకూలంగా బంకర్లు నిర్మిస్తే వీటి ధర మరింత పెరుగుతోంది. బంకర్లు నిర్మించేముందే దానిలో ఉంచే ఫర్నీచర్, ఇతర సామాగ్రిని కూడా వాళ్లే సమకూరుస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఛార్జీలు వేస్తున్నారు. ఇప్పటి వరకు టెక్సాస్, ఒరెగాన్, వాషింగ్టన్ ఇతర ప్రాంతాలకు డజన్ల సంఖ్యలో బంకర్లను అమ్మినట్లు నిర్మాణ సంస్థ ప్రతినిధి తెలిపారు.

# మావాళ్లు భారత్‌లోకి వచ్చారా?

- తమకు సమాచారమే లేదని చైనా బుకాయింపు
- వాస్తవాధీన రేఖ వద్ద శాంతి అవశ్యమని డ్రాగన్ ప్రవచనాలు
- లఢఖ్ ఘటనపై స్పందనకు జైట్లీ మౌనం
- భారత్, చైనాలు ప్రత్యక్షంగా చర్చలు జరపాలి : యూఎస్

**న్యూ ఢిల్లీ/బీజింగ్:** 'అవునా... మావాళ్ళు భారత భూభాగంలోకి వచ్చారా? మాకు అస్సలు సమాచారమే లేదు.' ఇది మంగళవారం భారత్‌లోకి చొచ్చుకొచ్చిన విషయంపై పొగరుబోతు చైనా స్పందన. పైగా చైనా-భారత్ వాస్తవాధీన రేఖ వద్ద శాంతియుత వాతావరణం నెలకొల్పాలంటూ సరికొత్త ప్రవచాలను వల్లిస్తున్న డ్రాగన్ నిస్సిగ్గుగా తమకు లఢఖ్-పన్గాంగ్ సంఘటనపై సమా చారమే లేదంటూ బుధవారం బుకాయించింది. దాడికి విచారం వ్యక్తం చేయాల్సిన చైనా, ఈ విధంగా వ్యాఖ్యానించడంతో తన కపటనీతి పొరుగుదేశాలపై మరోసారి రుద్దేందుకు యత్నించింది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్‌యింగ్ ఈ విషయంపై బుధవారం వినూత్నరీతిలో స్పందించారు. ముందుగా మౌనంగా ఉండేందుకు యత్నించిన చున్‌యింగ్, తనకు ఈ ఘటన గురించి ఏమి తెలియదని సమాధానాన్ని దాటవేశారు. వాస్తవాధీన రేఖ వెంట శాంతిని నెలకొల్పేందుకు భారత్‌ను తాము పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు గుర్తు చేశారు. ఈ మేరకు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ భారత సైన్యానికి విజ్ఞప్తి చేసింది. గొడవలకు చరమగీతం పాడాలని చైనా ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించింది. డొక్లామ్ సంబంధించిన విషయంలో ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ గొడవ తెరపైకి రావడంతో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడినట్లయింది.

లఢఖ్‌లో జరిగిన సైనికుల ఘర్షణపై స్పందించేందుకు



భారత్ నిరాకరించింది. ఈ విషయంపై భారత ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రకటన చేయాల్సిన అవసరం లేదని తెలిపింది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఇరు దేశాల భద్రతా బలగాల ఘర్షణపై ఆయన ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. ఇమేవీ పెద్ద విషయంకాదని జైట్లీ కొట్టిపారేశారు.

డొక్లామ్ అంశంతో పాటు లఢఖ్ ఘర్షణతో నెలకొన్న ప్రతిష్టంభనకు ఇరు దేశాలు పుల్‌స్టాప్ పెట్టాలని అగ్రరాజ్యం అమెరికా అభిప్రాయపడింది. అప్పుడే, ఇరు దేశాల మధ్య ఏర్పడ్డ విభేధాలు తొలగుతాయని ప్రకటించింది. లఢఖ్ వాస్తవాధీన రేఖ వద్ద చైనా బలగాలు భారత సైన్యంపై దాడికి దిగిన నేపథ్యంలో అమెరికా ఈ విధంగా ప్రకటన చేయడం కొంతమేర ప్రాధాన్యత సంతరించుకుంది. బలమైన ఆర్థిక వ్యవస్థ కల్గిన రెండు దేశాలు నేరుగా చర్చలు జరిపి దౌత్యసంబంధాలు మెరుగుపరుచుకోవాలన్నారు.

## ప్రపంచ ఓడ యాత్రకు భారత నేవీ అధికారి

**ముంబై :** ప్రఖ్యాత 'గోల్డెన్ గ్లోబ్ రేస్' సంస్థ నిర్వహించనున్న ప్రపంచ ఓడ యాత్రకు అభిలాష్ టామీ అనే భారత నేవీ అధికారిఎంపికయ్యారు. ఇదివరకు పలు ఓడ యాత్రలో పాల్గొన్న అభిలాష్, ఆసియా ఖండం నుంచి ఆయన ఒక్కరే ఎంపిక కావడం పట్ల భారత నేవీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత యాభై సంవత్సరాల క్రితం (సరిగ్గా 1968లో) ప్రపంచవ్యాప్తంగా జీజీబీ యాత్రకు తొమ్మిది మందిని ఎంపిక చేసినట్లు సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. అయితే, అందులో కేవలం ఒక సభ్యుడు మాత్రమే సముద్ర యానం చేసి యావత్ ప్రపంచాన్ని చుట్టేసి వచ్చారు. మిగతా వారంతా ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొని యాత్రను మధ్యలోనే ఆపేశారు. ఇంకొందరు ఆత్మహత్యకు కూడా పాల్పడ్డారు. ఎన్నో ఒడిదొడుకులు ఉన్నందువల్ల అటువంటి పోటీ మళ్ళీ ఏ సంస్థ నిర్వహించేందుకు సాహసం చేయలేదు. అయితే, ఆ పోటీ జరిపి యాభై సంవత్సరాలైన సందర్భంగా మరోసారి జీజీబీ సంస్థ నిర్వహించాలని నిర్ణయించింది. ఆ జీజీబీ సంస్థ పోటీలో పాల్గొనేందుకు సభ్యులను ఎంపిక చేసింది. అందులో భారత్ తరఫున అభిలాష్ ఎంపికైనట్లు నిర్వాహకులు వెల్లడించారు.

### పశ్చిమాసియా జైళ్లలో

## 4 వేల మంది భారతీయులు

**న్యూఢిల్లీ:** వివిధ నేరారోపణల కింద పశ్చిమ ఆసియా దేశాల్లో సుమారు నాలుగు వేల మంది భారతీయులు జైళ్లలో మగ్గుతున్నారు. హత్యలు, మాదకద్రవ్యాలు, ఆర్థిక నేరాలు, వ్యభిచారం తదితర కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారు. ఈ విషయాన్ని ఆయా దేశాలు భారత దౌత్యకార్యాలయాలకు సమాచారం ఇచ్చాయి. సౌదీ అరేబియాలో దాదాపు 30 లక్షల మంది భారతీయులు జీవనోపాధి కోసం వెళ్లారు. వీరిలో 2084 మంది వివిధ నేరాలకింద అరెస్టయి జైళ్లలో ఉన్నారు. మద్యం సేవించడం, విక్రయించడం, లంచం, హత్యలు, మాదకద్రవ్యాల కేసులు వీరిపై మోపబడ్డాయి. అదేవిధంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో 23 లక్షల మంది భారతీయులు ఉన్నారు. కాగా, 1376 మంది ఖైదీలుగా ఉన్నారు. ఒమన్‌లో 84 మంది, కువైట్‌లో 488 మంది, ఖతార్‌లో 177 మంది, ఇరాక్‌లో 11మంది జైళ్లలో మగ్గుతున్నారు. 18 పశ్చిమాసియా దేశాలకు గాను 16 దేశాల్లో 4,321 మంది భారతీయులు నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతాల్లో మొత్తంగా 80 లక్షల మంది ఇండియన్లు ఉన్నారు. వీరిలో చాలా మటుకు కార్మికరంగానికి చెందిన వారే. ఒక్క పాలస్తీనాలోనే ఇండియన్లపై ఎలాంటి కేసులు లేవు. జైళ్లలో మగ్గుతున్న వారిలో అధికశాతం మంది సరైన ధ్రువపత్రాలు లేని కారణంగానే అరెస్టైయినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. చాలా దేశాలు జైళ్లలోని భారతీయుల గురించిన సమాచారాన్ని పంచుకోవడం లేదు. కోర్టుల దాకా కేసులు వచ్చిన సందర్భాల్లోనే ఇలాంటి వారి గురించి వెలుగులోకి వస్తుందని విదేశాంగ కార్యాలయ అధికారి ఒకరు చెప్పారు.

## డీఎంకే చీఫ్ కరుణానిధికి అస్వస్థత

### చెన్నైలోని కావేరీ ఆస్పత్రిలో చికిత్స

**చెన్నై:** డీఎంకే అధినేత కరుణానిధి ఆరోగ్యం మరోసారి క్షీణించింది. బుధవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు ఆయన్ను చెన్నైలోని కావేరీ ఆస్పత్రికి తరలించారు. ఒక్కసారిగా అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యుల్లోనూ, పార్టీలోనూ ఆందోళన



మొదలైంది. శ్వాస కోస సమస్య వల్లే ఆయ నను ఆస్పత్రిలో చేర్చారని విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం అందుతోంది. అయితే ఆయన శరీరంలో అమర్చిన కృత్రిమ అన్న వాహికను మార్చేందుకు ఆస్పత్రిలో చేర్పించారని కావేరీ ఆస్పత్రి యాజమాన్యం పత్రికా ప్రకటన విడుదల చేసింది. గతేడాది డిసెంబర్‌లో కూడా కరుణానిధి శ్వాసకోస సమస్యలతో చికిత్స తీసుకున్న వియషం పాఠకులకు తెలిసిందే. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో ఆయన కావేరీ ఆస్పత్రిలోనే చికిత్స పొందారు.




## జైడస్ క్యాడిలా బీపీ ఔషధానికి యూఎస్ఎఫ్‌డీఏ అనుమతి

**న్యూఢిల్లీ :** క్యాడిలా హెల్త్‌కేర్ బుధవారం నాడు ఒక ప్రకటనలో గ్రూపునకు చెందిన జైడస్ క్యాడిలా అమెరికా ఔషధ నియంత్రణ సంస్థనుంచి బ్లడ్ ప్రెషర్ ఔషధం మార్కెట్ చేసుకోవడానికి అనుమతి లభించిందని తెలిపింది. డిలిటియాజ్ హైడ్రోక్లోరైడ్ (టియాడిలిట్ ఈఆర్) క్యాప్సుల్స్ 120 ఎంజీ, 180 ఎంజీ, 300 ఎంజీ, 420 ఎంపీలను మార్కెట్ చేసుకోవడానికి అనుమతించిందని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. కాగా ఈ ఔషధాన్ని గ్రూపునకు చెందిన ఫార్ములేషన్ తయారీయూనిట్ అహ్మదాబాద్‌లోని ఫార్మా సెజ్‌లో ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొంది. ఈ ఔషధం కేవలం బ్లడ్ ప్రెషర్‌తో పాటు కొన్ని గుండెజబ్బులకు కూడా పనిచేస్తుందని క్యాడిలా ఒక ప్రకటనలో వివరించింది. దీంతో పాటు క్యాడిలా హెల్త్‌కేర్‌క యుఎస్ఎఫ్‌డీఏ నుంచి అజెలిస్టిన్ హైడ్రోక్లోరైడ్ 137 ఎంసీజీ నాస్ స్ప్రే, తుమ్ములు, ముక్కు రొంప, అలర్జీకి వాడుకోవచ్చునని, ఈ స్ప్రేను అహ్మదాబాద్‌లోని మొరాయాలోని ఫార్ములేషన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో ఉత్పత్తి చేయడం జరుగుతోందని తెలిపింది. తాజాగా యూఎస్ఎఫ్‌డీఏ నుంచి అనుమతులతో కలుపుకుంటే కంపెనీకి ఇప్పటి వరకు 140 అనుమతులు లభించినట్లు అని ఒక ప్రకటనలో తెలిపింది. కాగా బీఎస్ఈలో దీని షేరు 1.48 క్షీణించి రూ.477.90 వద్ద మధ్యాహ్నం ట్రేడ్ అయ్యింది.




## బయోకాన్ ఈయూ అనుమతుల దరఖాస్తు ఉపసంహరణ

**బెంగళూరు :** బయోకాన్ లిమిటెడ్.. యూరోపియన్ యూనియన్ నుంచి రెండు ఔషధాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే ఈయూ ఔషధ నియంత్రణా సంస్థ వారి ప్లాంట్‌ను సందర్శిస్తామని ప్రకటించిన వెంటనే దరఖాస్తులను ఉపసంహరించుకుంది. దీంతో బీఎస్ఈలో దీని షేరు ఏకంగా 8 శాతం క్షీణించింది. అయితే బయోకాన్ మాత్రం మరోసారి దరఖాస్తు చేసుకుంటామని చెబుతోంది. రొమ్ము కేన్సర్‌కు వాడే ఔషధం ట్రాస్టాజుమాబ్, ఫెగ్‌ఫిల్‌గ్రాస్టిమ్ ఈ రెండు ఔషధాలు చెమోథెరపి చికిత్స పొందుతున్న రోగులకు ఇన్‌ఫెక్షన్ సోకుండా అడ్డుకట్ట వేస్తుందని బయోకాన్ తెలిపింది. యూరోపియన్ మెడికల్ ఏజెన్సీ ప్లాంట్‌ను సందర్శించిన తర్వాత దరఖాస్తు చేస్తామని బయోకాన్ బీఎస్ఈకి బుధవారంనాడు సమాచారం అందించింది. యూరోపియన్ ఔషధ నియంత్రణా సంస్థ తమ ప్లాంటను సందర్శించిన తర్వాతనే అనుమతులు ఇస్తామని తెలిపిందని బయోకాన్ తెలియజేసింది. అయితే బీఎస్ఈకి ఎప్పుడు వారు తనిఖీకి వస్తారనే విషయం మాత్రం తెలియజేయలేదు. ఈ త్రైమాసికంలోనే తమ ప్లాంట్‌లలో ఎలాంటి లోపాలు లేకుండా చూస్తామని.. అటు తర్వాత ఈయుకు మరోసారి దరఖాస్తు చేసుకుంటమని తెలిపింది.

## గ్రాన్యూల్స్ ఇండియా యూనిట్‌పై యుఎస్‌ఎఫ్‌డీఏ నివేదిక




**న్యూఢిల్లీ :** ప్రముఖ ఔషధ కంపెనీ గ్రాన్యుయెల్స్ ఇండియా చెందిన హైదరాబాద్‌లోని గగ్గిల్లాపూర్ ప్లాంట్‌ను అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యుఎస్ఎఫ్‌డీఏ) సందర్శించిందని కంపెనీ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపింది. కంపెనీ క్లీన్ చిట్ ఇచ్చిందని గ్రాన్యుయెల్స్ ఇండియా బీఎస్ఈకి కూడా సమాచారం అందించింది. తమ ప్లాంట్‌ను అక్టోబర్ 2016లో యుఎస్ఎఫ్‌డీఏ సందర్శించి అన్నీ విభాగాలను పరిశీలించి వారు సూచించిన నియమ నిబంధనల ప్రకారం పనిచేస్తున్నందుకు సంతృప్తిని వ్యక్తం చేసిందని ప్రకటనలో తెలిపింది. కాగా బీఎస్ఈ దీని షేరు 8 శాతం పెరిగి రూ.125.75 వద్ద మధ్యాహ్నం ట్రేడ్ అయ్యింది.

# మార్కెట్ కళ కళ

**• సెన్సెక్స్ 322 పాయింట్ల వృద్ధి • టాటామోటార్స్, సిప్లా హవా • గ్లోబల్ మార్కెట్లు లాభాల్లోనే**

**ముంబై :** స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సూచిలు బుధవారం నాడు ఏకంగా ఒక శాతం వరకు లాభపడ్డాయి. వరుసగా గత కొన్ని ట్రేడింగ్ సెషన్‌లలో నష్టాలను చవిచూశాయి. తాజాగా గ్లోబల్ మార్కెట్లు లాభాల బాటలో దూసుకుపోవడంతో సెంటిమెంట్ ప్రకారం దేశీయ మార్కెట్లు లాభాలను మూటగట్టుకున్నాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వు సమావేశం తాజా మినిట్స్‌కూడా వెల్లడికానున్నాయి. మార్కెట్లు ముగిసే నాటికి బీఎస్ఈ సూచి 321.86 పాయింట్లు లాభపడి 31,770.89 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ కూడా 103.15 పాయింట్లు లాభపడి 9,897.30 వద్ద ముగిసింది. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన సూచిల విషయానికి వస్తే ఎఫ్ఎంసీజీ 2.94 శాతం, మెటల్ 1.72 శాతం, ఆటో 1.62 శాతం, బ్యాంకిగ్ 1.26 శాతం.. దీనికి వ్యతిరేకంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 0.18 శాతం, క్యాపిటల్‌గూడ్స్ 0.13 శాతం వరకు క్షీణించాయి.

బీఎస్ఈలో లాభాలను మూటగట్టుకున్న టాప్ ఐదు షేర్లు ఇలా ఉన్నాయి. టాటామోటార్స్ 3.57 శాతం, సిప్లా 3.54 శాతం, ఐటీసీ 3.01 శాతం, హెచ్‌యూఎల్ 3.00 శాతం, సన్‌ఫార్మా 2.69 శాతం... దీనికి వ్యతిరేకంగానష్టాలను చవి చూసిన షేర్లు ఇలా ఉన్నాయి. ఎన్‌టీపీసీ 1.05 శాతం, ఏషియన్‌పెయింట్స్ 0.94శాతం, పవర్‌గ్రిడ్ 0.81 శాతం, సిప్లా 0.67 శాతం, లూపిన్ 0.56 శాతం వరకు నష్టపోయాయి.

దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐ)లు పెద్దమొత్తంలో మార్కెట్లో షేర్లు కొనుగోలు చేయడంతో సెంటిమెంట్ మరింత బలపడింది. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే జులై నెల రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 2.36 శాతం పెరిగినా.. డిఐఐలు పెద్దెత్తున షేర్లు కొనుగోలు చేశారు. గత నెలలో టోకు ద్రవ్యోల్బణం కూడా 1.88 శాతానికి ఎగబాకింది. ఐదు నెలలో ద్రవ్యోల్బణం పెరగడం ఇదే మొదటిసారి. దీనికి ప్రధానకారణం ఆహార పదార్థాల ధరలు పెరగడమే కారణం. అయితే పారిశ్రామికవేత్తలు వడ్డీరేట్లు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. పారిశ్రామికోత్పత్తి మందగించిందని వారు ఫిర్యాదు చేస్తున్నారు.

### రిటైల్, టోకు ద్రవ్యోల్బణం మరింత పైకి

**● మోర్గాన్ స్టాన్లీనివేదిక ● వడ్డీరేట్ల తగ్గింపు అనుమానమే**


రిటైల్, టోకు ద్రవ్యోల్బణం గత నెలలో అంటే జులైలో పోటీ పడి పెరిగిపోయాయి. అయితే రాబోయే నెలల్లో మరింత పెరిగే అవకాశాలున్నాయని మోర్గాన్‌స్టాన్లీ తాజా నివేదికలో వెల్లడించింది. దీంతో అక్టోబర్‌లో జరిగే రిజర్వు బ్యాంకు ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీరేట్లు తగ్గించ డానికి అవకాశాలు పరిమితంగా ఉంటాయని తెలిపింది.




రిటైల్, టోకు ద్రవ్యోల్బణాలు జూన్‌నెలలో కాస్తా తగ్గినా.. రాబోయే నెలల్లో మాత్రం మరింత పెరగడానికి అవకాశాలు న్నాయని తెలిపింది. టోకు ద్రవ్యోల్బణం విషయానికి వస్తే జులై నెలలో 1.88 శాతానికి ఎగబాకగా.. అంతకు ముందు జూన్ నెలలో 0.90 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. దీనికి ప్రధాన కారణం ఆహార పదార్థాల ధరలు పెరగడం.. ముఖ్యంగా కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. జులై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 2.36 శాతానికి ఎగబాకింది. ఇక్కడ ప్రధానంగా చెప్పుకోవాలంటే చక్కెర, మిఠాయిల్లో వినియోగించే పదార్థాలు, పొగాకు తదితర వస్తువుల ధరలు పెరిగాయి.

తమ అంచనా ప్రకారం ఆగస్టు నెల రిటైల్, టోకు ద్రవ్యో ల్బణాలు వరుసగా 3.0 శాతం, 2.1 శాతం వరకు పెరగవచ్చు నని అంచనా వేసింది. దీనికి మోర్గాన్ చెబుతున్న కారణాల విషయానికి వస్తే





ప్రస్తుతం ధరల సరళిని బట్టిచూస్తే ఆహార పదార్థాల ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, దీంతో పాటు గ్లోబల్ కమాడిటీ ధరలు కూడా పెరుగుతున్నా యని మోర్గాన్‌స్టాన్లీ పరిశోధన పత్రంలో వెల్లడించింది.

ఈ నెల జరిగిన ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షలో రిజర్వుబ్యాంకు కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. అయితే వడ్డీరేట్లను మరింత తగ్గించాలని ఆర్‌బీఐ ఒత్తిడి పెరుగుతోంది. ఎందుకుంటే ద్రవ్యోల్బణం అత్యంత కనిష్ఠానికి దిగివచ్చింది కాబట్టి వడ్డీరేట్లు తగ్గించాలనే డిమాండ్ ఉంది. అయితే మోర్గాన్ స్టాన్లీ మాత్రం సమీప భవిష్యత్తులో వడ్డీరేట్ల కోత జోలికి ఆర్‌బీఐ వెళ్లే అవకాశాల్లేవని, క్రమంగా ద్రవ్యోల్బణం పెరుగుతూ నాలుగు శాతానికి ఎగబాకుతుందని మోర్గాన్‌స్టాన్లీ అంచనా వేసింది. ఈ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం పెరుగుతుందని.. తాజా గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే అక్టోబర్‌లో జరిగే ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగే అవకాశాలున్నాయని చెబుతోంది.

## కోల్ ఇండియా మూలధన వ్యయం రూ.8,500 కోట్లు

**కోలకతా :** ప్రభుత్వరంగానికి చెందిన కోల్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం 2017-18లో మూలధనం వ్యయం కింది రూ.8,500 కోట్ల వ్యయం చేస్తుందని తాజా వార్షిక నివేదికలో వెల్లడించింది. కాగా దేశంలో ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో కోల్ ఇండియా 84 శాతం బొగ్గును ఉత్పత్తి చేస్తోంది. దీంతో పాటు కంపెనీకి చెందిన వివిధ ప్రాజెక్టులపై రూ.6,500 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. వాటిలో క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపీపీ), సోలార్ పవర్, ఎరువుల ప్లాంట్‌లు, కోల్ గ్యాసిఫికేషన్, భారత్‌తో పాటు విదేశాల్లో బొగ్గు బ్లాకులను టేకోవర్ చేయడం, సీబీఎం (కోల్ బెడ్ మేథాయిన) తదితర వాటిపై ఈ ఆర్థిక సంవత్సరం వ్యయం చేయాలనుకుంటున్నట్లు వార్షిక నివేదికలో వివరించింది. ఈ ఆర్థికసంవత్సరం బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 660 మిలియన్ టన్నులు నిర్ణయించుకంది. గతేడాదితో పోల్చుకుంటే 8.3 శాతం వృద్ధి కనిపించింది. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరం అంటే 2018-19లా బొగ్గు ఉత్పత్తి 773.70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. దాదాపు 28.25 శాతం వృద్ధిని సాధించాలనుకుంటోంది.

అదే 2019-20 నాటికి బొగ్గు ఉత్పత్తి 908.10 మిలియన్ టన్నులుగా నిర్ణయించింది వార్షిక వృద్ధిరేటు 12.98 శాతం సాధించాలనుకుంటోంది. 2014-15 ఆర్థిక సంవత్సరం నివేదిక ప్రకారం పారిస్ ప్రోటోకాల్‌ను దృష్టి పెట్టుకొని ఇతర రంగాలపై దృష్టిపెట్టింది. ఉదాహరణకు పునరుత్పాతక విద్యుత్‌పై ఉదాహరణకు సౌర విద్యుత్, క్లన్ ఎనర్జీ ఉదారణకు కోల్‌మైన్ మెథాయిన్, కోల్ బెడ్ మెథాయిన్, ప్రభుత్వం సూచనాల మేరకు కోల్ టూ లిక్విడ్, అండర్‌గ్రౌండ్ గ్యాసిఫికేషన్‌లపై దృష్టి పెట్టింది. బొగ్గుమంత్రిత్వశాఖతో పాటు కోల్ ఇండియా లిమిటెడ్ విజన్ డాక్యుమెంటు 2030ని విడుదల చేసింది. భవిష్యత్తులో జాతీయ ఇంధన రంగం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో విజన్ డాక్యుమెంటులో పేర్కొందని నివేదిక తెలిపింది.

## ఐడీఎఫ్‌సీ బ్యాంకు బెనిఫిట్స్ కార్డు ఆవిష్కరణ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** డిజిటైజ్డ్ ఎంప్లాయి బెనిఫిట్స్ విభాగంలో అగ్రగామి అయిన జెటాతో భాగస్వామ్యం చేసుకుని ఐడీఎఫ్‌సీ బ్యాంకు కార్పొరేట్స్ కోసం అత్యంత సృజనాత్మక పరిష్కారం - ఐడీఎఫ్‌సి బ్యాంకు బెనిఫిట్స్‌ను ఆవిష్కరించింది. దీనిద్వారా ఉద్యోగులు తమ ఖర్చులు, క్లయిమ్స్‌ను డిజిటైజ్డ్ చేయడంతో పాటు ఈ విధానాన్ని అతి సులభంగా, వాస్తవ సమయంలో, పేపర్‌లెస్‌గా చేసుకోవచ్చునని ఐడిఎఫ్‌సి బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అవతార్ మోంగా చెప్పారు. జెటా సహకారం తో ఐడిఎఫ్‌సి బెనిఫిట్స్ సొల్యూషన్‌ను అభివృద్ధి చేశామన్నారు. ఇది సంప్రదాయ బ్యాంకింగ్ బంధానికి ఆవల బ్యాంకు తరహా చెల్లింపు ఫీచర్‌ను అందిస్తుందని, ఉద్యోగులతో పాటు యాజమాన్యాలకు విలువ ప్రతిపాదన అందిస్తుందని తెలిపారు. బెనిఫిట్స్ కార్డు, జెటా యాప్ వినియోగదారుల అనుభవా లను వృద్ధి చేయడంతో పాటు ఉద్యోగులకు పూర్తి సౌకర్యం, ఫ్లెక్సీబిలిటీని అందిస్తూనే ఎంప్లాయర్స్‌కు తమ రీఇంబర్స్‌మెంట్లను డిజిటల్‌గా సమీక్షించి, నిర్వహించడానికి తోడ్పతుందని అవతార్ మోంగా అన్నారు. జెటా సీఈవో రాంకీ గడ్డిపాటి మాట్లాడుతూ, ఐడిఎఫ్‌సి బ్యాంకుతో భాగస్వామ్యం చేసుకోవడంతో సంయుక్తంగా ఉద్యోగుల ప్రయోజనాలను తర్వాత దశకు అత్యాధునిక డిజిటైజ్డ్ పన్ను ప్రయోజనాలను బ్యాంకు ఖాతాదారులకు అందించడం ద్వారా తీసుకువెళ్ళనున్నామన్నారు. డిజిటల్ కార్యక్రమాల ద్వారా లక్షలాది శాలరీడ్ ప్రొఫెషనల్స్‌ను పరిశ్రమల వ్యాప్తంగా చేరుకోవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని రాంకీ అన్నారు. తొలుత ఈ సొల్యూషన్‌ను ఇంటిగ్రేటెడ్ బెనిఫిట్స్ కార్డుగా మెడికల్, మీల్, ఎల్‌టీఏ, ఫ్యూయల్ రీఇంబర్స్‌మెంట్స్ కోసం ఆవిష్కరించినప్పటికీ త్వరలోనే అలవెన్స్‌లకు సంబంధించిన ఇతర విభాగాలకూ విస్తరిస్తామని అన్నారు. ఉద్యోగులు ఐడిఎఫ్‌సి బెనిఫిట్స్ కార్డు ప్రయోజనాలను జెటా మొబైల్ యాప్ లేదంటే వెబ్, జెటా సూపర్ ట్యాగ్ ద్వారా అందుకోవచ్చున్నారు.

## సామాజిక భాధ్యత విస్తరిస్తున్నాం

**ఎయిర్‌టెల్ ఉభయ రాష్ట్రాల సీఈవో వెంకటేశ్ విజయరాఘవన్**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగిపోయే విధంగా, పీడిస్తున్న రుగ్మతలపై ప్రజల్లో అవగాహన పెంపొందే విధంగా ఏ సంస్థ సామాజిక కార్యక్రమాలు చేపట్టినా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీతో సహాయం అందజేస్తున్నామని భారతీ ఎయిర్‌టెల్ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీఈవో వెంకటేశ్ విజయరాఘవన్ తెలిపారు. రకరకాల కాలుష్యాలతో దెబ్బతింటున్న ప్రజారోగ్యాలు, వివిధ రకాల జబ్బులు, వాటికి దూరంగా ఉండేందుకు అవలంబించాల్సిన విధానాలు, మానసిక, శారీరక ఆరోగ్యానికి నిత్య జీవన విధానంపై అనేక కోణాల్లో అవగాహన కార్యక్రమాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ దిశగా విస్తృత ప్రచారం పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయికి కూడా చేరాలని ఆకాంక్షించారు. ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్ రన్నర్స్ అసోసియేషన్ 20వేల మందితో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఎయిర్ హైదరాబాద్ మారథాన్' కార్యక్రమానికి సంబంధించి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 50కిపైగా స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం పంచుకుంటున్నాయన్నారు. గత ఏడాదితో పోలిస్తే 400 శాతం వృద్ధి నమోదైందని, వైవిధ్యమైన సామాజిక కారణాల కోసం తమ సంస్థ రూ.60 లక్షలు ఖర్చు చేసేందుకు సిద్ధమైందని తెలిపారు. ఇషా విద్యా, ఆరోహి బ్లడ్‌బ్యాంకు, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, హీల్ ఎ చైల్డ్, హ్యూమన్ సొసైటీ ఇంటర్నేషనల్, మోహన్ ఫౌండేషన్, ఆపరేషన్ ఐ సైట్ తదితర స్వచ్ఛంద సంస్థలకు భారతీ ఎయిల్ టెల్ తరఫున ఆర్థిక చేయూత ఇస్తున్నామన్నారు.

## ట్రేడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 19న జాబ్‌మేళా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బిజినెస్ టు బిజినెస్ పోర్టల్ ట్రేడ్ హైదరాబాద్ డాట్ కామ్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఈవెంట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్‌లో ఉద్యోగ మేళాను నిర్వహించనుందని ట్రేడ్ హైదరాబాద్ డాట్ కామ్ డైరెక్టర్ కుశలవ్ కుమార్ తెలిపారు. ట్రేడ్ హైదరాబాద్ డాట్ కామ్‌లో ఈవెంట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్ మార్కెటింగ్, నెట్ వర్కింగ్ మార్కెటింగ్, టెలీ మార్కెటింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్ రంగాలలో ఉన్న పలు ఉద్యోగ అవకాశాల కోసం ఈ ఉద్యోగమేళా నిర్వహించనున్నామని కుశలవ్ తెలిపారు. ఏదేనీ డిగ్రీ లేదా ఎంబిఏ పూర్తిచేసిన అభ్యర్థులు, ఫ్రెషర్స్, గతంలో ఉద్యోగ అనుభవం ఉన్నవారు ఈ మేళలో పాల్గొనవచ్చునని చెప్పారు. ఈ ఉద్యోగ మేళాలో పాల్గొనడం కోసం అభ్యర్థులు ఎలాంటి ఫీజును చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.




ఇందులో ఎన్నికైన అభ్యర్థులకు రూ.10,500 నుంచి రూ.16,500 వరకు వేతనం, టీఎ, డీఏ, బిజినెస్ అలవెన్సులతో ఉద్యోగంలోకి తీసుకోవవడం జరుగుతుందని కుశలవ్ కుమార్ వివరించారు. కొత్తపేటలోని ట్రేడ్ హైదరాబాద్ డాట్ కాం డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగే ఈ జాబ్‌మేళాలో అర్హత గలవారు ముందస్తుగా తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు.

## ఎక్కువ జీఎస్టీ రేటుతో లీజింగ్ పరిశ్రమ వృద్ధికి ఆటంకం

**• జీఎస్టీలో 28 శాతం పన్ను**

**కోలకతా :** వస్తు సేవల పన్ను (జీఎస్టి)లో కొన్ని రంగాలపై అధిక పన్ను విధించడంతో ఆయా రంగాలల్లో వృద్ధికి ఆటంకం కలుగుతోంది. తాజాగా రూ.5,500 కోట్ల విలువ కలిగిన క్యాపిటల్‌గూడ్స్ రంగం ఏడాదికి 15-20 శాతం చొప్పున వృద్ధి చెందుతోంది. ఇటీవల ప్రభుత్వం జీఎస్టిలో 28



శాతం పన్ను రుద్దడంతో ఈ రంగం కుదేలయ్యే అవకాశాలు కనిపిస్తు న్నాయి. జీఎస్టి అమల్లోకి రావడానికి ముందు ఈ రంగంపై 5 నుంచి 15 శాతం వరకు పన్ను భారం పడేది. అధిక జీఎస్టిరేటు విధించడంతో అధిక మూలధనం కావాల్సి ఉంటుంది. దీంతో క్యాపిటల్ గూడ్స్ రంగానికి చెందిన పరికరాల ధరలు పెరిగిపోతాయని ఫైనాన్స్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ మహేశ్ థాకూర్ చెప్పారు.

ప్రభుత్వం క్యాపిటల్స్‌గూడ్స్‌ను విలాసవంతమైన లేదా.. ఆరోగ్యానికి హానికరం కలిగించేజాబితాలో చేర్చరాదని కోరా రు. జీఎస్టిలో తక్కువ పన్ను వసూలు చేస్తే క్యాపిటల్ గ్రూపు లీజింగ్ పరిశ్రమ వృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

స్థూల దేశీయోత్పత్తిలో క్యాపిటల్‌గూడ్స్ రంగం వాటా రెండు శాతం కంటే తక్కువగా ఉందని... అదే గ్లోబల్ సరాసరి 10 శాతమని ఆయన అన్నారు. జీఎస్టియే కాకుండా ఇతర అంశాలు కూడా ఈ రంగాన్ని దెబ్బతీస్తున్నాయని వాటిలో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్, పీనల్ ఇంట్రెస్ట్/ ఈఎంఐ చెల్లింపులో ఆలస్యం జరిగినా ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. చేతిలో ఉన్న ఆస్తుల విక్రయాలపై ప్రస్తుతం ఉన్న నిబంధనలు మార్చాలని ఆయన సూచించారు. ఈ రెండు అంశాల వల్ల మూలధనంతో ఇబ్బంది పడుతున్న ఎస్ఎంఈ కంపెనీల యజమనులు మరిన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఉదాహరణకు నిర్మాణరంగానికి చెందిన పరికరాలు, వ్యాగెన్స్, భారీ యంత్రాలు, కారు లీజింగ్‌లతో పాలు ఇతర అంశాలు వీటిలో ఇమిడి ఉన్నాయి. కొత్తగా జీఎస్టి అమల్లోకి వచ్చినందు వల్ల ఈ ఇబ్బందులు మరింత ఎక్కువయన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే లీజింగ్ వ్యాపారంలో భారత్ వాటా కేవలం మూడు శాతమని, దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఈ రంగానికి చెందిన వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## చైనా రసాయనాల దిగుమతిపై డంపింగ్ యాంటి డ్యూటీ

**● మరో ఐదేళ్ల పాటు పొడిగింపు**

**● దేశీయ పరిశ్రమల ప్రయోజనాల కోసం**

**న్యూఢిల్లీ :** చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న రసాయనాలపై ప్రభుత్వం మరో ఐదేళ్ల పాటు యాంటి డంపింగ్ డ్యూటీని పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న రసాయనాన్ని పీటీఎఫ్ఈ అంటారు. దీన్ని నాన్ స్టిక్ పాన్‌తో పాటుఇతర కక్‌వేర్‌లకు కోటింగ్‌గా వాడుతుంటారు. దేశీయ పరిశ్రమ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చైనా నుంచి దిగుమతి చేసుకొనే రసాయనాలపై సుంకాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించింది.



రెవెన్యూ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో చైనా నుంచి దిగుమతి చేసుకునే పోలి టెట్రాఫ్లోరి యెథైలెన్ (పీటీఎఫ్ఈ)పై టన్నుకు 2,637 డాలర్లు సుంకం విధిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ సుంకాన్ని ఐదు సంవత్సరాల పాటు అంటే ఆగస్టు 2011లో మొదలుపెట్టింది. అటు తర్వాత దాన్ని గత ఏడాది ఒక ఏడాది పాటు మళ్లీ పొడిగించింది.

చైనా నుంచి పెద్దమొత్తంలో రసాయనాలు భారత్ మార్కెట్లను ముంచెత్తుతున్నాయని.. దీంతో పాటు దేశంతో దీనికి సంబంధించిన ఉత్పత్తితో పాటు వినియోగం పెరిగిపోవడంతో దేశీయ పరిశ్రమ ఇబ్బందుల్లోకి వెళుతోందని రెవెన్యూశాఖ వెల్లడించింది. చైనా నుంచి దిగుమతులు పెరిగిపోవడంతో దేశీయ పరిశ్రమ ఉత్పత్తి చేస్తున్న వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయని తెలిపింది. చైనా నుంచి పెద్దమొత్తంలో దిగుమతుల వల్ల దేశీయ కంపెనీల లాభాలతో పాటు పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అందుకే యాంటీ డంపిగ్‌సుంకం విధిస్తున్నామని రెవెన్యూ వివరించింది. వాణిజ్య పరిశ్ర మల మంత్రి నిర్మలా సీతారామన్ గత వారం రాజ్యసభలో మాట్లాడుతూ చైనా నుంచి దిగుమతి అవుతున్న 93 వస్తువులపై యాంటి డంపింగ్ సుంకం వి ధి స్తు న్న ట్లు ప్రకటించారు. ఈ ఉత్పత్తులు ఇలా ఉన్నాయి. రసాయనాలు, పెట్రోరసాయనాలు, ఉక్కు, ఇతర లోహాలు, ఫైబర్, యార్న్, యంత్రాలు, రబ్బర్, ప్లాస్టిక్ ఉత్పత్తులతో పాటు ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ వస్తువుల, కన్స్యూమర్‌గూడ్స్‌తో పాటు ఇతర వస్తువులున్నాయి. చైనా నుంచి భారత్ దిగుమతులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. 2016-17లో 6128 కోట్ల డాలర్ల దిగుమతులు జరగ్గా, అంతకు ముందు ఆర్థిక సంవత్సరం 6170 కోట్ల డాలర్ల దిగుమతులు జరిగాయి.


## 100 డొల్ల కంపెనీలపై బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఆడిట్

**ముంబై :** స్టాక్‌ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు అనుమానిత 331 డొల్ల కంపెనీల్లో 100 కంపెనీలపై బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు ఆడిటింగ్ మొదలుపెడతాయని సెబి వర్గాలు మీడియాకు తెలియజేశాయి. మొదటిదశలో 100 కంపెనీ లను ఎంపిక చేసి వాటి ఆడిటింగ్‌కు ప్యానెల్ ఆడిటర్లను నియమించే అవకాశాలున్నాయని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. మొత్తం అనుమానిత 331 డొల్ల కంపెనీల్లో కొన్ని కంపెనీలు తప్పించి మిగిలిన కంపెనీల్లో ఎలాంటి లావాదేవీలు జరగడం లేదు. కొన్ని కంపెనీలపై స్టాక్ ఎక్స్ఛేంజీలు ట్రేడింగ్‌ను కూడా నిలిపి వేశాయి. ఈ కంపెనీలపై విచారణ పూర్తయ్యేవరకు ప్రమోటర్ల షేర్లను చలామణి కాకుండా (ఫ్రీజ్) చేయాలనే ఆలోచనలో స్టాక్ ఎక్స్ఛేంజీలున్నాయి. మొత్తం 331 కంపెనీల్లో 162 బీఎస్ఈలో లిస్ట్ అవుతున్నాయి. చేతికి అందిన గణాంకాలను బట్టి చూస్తే 154 కంపెనీల్లో మూడోవంతు కంపెనీలు అంటే 50 వరకు గత కొన్ని సంవత్సరాల నుంచి నష్టాలను చూపిసున్నాయి. మరో డజను కంపెనీలు గత ఆర్థిక సంవత్సరం అమ్మకాలు సున్నాగా చూపిస్తున్నాయి. అదే సమయంలో ఈ కంపెనీలో రిటైల్ ఇన్వెస్టర్లతో పాటు హైనెట్‌వర్తు ఇండివ్యూడి వల్స్‌కు 95% వాటాలు కలిగి ఉన్నారని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

## ప్రైవేట్ బ్యాంకుల్లోనే మొదటిసారిగా కరూర్‌వైశ్యా బ్యాంకు ఆధార్ అనుసంధాన కేంద్రం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కరూర్‌వైశ్యా బ్యాంకు మొదటిసారిగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించింది. ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో దేశంలో మొదటిసారిగా ఈ బ్యాంకు ఈ తరహా సేవలను చెన్నైలో ప్రారంభించింది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (వుడాయ్) బెంగళూరు రీజియన్ ఆఫీసు అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డిఎం గజారే బుధవారం ఈ సర్వీసులను ఆవిష్కరించారు. బ్యాంకు ఖాతాలన్నీ ఆధార్‌తో అనుసంధానం చేయాలని జులై 13న వుడాయ్ వాణిజ్య బ్యాంకులను కోరడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బ్యాంకు తెలిపింది. తమ ఖాతాదారులంతా సంబంధిత డాక్యుమెంట్లతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలని కోరింది. దేశవ్యాప్తంగా ఉన్న ఈ బ్యాంకు 75 శాఖల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయని కేవలం 15 నిమిషాల్లోనే ఆధార్ అనుసంధానం కార్యక్రమం పూర్తి చేయనున్నట్లు బ్యాంకు తెలిపింది.

# మంత్రి ఆదినారాయణరెడ్డి క్షమాపణ చెప్పాలి



**అమరావతి, ఆంధ్రప్రభ** : యావత్ దళిత జాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు బుధవారం డిమాండ్ చేశారు. దళితులు శుభ్రంగా ఉండరని, సక్రమంగా చదువుకోరని, రిజర్వేషన్లు దళితులకు కొనసాగించడం అనవసరమని, పట్టా భూములను ఉంచుకోరని మంత్రి స్థానంలో ఉండి ఆదినారాయణ రెడ్డి మాట్లాడటాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో ఇలాంటి చర్యలను ఎవరూ హర్షించరన్నారు. ఇప్పటికే సమాజంలో వెనుకబాటుతనం అనుభవిస్తూ అణగారిన వర్గాలుగా పరిగణించబడుతున్న దళితులను చిన్నచూపు చూడటం తగదన్నారు. తక్షణమే మంత్రి వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలని లేకపోతే ఆ వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీవిగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. దళిత జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వివక్షపూరిత వ్యాఖ్యానాలు చేసిన ఆదినారాయణ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తున్నట్లు మధు తెలిపారు.

**దళితుల పట్ల వివక్ష తగదు: రామకృష్ణ**



సమాజంలో వెనుకబాటుతనం అనుభవిస్తున్న దళితుల పట్ల కనీస కనికరం లేకుండా వివక్షచూపుతూ కించపరిచేలా మాట్లాడటం, వ్యవహరించడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలియజేశారు. ఈ మేరకు ఆయన బుధవారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటనను విడుదల చేశారు. దేశ 71వ స్వాతంత్ర్య దినోత్సవం రోజున దళితులను ఉద్దేశించి కించపరిచే వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి తీరును సీపీఐ తీవ్రంగా ఖండిస్తోంది, తక్షణమే ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక దేశ వ్యాప్తంగా దళితులపై దాడులు పెరుగుతుంటే, రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం దళిత వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీలను కించపరిచేలా బహింగ వ్యాఖ్యానాలకు మంత్రిస్థాయి వ్యక్తులు తెగబడుతోంటే దళిత, గిరిజన సంక్షేమం పట్ల టీడీపీ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు.

**దళితులకు రక్షణ కరువు : ఆండ్ర మాల్యాద్రి**



రాష్ట్ర వ్యాప్తంగా దళితులకు రక్షణ, భద్రత కరువైందని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తెలియజేశారు. బుధవారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఒక బహిరంగ లేఖ రాశారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని గరగపర్రు గ్రామంలో 330 దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేశారని, అలాగే ప్రకాశం జిల్లాలోని దేవరపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దళిత భూములను అన్యాయంగా స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కృష్ణాజిల్లాలోని దొండపాడులో దళితుల భూముల్లో అక్రమ రొయ్యల చెరువులను అడ్డుకున్నందుకు వారిపై విచక్షణా రహితంగా దాడులకు తెగబడ్డారని, కర్నూలు జిల్లాలోని చిరుమాన్ దొడ్డిలో దళితులను దేవాలయంలోకి ప్రవేశం లేకుండా అగ్రకుల పెత్తదారులు నిషేదించారన్నారు. చిత్తూరు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరిగే మహాభారత ప్రదర్శనలో తరతరాలు పాల్గొంటున్న దళితులను నిషేదించారని, ఇన్ని దారుణాలు జరుగుతుంటే పాలకులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాజాగా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి దళితులు శుభ్రంగా ఉండరని, సరిగా చదువుకోరని కించపరిచేలా బహిరంగ సభల్లో వ్యాఖ్యానించడం దారుణమన్నారు. దళితులకు రక్షణ, భద్రతను కల్పించడంతోపాటు దళిత జాతిని కించపరిచేలా వ్యాఖ్యానించిన ఆదినారాయణరెడ్డి మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## ఆదినారాయణరెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

**గుంతకల్లు టౌన్, కెఎన్ఎన్:** రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ బుధవారం దళిత సంఘాల నేతలు అనంతపురం జిల్లా గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన దళితుల పట్ల కుల వివక్ష, అంటరానితనం ప్రతిబింబించేలా అనుచిత వ్యాఖ్యలు చేయడంపై గుంతకల్లు పట్టణానికి చెందిన రామాంజనేయులు, వై.భీమలింగ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలు శుభ్రంగా ఉండరని, సరిగా చదువుకోకపోయినా ఉద్యోగాలు సంపాదించి సూపరింటెండెంట్‌లు అవుతారంటూ ఎస్సీ, ఎస్టీల మనోభావాలు దెబ్బతినేలా బహిరంగంగా మాట్లాడిన మంత్రి ఆదినారాయణరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలంటూ వారు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు నరసింహులు, సుంకన్న, ఇసాక్, ఎర్రిస్వామి, లాలెప్ప, ఎం.రామాంజనేయులు పాల్గొన్నారు.

**మంత్రిని భర్తఫ్ చేయాలి: వైకాపా దళిత నేతల డిమాండ్**

దళితుల పట్ల అనుచితంగా మాట్లాడిన రాష్ట్ర మార్కెటింగ్‌శాఖా మంత్రి ఆదినారాయణ రెడ్డిని సత్వరమే మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ దళిత నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ విభాగాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఎస్సీ నేతలు మాట్లాడుతూ, ఎస్సీలను అంటరానివాళ్లుగా మాట్లాడటం తెలుగుదేశం నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. గతంలో కారంచేడు, నీరుకొండ, కదిరికుప్పం ఘటనలు జరగ్గా తాజాగా గరగపర్రు దళితులపై దాడులు జరిగాయన్నారు. ఇవన్నీ చూస్తుంటే దళితులు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయాలని ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం చూస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు కాలేపుల్లారావు, ఎస్టీసెల్ అధ్యక్షులు కట్టా మల్లేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్, ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి మేడా రమేష్, రాష్ట్రట్రేడ్‌యూనియన్ కార్యదర్శి పెనుమాక రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని ప్రాంతంలో ఇద్దరు యువతుల హత్య



**అమరావతి, ఆంధ్రప్రభ :** రాజధాని ప్రాంతంలో ఇద్దరు యువతులు హత్యకు గురైన ఘటన బుధవారం కలకలం సృష్టించింది. గుంటూరు నుంచి అమరావతి వెళ్లే మార్గంలో నరుకుళ్ల పాడు బ్రిడ్జి కింద ఉన్న వాగులో అమరావతికి చెందిన మసక లక్ష్మీ (25), బత్తుల ఫణి (15) నిర్జీవంగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుల్లో లక్ష్మీకి ఆరేళ్ల క్రితం వివాహకాగా, విబేధాల కారణంగా భర్తకు దూరంగా ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. మైనర్ బాలిక ఫణి, లక్ష్మీలు స్నేహితులని పోలీసులు వెల్లడించారు. ఘటనాస్థలిని తుళ్లూరు డీఎస్పీ విక్రాంత్‌పాటిల్, అమరావతి సీఐ మురళీ కృష్ణలు పరిశీలించి కేసు నమోదు చేశారు. హత్యాస్థలిలో క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. ఐతే యువతుల హత్యకు సంబంధించి కారణాలు తెలియరాలేదు.

## గుంటూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం

**ప్రకాశం జిల్లాకు చెందిన 18 మంది కూలీలకు గాయాలు**

**అమరావతి, ఆంధ్రప్రభ :** గుంటూరు జిల్లా తెనాలి సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లాకు చెందిన 18 మంది కూలీలకు గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం కొచ్చర్లపాడు, బసిరెడ్డిపల్లె, కట్టకిందిపల్లెకు చెందిన 18 మంది వ్యవసాయ కూలీలు వరి నారుమళ్ల పనుల నిమిత్తం ఆటోలో చుండూరు మండలం, పెదగాజులపల్లె వెళ్తున్నారు. మార్గమధ్యంలోని పెదరావూరు వద్ద ఆగి ఉన్న సిమెంటు లారీని ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీలకు గాయాలయ్యాయి. వీరందర్నీ తెనాలి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేశారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

# రాష్ట్రంలో వరిసాగు ఎదురీత

**● ఏడాదికేడాది పడిపోతున్న ఉత్పత్తి ● సాగర్ ఆయుకట్టలో మూడేళ్లుగా క్షీణించిన సాగు ● ఈ ఏడాది రాష్ట్రం మొత్తం మీద 39 శాతం నారుమళ్లు ● వరిసాగులో తూర్పు గోదావరి ప్రథమం... ప్రకాశం అధమం**

అమరావతి, ఆంధ్రప్రభ: వర్షాలు సకాలంలో లేకపోవడం.. తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు లేకపోవడంతో రాష్ట్రంలో వరిసాగు గణనీయంగా పడిపోతోంది. ఏడాదికేడాది ధాన్య ఉత్పత్తులు తగ్గిపోతున్నాయి. దీని ప్రభావం ఆహార ఉత్పత్తులపై పడి ధరల పెరుగుదలకు దారి తీస్తోంది. రాష్ట్రంలో వరి పంట తగ్గడంతో ధాన్యం ధరలు పెరిగి, బియ్యం ధరలు కొండెక్కాయి. మార్కెట్లో నాణ్యమైన బియ్యం రకాలు క్వింటాళ్లు రూ.5 వేలు దాటాయి. ఈ ఏడాది కూడా రాష్ట్రంలో వరిసాగు పరిస్థితి అంతంతమాత్రమంగానే ఉంది. నాగార్జున సాగర్ ఆయుకట్టు పరిధిలో వరుసగా మూడేళ్లు మాగాణి భూముల్లో వరిసాగు జరగలేదు. సాగర్‌ఆయుకట్టు పరిధిలోని గుంటూరు, ప్రకాశం జిల్లాలో 7.5 లక్షల ఎకరాల్లో నాట్లు పడలేదు. సాధారణంగా రాష్ట్రం మొత్తంమీద ఖరీఫ్ సీజన్‌లో 30.04 లక్షల హెక్టార్లు, రబీ సీజన్‌లో 12.39 లక్షల హెక్టార్లలో వరి సాగు కావల్సి ఉంది. వాతావరణం అనుకూలిస్తే ఖరీఫ్, రబీ సీజన్‌లు కలిపి 99.46 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి కావల్సి ఉంది. ఐతే గత మూడేళ్లుగా వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రాష్ట్రంలో ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ గతంలో పొరుగు రాష్ట్రాలకు ధాన్యాన్ని ఎగుమతి చేయగా, గత మూడేళ్లుగా ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒరిస్సా, బీహార్, కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ధాన్యం దిగుమతులు పెరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 15,63,150 హెక్టార్లలో వరిసాగు చేయాల్సి ఉండగా, ఆగష్టు 10 నాటికి కేవలం 6,09,425 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేయడం జరిగింది. గతేడాది ఇదే సీజన్‌లో 6,67,377 హెక్టార్లలో వరి నారుమళ్లు వేయడం జరిగింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 60 వేల హెక్టార్లలో వరి సాగులో వెనుకబడి ఉంది. ఈ ఏడాది వరిసాగులో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా, ప్రకాశం జిల్లా చివరి స్థానంలో ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాలో 2,36,131 హెక్టార్లకుగాను 1,98,429 హెక్టార్లలో వరిసాగు అయింది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 6 జిల్లాలు 10 శాతం లోపు సాగు నమోదు కావడం గమనార్హం. కాగా ప్రకాశం జిల్లాలో 28,220 హెక్టార్లకు గాను కేవలం 28 హెక్టార్లలో మాత్రమే వరి నారుమళ్లు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా వరి సాగు వివరాలు క్రింది విధంగా ఉన్నాయి..

ఇదిలా ఉంటే గత నాలుగు రోజులుగా కురుస్తోన్న వర్షాలతోపాటు కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో కూడా వర్షాలు కురవడంతో జలాశయాల్లో క్రమేపి నీటి నిల్వల పరిస్థితి మెరుగుపడుతోంది. దీంతో రానున్న రోజుల్లో సాగు పెరిగే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. సోమవారం నాటికి రాష్ట్రంలో జలాశయాల నీటి నిల్వల పరిస్థితి పరిశీలిస్తే.. తుంగభద్ర 100.86 టీఎంసీల నీటి సామర్థ్యానికిగాను 51.01 టీఎంసీల నీటి ఉల్వాలు ఉన్నాయి. అలాగే శ్రీశైలం 215.8 గాను 19.87, నాగార్జునసాగర్‌లో 312.05కు 115.94 టీఎంసీల నీటి నిల్వాలున్నాయి. గత నాలుగు రోజులుగా కురుస్తోన్న వర్షాలతో జలాశయాల్లో నీటి నిల్వాలు పెరగవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

| జిల్లా | సాగు విస్తీర్ణం | గతేడాది | ప్రస్తుతం సాగు | శాతం |
|---|---|---|---|---|
| శ్రీకాకుళం | 203695 | 10097 | 379692 | 36 |
| విజయనగరం | 118212 | 22495 | 8964 | 8 |
| విశాఖపట్నం | 100519 | 15627 | 8901 | 9 |
| తూర్పు గోదావరి | 232502 | 143998 | 142996 | 52 |
| పశ్చిమగోదావరి | 236131 | 216518 | 198429 | 84 |
| కృష్ణా | 236892 | 65398 | 123576 | 52 |
| గుంటూరు | 206994 | 23534 | 22295 | 11 |
| ప్రకాశం | 28220 | 176 | 28 | 0.1 |
| నెల్లూరు | 50156 | 59874 | 17937 | 36 |
| అనంతపురం | 22169 | 513 | 455 | 2 |
| చిత్తూరు | 14679 | 11295 | 6430 | 42 |
| కడప | 36207 | 35057 | 3342 | 9 |
| కర్నూలు | 76474 | 3419 | 3790 | 5 |
| **మొత్తం** | **1563150** | **667377** | **609425** | **39** |

# ఫలించిన అర్చకుల పోరాటం

**● ఇక నుంచి నెలకు రూ.10 వేల జీతం ●1,458 మంది అర్చకులకు మేలు ● దేవాదాయ శాఖ ఆదేశాలు జారీ**

**అమరావతి, ఆంధ్రప్రభ :** ఎట్టకేలకు అర్చకుల ఎన్నో ఏళ్ల కల, పోరాటం ఫలించింది. కనీస వేతనం లభించక నానా యాతన అనుభవిస్తున్న అర్చకులకు తాజాగా ప్రభుత్వం మ ంచి శుభవార్తను అందించింది. ఇక నుంచి వారికి నెలకు కనీస వేతనంగా రూ. 10వేలు చెల్లిస్తామని బుధవారం దేవాదాయ శాఖ కమిషనర్ ప్రకటించడంతో అర్చకుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం తీసుకున్నఈ నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 1,458 మంది అర్చకులకు మేలు జరుగుతుంది. రాష్ట్రంలోని దేవాదాయ ,ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు నెలకు కనీసం రూ. 5వేలు వేతనం చెల్లించాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం ఏ ఇతర రాష్ట్రాలలో లేని విధంగా గతంలోనే జీవోఎంఎస్ నెంబర్ 417ను 2014 డిసెంబర్ 20వ తేదీనజారీ చేయడం జరిగింది. దాని ప్రకారం మొదటి విడతగా 2015 ఏప్రిల్ 29వ తేదీనుంచి 622 మంది ధార్మిక సిబ్బందికి నెలసరి వేతనం రూ. 5వేలకు తగ్గకుండా రెమ్యునేషన్ ఫండ్ మూలనిధిపై వచ్చిన వడ్డీ నుంచి చెల్లించడం జరిగింది. తిరిగి వారి వేతనాన్ని 2016 జనవరి 18 నుంచి నెలకు రూ. 10వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం 923 మంది ధార్మిక సిబ్బందికి నెలకు రూ. పదివేల కనీస వేతనం అందే విధంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంది. అదే విధంగా ఆదాయ వనరులు ఉన్న దేవాలాయాల్లో పని చేస్తున్న 535 మంది ధార్మికసబ్బందికి దేవాలయ నిధి నుంచి నెలకు రూ.10వేలు క నీస వేతనంగా చెల్లించాలని కార్యనిర్వహణాధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

ఈ పథకం కింద ఎక్కువ మంది ధర్మిక సిబ్బందికి లబ్ది చేకూర్చాలన్న ఉద్దేశ్యంతో జూలై 6న కమిషనర్ అధ్యక్షతన అర్చకులతో జరిగిన సమావేశంలో గ్రామీణ ,పట్టణ ప్రాంతాలలోని అర్చకులకు కనీసవేతనం రూ10వేలు చెల్లించడంపై చర్చించడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వనరులు లేక కనీసవేతనం కూడా పొందని ధార్మిక సిబ్బందికి దూప దీప నేవేద్యం పథకం ద్వారా కాని, రెమ్యునరేషన్ నిధి నుంచి కానీ కనీసం వేతనంగా రూ.5వేలు చెల్లించడం గురించి చర్చించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం వారికి వేతనాలు పెంచుతూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.అయితే ఇప్పటికే రూ. 10వేలు వేతనం పొందుతున్న ధార్మిక సిబ్బందికి వేతన తగ్గించడం జరగదని కమిషనర్‌స్పష్టంచేశారు.

## విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాల సమ్మె నోటీసు

**అమరావతి, ఆంధ్రప్రభ :** రాష్ట్రవ్యాప్తంగా జన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పనిచేస్తున్న 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయు రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎం.ఏ.గఫూర్ డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలుగా తెలుగుదేశం ప్రభుత్వం విద్యుత్‌కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, విద్యుత్ సంస్థలోని సంఘాలన్నీ సమ్మెచేయాలని పిలుపునిచ్చాయని అన్నారు. స్థానిక అలంకార్ సెంటర్‌లో ధర్నా చౌక్ వద్ద పలు సంఘాల యూనియన్ నాయకులు యం. బాలకాశి, యం.ఏసోబు, వి.సుబ్బిరెడ్డి, యం. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గఫూర్‌మాట్లాడుతూ, తెలంగాణాలో కాంట్రాక్టు కార్మికులను ఆ రాష్ట్ర ప్రభుత్వం విలీనం చేసిన తరువాత ఇక్కడ తెలుగుదేశం ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. యనమల రామకృష్ణుడు అధ్యక్షతన వేసిన రిపోర్టు ప్రకారం క్రమబద్దీకరిస్తామని విద్యుత్ యాజమాన్యం మభ్యపెడుతూ వచ్చిందని, కానీ ఆ కమిటీ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్దీకరించే ప్రశ్నేలేదని తేల్చిందన్నారు. సమ్మె నోటీసులో కాంట్రాక్టు కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైయస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.పి.గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ, కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం కల్లగా మారిపోయిందన్నారు. అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, విటపు బాలసుబ్రమణ్యంలు ప్రసంగిస్తూ బయట విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేసే పోరాటాలను విధాన సభలో ప్రభుత్వాన్ని నిలేసి అడుగుతామన్నారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

### జెండా ఆవిష్కరణ వివాదంపై
## క్రమశిక్షణ సంఘం సీరియస్

**ఓ నాయకుని అత్యుత్సాహంపై ఆరా: రఘువీరారెడ్డి**

**అమరావతి, ఆంధ్రప్రభ :** విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరణ సందర్భంగా జరిగిన వివాదంపై పార్టీ క్రమశిక్షణ సంఘం విచారణకు ఆదేశించింది. ఈ విషయమై ఏపీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి కూడా సీరియస్‌గా ఉన్నారు. ఆగస్టు 15 సందర్భంగా కార్యాలయంలో జరిగిన జెండా ఆవిష్కరణ వివాదంపై విచారించాలని మాజీ కేంద్ర మంత్రి, క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ జేడీ శీలంకు కొంత మంది సీనియర్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. దీంతో వివాదం చిలికిచిలికి గాలివానగా మారే పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు 15 సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రఘువీరారెడ్డినే జెండాను ఆవిష్కరించాల్సి ఉంది. ఒక వేళ ఆయన అందుబాటులో లేకపోతే మాత్రం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జెండా ఆవిష్కరించాలి. కానీ వీరిద్దరూ ప్రస్తుతం నంద్యాల ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండడం వల్ల ఇక్కడకు రాలేకపోయారు.దీంతో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌బాబు,నరసింహారావులు ఈ కార్యక్రమాన్ని ముగించారు. అయితే వారు కాకుండా పార్టీకి సంబంధం లేని వేరే వ్యక్తిని తీసుకొచ్చి,పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరింపజేయడంతో పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు సీరియస్ అయ్యారు. అంతేకాకుండా ఈ విషయాన్ని రఘువీరారెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లడంతో ఆయన సీరియస్ అయ్యారు. ఈ విషయాన్ని పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో విచారణకు ఆదేశించారు. దీంతో క్రమశిక్షణ సంఘం చైర్మన్ అయిన కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పార్టీ ప్రముఖులు, కార్యకర్తలందరితో మాట్లాడుతున్నారు.పార్టీ జనరల్ సెక్రటరీగా పని చేస్తున్న నాయకుని ప్రాద్బలం వల్లనే ఇదంతా జరిగినట్లు ఏపీసీసీ అధ్యక్షునికి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయి..**

**అనంతపురం సిటీ, కెఎన్ఎన్:** బూటకపు హామీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ప్రజలను మోసం చేస్తున్నాయని పీసీసీ అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి విమర్శించారు. బుధవారం అనంతపురం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రధాని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, యూపీలో సుమారు 70 మంది చిన్నారులు మృత్యువాత పడినా ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు విభజన సమయంలో ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీల గురించి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ప్రతిపక్షనేత జగన్ కూడా దీనిపై మాట్లాడకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. వీరిద్దరు కలిసి నంద్యాల ఉప ఎన్నికలలో అనేక రకాల అబద్దపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఆ రెండు పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కోటా సత్యం, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ రెడ్డి, కేవి రమణ, జీ. నాగరాజు, శంకర్, వాసు, కృష్ణ హరిరాయల్, ప్రభాకర్ రాయల్, గోవర్దన్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.


## వ్యక్తిగత కారణాలతో రోహిత్ వేముల ఆత్మహత్య

**తేల్చి చెప్పిన రూపన్ వాల్ కమిషన్**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పెను సంచలనం సృష్టించిన హెచ్‌సీయూ(హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ) పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు వ్యక్తిగత కారణాలేనని అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఏకే రూపన్ వాల్ కమిషన్ తేల్చి చెప్పింది. రోహిత్ వేముల మరణానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. వ్యక్తిగత కారణాలు, అసంతృప్తితోనే రోహిత్ బలవన్మరణానికి పాల్పడ్డాడని, క్యాంపస్‌లో జరిగిన పరిణామాలకు రోహిత్ వేముల మృతికి ఎలాంటి సంబంధం లేదని రూపన్ వాల్ కమిషన్ సుస్పష్టం చేసింది. సూసైడ్ నోట్‌లో ఈ విషయం ఉందని నివేదికలో వెల్లడించింది. రోహిత్ వేముల సూసైడ్ నోట్ ఆధారంగా నివేదిక రూపొందించింది. యూనివర్సిటీ నుంచి బహిష్కరణకు గురికావడంతో రోహిత్ ఒత్తిడికి గురైన మాట వాస్తవమే కావచ్చుని.. అయితే ఆత్మహత్యకు మాత్రం అదొక్కటే కారణం కాదని స్పష్టపర్చింది. రోహిత్ ఆత్మహత్య వివాదంలో అప్పటి కేంద్ర మానవ వనరులశాఖ మంత్రి స్మృతి ఇరానీ, కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ హెచ్‌సీయూ అధికారులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ రూపన్ వాల్ కమిషన్ ఆగస్టు తొలి వారంలో యూజీసీకి ఈ నివేదిక సమర్పించింది. మరోవైపు రూపన్ వాలా కమిటీ నివేదికపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

## రేపు విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం

**అవరావతి, ఆంధ్రప్రభ :** 18న విజయవాడ రాణిగారి తోటలోని సిపిఐ కార్యాలయం సిద్దం కృష్ణారెడ్డి భవన్‌లో ఉదయం 10 గంటలకు అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం జరుగుతుందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం సిపిఐ కార్యాయంలో విలేకరుల సమావేశం జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, బ్యాంకుల కన్నా మరో పావలా అదనంగా వడ్డీ ఇస్తమని ఆశచూపి లక్షలాది మంది ఖాతదారుల నుండి అగ్రిగోల్డ్ సంస్థ వేలాది కోట్ల రూపాయలు వసూలు చేసి సంస్థను మూసివేయటంతో ఖాతాదారులంతా అయోమయానికి లోనయ్యారని, వీరం తా తాము కట్టిన డబ్బుల కోసం ఏజెంట్లను పీడించడంతో మానసికంగా కుంగిపోయిన ఏజెంట్లు దాదాపు 50 మంది ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వం స్పందించకపోడటం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం చల నం తెచ్చుక ని అగ్రిగోల్డ్ ఆస్తులను పారదర్శకంగా వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



బాలుడ్ని బయటకు తీసిన దృశ్యం. ఇన్‌సెట్లో బాలుడు చందు

# మృత్యుంజయుడు

**●10 గంటలు బోరు బావిలో మృత్యువుతో పోరాటం ● క్షణం క్షణం ఉత్కంఠ మధ్య సహాయక చర్యలు ● ఫలించిన ఎన్డీఆర్ఎఫ్ బృందం కృషి ● సురక్షితంగా బయటపడ్డ రెండేళ్ల చందు ● గుంటూరు జీజీహెచ్‌లో మంత్రి కామినేని పరామర్శ**

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఎన్డీఆర్ఎఫ్ బృందం శ్రమ.. కన్నవారి ప్రార్థనలు.. అధికారులు, గ్రామస్తుల ఎదురు చూపులు ఫలించాయి. ఎన్ని నోములు నోచిందో.. ఆ తల్లి దక్కడనుకున్న ఆ బిడ్డ నవ్వుతూ తిరిగొచ్చాడు. బోరు బావి మృత్యుగోడల నుంచి మృత్యుంజయుడై తల్లి ఒడి చేరాడు. క్షణం క్షణం ఉత్కంఠ మధ్య సుమారు 10 గంటలపాటు సహాయక చర్యలు కొనసాగించిన సిబ్బంది, అధికారులు పసివాడికి పునర్జన్మచ్చే ప్రయత్నంలో విజయం సాధించారు. గుంటూరు జిల్లా ఉమ్మడివారం గ్రామంలో మంగళవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో బోరు బావిలో పడిన రెండేళ్ల బాలుడు చంద్రశేఖర్ మృత్యుంజయుడై తిరిగి వచ్చాడు. ప్రభుత్వ యంత్రాంగం కృషితో క్షేమంగా బతికి బయటపడ్డాడు. బాలుని తల్లిదండ్రులు ఆనందంతో మునిగిపోగా ప్రాణాలతో చందును చూసిన గ్రామస్తులు, ఘటనా స్థలిలో ఉన్నవారు ఉత్కంఠగా ఎదురు చూసిన వారంతా కేరింతలు కొట్టారు. అప్పటి వరకు విషాద వదనంతో ఉన్న ఆ ప్రాంతంతో ఒక్కసారిగా ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. తల్లిదండ్రుల కంటే బాలుని రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందంతోపాటు రెవెన్యూ, పోలీసు, వైద్యారోగ్యశాఖ అధికారులు సిబ్బంది ఆనందానికి అవధులు లేవు. బోరు బావిలో చిక్కుకున్న చిన్నారి చంద్రశేఖర్ సుమారు 10 గంటలపాటు మృత్యువుతో పోరాడాడు. సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బంది సుమారు 3 గంటల ప్రాంతంలో బాలుడ్ని బోరు బావి నుంచి సురక్షితంగా రక్షించడంతో అక్కడ ఉన్నవారంతా ఉద్వేగానికి గురయ్యారు. మృత్యు కుహరం నుంచి బయటకు తీసిన చిన్నారికి వెంటనే సహాయక బృందం నీరు తాగించి, అనంతరం 108 వాహనంలో వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బోరు బావిలో పడ్డ చంద్రశేఖర్‌ను సురక్షితంగా బైటకు తీసేందుకు సుమారు 400 మంది సిబ్బంది పది గంటలపాటు కంటికి కునుకు లేకుండా శ్రమించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బాలుడు బోరు బావిలో పడిన వెంటనే సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు, వైద్య బృందం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్, రూరల్ ఎస్పీ అప్పలనాయుడు ఘటనా స్థలికి చేరుకుని ఎన్డీఆర్ ఎఫ్ బృందాలను రప్పించి రెస్క్యూ ఆపరేషను మొదలు పెట్టారు. తొలుత బాలుడు 15 అడుగుల లోతులో ఉన్నట్లు గుర్తించారు. బాలుడ్ని రోబోటిక్ సాంకేతిక పరిజ్ఞానంతో బయటకు తీసేందుకు ప్రయత్నం చేశారు. అది విఫలం కావడంతో బావికి సమాంతరంగా 20 అడుగుల గొయ్యి తవ్వారు. పది అడుగులు తవ్వేసరికి బండరాయి అడ్డు రావడంతో యంత్రాలతో డ్రిల్లింగ్ చేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బాలుడు మరింత లోతుకు జారకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇందులో భాగంగా 20 అడుగుల వద్ద బోరు బావి రంధ్రాన్ని మూసివేశారు. ఎప్పటి కప్పుడు బాలుడ్ని కదలికలను గుర్తిస్తూ పై నుంచి ఆక్సిజన్ పంపుతూ, ఎలాంటి ముప్పు వాటిల్లకుండా జాగ్రత్త పడ్డారు. సహాయక చర్యలు కొనసాగిస్తూనే వైద్య బృందాలను ఘటనాస్థలిలో మోహరించారు. తవ్వకాలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో పడ్డ జోరువాన అందరిలో అలజడి రేపింది. సహాయక చర్యలకు కాసేపు అంతరాయం ఏర్పడింది. బోరు బావిలోకి నీరు రాకుండా రక్షణ చర్యలు చేపట్టారు. వర్షం ఆగిన వెంటనే తిరిగి సహాయక చర్యలు ముమ్మరం చేసిన అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందం నిర్విరామంగా శ్రమించి బాలుడ్ని బోరు బావి గుంత నుంచి సురక్షితంగా బయటకు తీశారు. బాలుడు చందును రక్షించే బాధ్యతలు తీసుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం చివరికి లక్ష్యాన్ని సాధించింది. బుధవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో చందును రక్షించగలిగారు.

ఘటనా స్థలిలో మంత్రి పత్తిపాటి, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ రాయపాటి సాంబశివరావు కుమారుడు రంగారావు సహాయక చర్యలు పర్యవేక్షించారు. బాలుడ్ని రక్షించడంలో కృషి చేసిన కలెక్టర్ కోన శశిధర్, రూరల్ ఎస్పీ వెంకటప్పలనాయుడు, ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పత్తిపాటి మాట్లాడుతూ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బంది కష్టానికి ఫలితం లభించిందన్నారు. బోరు బావిలో పడిన బాలుడు చందును ఎన్డీఆర్ఎఫ్ బృందం సురక్షితంగా బయటకు తీయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఆపరేషన్లో పాల్గొన్న వారందరికీ మంత్రి పత్తిపాటి, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, బాలుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

**మంత్రి కామినేని పరామర్శ**

జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలుడు చంద్రశేఖర్‌ను వైద్యారోగ్య శాఖామంత్రి కామినేని శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం, జిల్లా అధికార యంత్రాంగం సమష్టి కృషి కారణంగా బాలుడు సురక్షితంగా బయటపడ్డారన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు ప్రభుత్వ అధికారులతో సమీక్షించారన్నారు. ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. బాలుని ఆరోగ్యం నిలకడగా ఉందని జీజీహెచ్ నుంచి విడుదల చేయనున్నట్లు మంత్రి కామినేని వెల్లడించారు.



బాలుడ్ని పరామర్శిస్తున్న మంత్రి కామినేని

**పునరావృతం కాకుండా చర్యలు: హోంమంత్రి చినరాజప్ప**

రాష్ట్రంలో బోరు బావి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి చినరాజప్ప అన్నారు. బావిలో పడిన బాలుడ్ని కాపాడిన ఎన్డీఆర్ఎఫ్, పోలీసు, రెవెన్యూ బృందాలను అభినందించారు. రెస్క్యూ టీం శ్రమించి బాలుని ప్రాణాలు కాపాడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న బోరు బావులను పూడ్చి వేసేందుకు చర్యలు తీసుకుంటామని హోంమంత్రి పేర్కొన్నారు.

**కలెక్టర్, ఎస్పీలకు సీఎం అభినందనలు**

బోరు బావిలో పడిన రెండేళ్ల బాలుడ్ని రక్షించడంలో కృషి చేసిన కలెక్టర్ కోన శశిధర్, రూరల్ ఎస్పీ సీహెచ్ వెంకటప్పలనాయుడులను సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. విధినిర్వహణలో వీరుభయులు చూపిన అంకితభావాన్ని సీఎం ప్రశంసించారు.

# పెరిగిన వేడి.. అందని నాడి!

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి, మహిళా నేత రోజా, తదితరులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు జనంలోకి చొచ్చుకుపోయినా, అవి ఎటువంటి ప్రభావం చూపనున్నాయన్నది కూడా ప్రశ్నార్థకమే. తాత్కాలికంగా అటువంటి వ్యాఖ్యలు ఈలలు, చప్పట్లు కొట్టించినా, చల్లారిన తర్వాత పరిస్థితి భిన్నంగా ఉంటుందన్నది తేదేపా అంచనా. కచ్చితంగా తమకే లాభిస్తుందన్న ఆశావహ దృక్పథంతో తేదేపా నేతలు ఉన్నారు. ఇక బుధవారం బాలకృష్ణ రోడ్ షోలతో తెదేపా శ్రేణుల్లోను, నేతల్లోనూ ఆత్మవిశ్వాసం పెరిగింది. అలాగే, 19, 20 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నంద్యాల పర్యటనతో పరిస్థితి పూర్తిగా తమకు అనుకూలంగా మారుతుందన్న నమ్మకంతో ఆ పార్టీ నేతలు ఉన్నారు. కాగా, తమ పార్టీ తటస్తంగా ఉంటుందని జనసేన అధినేత బుధవారం ప్రకటించడంతో నియోజకవర్గంలోని ఆయన అభిమానులు, కార్యకర్తలు ఏ పార్టీకి మొగ్గు చూపుతారన్నది ఆసక్తిగా మారింది. మెజారిటీ జనసేన అభిమానుల ఓట్లు తమకేనని వైకాపా నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా, మహిళా, యువ ఓటర్లు జగన్‌కే ఆకర్షితులవుతారని అంటున్నారు. అయితే, జనసేన అధినేత కీలక ప్రకటనపై తేదేపా నేతలు మాత్రం ఆచితూచి మాట్లాడుతున్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిమతానికి వ్యతిరేకంగా అవినీతి కేసుల్లో కూరుకుపోయిన జగన్‌కు ఎలా ఓటేస్తారని సర్దిచెప్పు కుంటున్నారు. భూమా కుటుంబంతో పవన్‌కు ఉన్న అనుబంధం దృష్ట్యా, ఆయన అభిమానుల ఓట్లు తమకే పడతాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలావుండగా, నంద్యాల నియోజకవర్గంలో బాగా పట్టున్న గంగుల కుటుంబం నుంచి మాజీ ఎంపి ప్రతాపరెడ్డి బుధవారం తెదేపాలో చేరడంతో రాజకీయం మరింత రసకందాయంలో పడింది. గంగులకు గోస్పాడు, నంద్యాల పట్టణంలో మంచి పట్టు ఉందని, బలబలాల్లో స్పష్టమైన తేడా కనిపిస్తుందని అంచనా వేస్తున్నారు. ఇటీవలే ఆయన సోదరుడు గంగుల ప్రభాకరరెడ్డి వైకాపా ఎమ్మెల్సీగా ఎన్నికైన విషయం తెలిసిందే. శిల్పా మోహనరెడ్డి సోదరుడు ప్రభాకరరెడ్డి వలెనే గంగుల ప్రభాకరరెడ్డి కూడా వైకాపా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి సోదరుడిని అనుసరిస్తారా లేదా అన్న ఆసక్తి ఇప్పుడు జనంలో నెలకొంది.

ఏదిఏమైనా, ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల ఓటర్లు స్థానిక పరిస్థితులకు అనుకూలంగా ఎవరికి ఓటేయాలో నిర్ణయించేసుకున్నారని, అర్బన్ ప్రాంతాల్లో ఉంటున్న వేలాది మంది ఉద్యోగులు, నిరుద్యోగ యువత ఎటు మళ్లుతారన్నదానిపైనే అభ్యర్థుల విజయావకాశాలు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు.

# నంద్యాల ముమ్మాటికీ రెఫరెండమే!



(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలని ప్రజలను కోరారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రేషన్ షాపుల్లో 9 సరుకులను అందిస్తే చంద్రబాబు పాలనలో రేషన్ షాపులు బియ్యానికే పరిమితమయ్యాయని అన్నారు. వేసే ఓటు ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న పోరాటంతోపాటు విశ్వసనీయతకు అర్థం తీసుకొని వచ్చేలా ఓటు వేయాలని అభ్యర్థించారు. మూడున్నర ఏళ్ళలో చంద్రబాబు కానీ, మంత్రుల కానీ ఏనాడైనా నంద్యాల రోడ్ల పై చూశారా అని ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మూడేళ్ళలో ఒక్క ఇళ్ళు అయినా కట్టించి ఇచ్చారా అని ప్రజలను అడిగారు. వైఎస్సార్ పాలనలో నంద్యాల నియోజకవర్గంలో 21,800 పింఛన్లు ఉండగా, చంద్రబాబు పాలనలో పింఛన్లను 15 వేలకు కుదించారన్నారు. నంద్యాలలో కాలనీల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. బాబు వస్తే జాబ్ వస్తుందనుకున్నార న్నారు. నిరుద్యోగులకు జాబ్ రాకపోతే ప్రతి నిరుద్యోగికి రూ. 2 వేల చొప్పున భృతి ఇస్తామన్నారని, ఇప్పటికి 38 నెలలు పూర్తి అయిందని, ప్రతి ఇంటికి చంద్రబాబు రూ. 76 వేలు బకాయి పడ్డారన్నారు. చంద్రబాబు తన వద్ద ఉన్న పోలీసు బలంతో ఓటు అడుగుతున్నారన్నారు. నా దగ్గర చంద్రబాబులా డబ్బులు లేవని, పోలీసులు అంతకన్నా లేరన్నారు. నా వద్ద ముఖ్యమంత్రి పదవి లేదని, ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు చూపించే చానళ్ళు, పేపర్లు లేవన్నారు. దివంగత నేత ఇచ్చిన పెద్ద కుటుంబమే తన ఆస్తి అన్నారు. జగన్ అబద్దం చెప్పడు, మోసం చేయడని తెలిపారు. జగన్ వాళ్ళ తండ్రి మాదిరిగానే మాటపై నిలబడతారన్న నమ్మకం, విశ్వసనీయతే తన ఆస్తి పాస్తులన్నారు. దేవుని దయ, మీ ఆశీస్సులు నాకు కావాలని కోరారు. ఉప ఎన్నికల్లో ధర్మాన్ని బ్రతికిస్తూ వైసీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ రోడ్ షోలో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డి, భీమవరం పార్థసారధిరెడ్డి, హబిబుల్లా, ఎంపి మిథున్‌రెడ్డి పాల్గొన్నారు.

# నాబార్డు రుణాలకు ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

అవసరమవుతాయని అంచనా వేసింది. ఇందులో 'ఎక్స్‌ట్రా బడ్జెటరీ రిసోర్సెస్' రూపేణ రూ. 9,020 కోట్లు సమీకరించుకునేందుకు ఇప్పుడు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. తద్వారా తెలుగు రాష్ట్రాలకు చెందిన పలు ప్రాజెక్టులకు నిధుల సమస్య లేకుండా సకాలంలో పూర్తయ్యే అవకాశం ఏర్పడింది. పీఎంకేఎస్వై పథకంలో తెలంగాణ రాష్ట్రం నుంచి 11 ప్రాజెక్టులున్నాయి. అవి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఫేజ్2, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్, రాజీవ్ బీమా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్, పెద్ద వాగు, రాలి వాగు, మత్తడివాగు, కొమురం భీం, పాలెం వాగు, గొల్లవాగు పథకాలు. రాష్ట్రాలు మరియు కేంద్ర జల సంఘం సమీక్షా సమావేశాలలో అందించిన సమాచారం మేరకు, 18 ప్రాజెక్టులు దాదాపుగా పూర్తయ్యే స్థితిలో ఉన్నాయి. 2017-18లో మరో 33 ప్రాజెక్టులు పూర్తి అయ్యే అవకాశాలున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉండగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ప్రాజెక్టులు పూర్తయిన తరువాత సేద్యపు నీటి వినియోగం దాదాపు 76 లక్షల హెక్టార్లకు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇది దేశ వ్యవసాయ రంగ ముఖ చిత్రాన్ని గణనీయంగా మార్చుతుందని ప్రభుత్వం చెబుతోంది. పంటలు పండించే విస్తీర్ణం పెరగడం, పంటల పద్ధతిలో మార్పు, అగ్రో ప్రాసెసింగ్, ఇంకా తదితర అనుబంధ కార్యకలాపాల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని వెల్లడించింది.



### పీపీపీ పద్ధతిలో మెట్రో రైళ్ళు

ప్రభుత్వం,ప్రైవేటు,భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో మెట్రో రైళ్ళ నిర్మాణాన్ని తప్పనిసరి చేస్తూ కొత్త విధానాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి ప్రాధాన్యం ఇచ్చేందుకు వీలుగా ఈ విధానాన్ని రూపొందించారు. మెట్రో రైల్ అథారిటీని ఏర్పాటు చేయాలనీ, మెట్రోరైలు మార్గాలకు అవసరమైన సామగ్రి, ఫేబ్రికేటెడ్ కట్టడాలుమొదలైనవన్నీ మేక్ ఇన్ ఇండియా ద్వారానే సేకరించాలన్న నిబంధనను చేర్చడం జరిగింది. దేశంలో ప్రస్తుతం 12 నగరాల్లో 534 కిలోమీటర్ల పొడవున మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోంది.ఏడు నగరాల్లో 370 కిలో మీటర్ల పొడవున మెట్రో రైల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి మరో ఆరువందల కిలో మీటర్ల పొడవున మెట్రో రైల్ సర్వీసులను కల్పించాలని నిర్ణయించారు..భారీగా ప్రైవేటు పెట్టబడులను ఆకర్షించడానికి వీలుగా ఈ కొత్త విధానాన్ని రూపొందించారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయాలను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పత్రికల వారికి తెలియజేశారు. రాబడి రేటు ప్రస్తుతం 8 శాతం మాత్రమే ఉండగా,దీనిని 14 శాతానికి పెంచాలని నిర్ణయించారు.

# బ్యాలెట్ బుల్లెట్‌తో కాల్చండి!

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనదైన శైలిలో ప్రసంగిస్తూ కొందరు కోతి చేష్టలతో ఓట్లు అడగడానికి వస్తారని, వారిపట్ల అప్రమత్తంగా వుండాలని కోరారు. కుల, మత, ప్రాంత విద్వేషాలతో రెచ్చగొడతారని అన్నారు. ఓటు హక్కును బ్రహ్మాయుధంగా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డికి ఆస్తులు లేకపోతే సిబిఐ, ఈడీలు ఆస్తులను ఏవిధంగా జప్తు చేసుకున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వంపై, టీడీపీపై చేస్తున్నవన్నీ పచ్చి అబద్దాలు అని ఆరోపించారు . శిల్పా సోదరుల తీరు పాలు తాగి తల్లి రొమ్ము గుద్దినట్టుగా వుందని విమర్శించారు. జిల్లా పార్టీ అధ్యక్షపదవితో పాటు రెండు సార్లు ఎమ్మెల్సీగా ఇద్దరికీ ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి ప్రోత్సహిస్తే నమ్మించి మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రజాసేవ చేస్తామని పార్టీలో చేరినవారు అదే పార్టీని విమర్శిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ఇచ్చిన గౌరవాన్ని తూలనాడుతూ వైఎస్సార్‌సిపి తరపున పోటీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలను ప్రశ్నించారు. 22వేల లోటు బడ్జెట్‌లో వుంటే, చాకచక్యంతో చంద్రబాబు గాడిలో పెడుతున్నారని అన్నారు. ఏపీకి పరిశ్రమలు లేవని, అయినా బాబు కృషితో రాజధానికి పరిశ్రమలు పరుగుతో వస్తున్నా యని అన్నారు. రైతులకు నిర్విరామంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారని, సాగునీటి ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయడం జరుగుతోందన్నారు. పరిశ్రమలను ఆకర్షించడంతో పాటు ఉపాధి కల్పనలో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో వుందని బాలకృష్ణ తెలిపారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశారని, రాష్ట్రంలో, నంద్యాల డివిజన్‌లో సబ్సిడి మీద రైతులకు వ్యవసాయ పరికరాలను అందించారన్నారు. మైనార్టీలసంక్షేమానికి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని చెబుతూ రాష్ట్రా న్ని నలుదిశలా అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షం బురద జల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. వారికి ఓట్ల తూటాలతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా విజయాన్ని అందించాలన్నారు. బ్రహ్మానందరెడ్డి విజయమే భూమా నాగిరెడ్డికి ఘనమైన నివాళి అన్నారు. తానెప్పుడు ఆళ్ళగడ్డ, నంద్యాల వచ్చినా భూమా కుటుంబమే ఆతిథ్యం ఇచ్చేదన్నారు.



ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణరోడ్‌షోలో భాగంగా నంద్యాల నియోజక వర్గం పరిధిలోని వెంకటేశ్వరపురం, బొమ్మలసత్రం, కోయిలకుంట్ల జంక్షన్, రైతు నగరం, కానాల, ఎం.చింతకుంట్ల, జూలేపల్లి, పసులపాడు, గోస్పాడు, జిల్లెల, కానాలపల్లి, దీబగుంట్ల, అయ్యలూరు మెట్ల, నూనేపల్లి, రైల్వే స్టేషన్‌రోడ్డు, వై జంక్షన్, పద్మావతి నగర్‌సెంటర్, సంజీవ నగర్, శ్రీనివాస నగర్, గాంధీచౌక్, నడిగడ్డ, ఎన్‌టిఆర్ షాదిఖానా, శ్రీనివాసనగర్ సర్కిల్ ప్రాంతాలలో పర్యటించారు.

# అన్ని గ్రామాల్లో మీసేవ



- అదనంగా మరో 21 సేవలు
- ఐటీశాఖ సమీక్షలో మంత్రి లోకేష్

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని అన్ని గ్రామల్లో మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం ఐటీ శాఖ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ అధికా రుల తో సమీక్ష నిర్వహించిన ఆయన త్వరలోనే రాష్ట్రంలోని 12920 గ్రామాల్లో మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈసం దర్భంగా మీసేవలో మరో 21 సర్వీసులను అదనంగా చేర్చామని అధికారులు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా కొత్తగా రూపొందించిన టెంపుల్ మ్యానేజ్మెంట్ సిస్టమ్‌ని త్వరలోనే దేవాలయాల్లో ఉపయోగిం చాలని తెలిపారు. ఇన్నోవేటివ్ ఐడియాస్‌ని అభివృద్ది చేయటంలో బాగంగా ఐదు స్టార్ట్ అప్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చు కున్నామని అధికారులు మంత్రికి వివరించారు. అదేవిధంగా ఈప్రగతి కోర్ ప్లాట్ ఫార్మ్ ఏర్పాటు, ఈప్రగతి సర్టిఫికేషన్ పోగ్రాం, ప్రభుత్వ రుణ మార్పిడి విధానంపై ఈప్రగతి రూపొందించిన అధునాతన సాఫ్ట్ వేర్ పై చర్చించారు. ఈసందర్భం గా ఈప్రగతి కోర్ ప్లాట్ ఫార్మ్ ఏర్పాటును త్వరగతిన పూర్తిచేయాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. దీంతోపాటు ఈప్రగతి సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ రుణ మార్పిడి విధానంపై ఈప్రగతి రూపొందించిన అధునాతన సాఫ్ట్ వేర్‌ను త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించాలని స్పష్టంచేశారు. ఈసమావేశంలో ఈప్రగతి సీఈఓ బాలసు బ్రహ్మాణ్యం, ఐటి సెక్రటరీ విజయానంద్, ఏపీఐఐసి ఎండీ బాబు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య నగరి



(మొదటిపేజీ తరువాయి)

ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఇండో యూకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెడ్‌సిటీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200ఏళ్ళ చరిత్ర కలిగి న కింగ్స్ వైద్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని , అలాంటి సంస్థ దేశవ్యాప్తంగా 11రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను ప్రారంభించనుందన్నారు. బ్రిటన్‌లో ప్రధాని నరేంద్రమోడీ 2015లో పర్యటించినప్పుడు ఈ ఒప్పందానికి శ్రీకారం చుట్టారని, తొలుత పది రాష్ట్రాల్లో మాత్రమే ఇండో - యూకె ఆసుపత్రులు ప్రారంభించేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. ఆ జాబితాలో అమరావతి పేరు లేనప్పటికీ తాను ప్రధానమంత్రి నరేంద్రమోడీకి చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్రానికి కేటాయించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశవ్యాప్తంగా 11రాష్ట్రాల్లో రూ. 17వేలకోట్లతో కింగ్స్ కాలేజ్ ఆఫ్ హెల్త్ తన శాఖలను నెలకొల్పుతుండగా, ఒక్క అమరావతిలోనే రూ. 16వందల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఇక్కడ్నుంచే ఈ సంస్థ దేశవ్యాప్తంగా కార్యకలాపాలను సాగిస్తుందన్నారు. ఈ 11శాఖల్లో 25వేల మంది నర్సులు, 10వేల మంది డాక్టర్లు, 11వేల పడకలతో ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ప్రతి శాఖలో వెయ్యి పడకల ఆసుపత్రి ఏర్పాటు అవుతుందని చెప్పారు. ఇప్పటికే అమరావతికి ఎయిమ్స్, బి.ఆర్ షెట్టి, అమృత్, ఎస్ఆర్ఎం, విట్ లాంటి సంస్థలు వచ్చాయని , వీటిలో ఎస్ఆర్ఎం తరగతులను కూడా ప్రారంభించిం దన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13మెడికల్ కళాశాలలు ఉన్నాయని, అవి 20కి చేరే అవకాశం ఉందన్నారు. త్వరలో రాజధానిలో ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కూడా ఏర్పాటు అవుతుందని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు తెలిపారు. విదేశాల్లో వైద్యం ఖరీదైన దని, చాలా మంది రాష్ట్రంలో లభిస్తున్న వైద్య సేవల ను చూసి ఇక్కడికి తరలి వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అప్పుడు టూరిజం కూడా అభివృద్ధి చెందుతుందని, దీనికి అనుగుణంగా ఇప్పటికే స్టార్ హోటల్స్‌ను నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభం అయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రజాఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆరోగ్య రక్షద్వారా 1040 వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అంతేకాకుండా కిడ్నీ వ్యాధి గ్రస్తులకు రూ. 2500లు పెన్షన్‌ను అందించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అమెరికాలో పనిచేస్తున్న ప్రతి నలుగురు వైద్యుల్లో ఒకరు భారతదేశానికి చెందిన వారు ఉన్నారని, అందులో 30శాతం మంది తెలుగు వారేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గుంటూరు, కృష్ణాజిల్లాల నుంచి అత్యధిక మంది వైద్యులు అమెరికాలో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రపంచంలో ఉన్న తెలుగు వారినే కాకుండా విజ్ఞానవంతులందరినీ అమరావతికి ఆహ్వానిస్తున్నామని అన్నారు. చంద్రన్న సంచార వైద్య సేవల కోసం 277వాహనాలు రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయని, స్వస్థ విద్య వాహిని ద్వారా వైద్య విద్యార్థులు గ్రామాల్లో చికిత్సలు అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎవరైనా చనిపోతే వారిని గౌరవంగా ఇంటికి తీసుకువెళ్ళి అంత్యక్రియలు నిర్వహించేందుకు మహాప్రస్తాన వాహనాలు సైతం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఒక లక్ష్యంతో పనిచేస్తే ఏదైనా సాధ్యమేనని, దీనికి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిదర్శనమన్నారు. గూగుల్, మైక్రో సాఫ్ట్ లాంటి ప్రపంచ ఖ్యాతి పొందిన సంస్థలకు సిఈవోలుగా భారతీయులున్నారని, భవిష్యత్తులో 50శాతం గ్లోబెల్ కంపెనీలకు భారతీయులే ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. టెక్నాలజీ పరంగా భారతదేశం దూసుకుపోతుందని, సెల్‌ఫోన్, సోషల్ మీడియా వినియోగంలో కూడా ప్రపంచ దేశాల కన్నా ముందున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన 5నగరాల్లో అమరావతిని నిలపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అమరావతికి వచ్చిన ప్రతి పెట్టుబడి, పరిశ్రమ ప్రపంచ ప్రసిద్ధి పొందాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని అన్నారు. 2019 అక్టోబర్ 2 నాటికి ఆసుపత్రి తొలిదశ నిర్మాణం పూర్తి అవ్వడంతో పాటు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అనంతరం కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ మాట్లాడుతూ నవ్యాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ప్రతి ఒక్కరికి చంద్రబాబు మార్గదర్శిగా నిలుస్తున్నారని కేంద్ర మంత్రి కొనియాడారు. బ్రిటన్, భారత్ ఒప్పందం ప్రకారం దేశవ్యాప్తంగా కింగ్స్ ఆసుపత్రి 11శాఖలను నెలకొల్పుతుందని తెలిపారు. 2022 నాటికి ఈ సంస్థ వైద్య సేవలు అన్ని శాఖల్లో అందించనుందని పేర్కొన్నారు. ఇప్పటికే దేశంలో తొలిశాఖ ను నాగపూర్‌లో శంకుస్థాపన జరిగిందని, ఆ తర్వాత అమరావతి రెండవ స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కింగ్స్ ఆసుపత్రి చైర్మన్ లార్డ్ రాబర్ట్, బ్రిటన్ పార్లమెంట్ సభ్యులు ఆండ్రు మిచెల్, బ్రిటన్ డిప్యూటి హైకమిషనర్ భరత్‌జోషి, రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, కామినేని శ్రీనివాస్, ఎంపి కేశినేని నాని, సిఆర్డిఏ ముఖ్యకార్య దర్శి అజయ్‌జైన్, ఈడిబి సీఈవో కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

# ఇక సిస్టర్ శశికళ

- చిన్నమ్మకు అవే రాచమర్యాదలు
- సమాచార హక్కు చట్టంతో బట్టబయలు
- సామాజిక కార్యకర్త నరసింహమూర్తి సుప్రీం కోర్టులో పిటిషన్



**బెంగళూరు :** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళ(చిన్నమ్మ) ఇప్పుడు కర్నాటక పౌరుల (జైలు అధికారుల)కు సోదరి అయ్యారు. ఎలా గంటారా... సాధారణ ఖైదీగా ట్రీట్ చేయాల్సిన జైలు అధికారు లు ఆమెకు అసాధా రణ రీతిలో సకల సౌకర్యాలు అందిస్తూ, పరప్పన అగ్రహారం కేంద్ర కారాగార జైలు అధికారులు, సిబ్బందితో సిస్టర్ అని పిలిపించుకునే స్థాయికి ఎదిగారు. ఈ విషయాన్ని బెంగళూరుకు చెందిన సామాజిక కార్యకర్త నరసింహమూర్తి ఈ వివరాలను బైటపెట్టారు.

నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న శశికళ జైలు జీవితం గురించి సమాచార హక్కు చట్టం ద్వారా ఆయన సేకరించిన వివరాలను తమిళ సాయంకాల దినపత్రిక 'తమిళ్ మురసు' ప్రచురించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. సాధారణ ఖైదీగా జీవనం గడపాల్సిన శశికళ జైలు నిబంధనలకు ఏమాత్రం లోబడకుండా వ్యవహరిస్తున్నట్లు నరసింహమూర్తి సమాచారం సేకరించానని తెలిపారు. ప్రత్యేక దుస్తులు, ఐదు గదుల్లో వసతులు, ప్రత్యేక వంటగది, పనివారలు, బయట నుంచి మందులు, కాళ్లు, చేతులు మసాజ్ చేసేందుకు పనివారు. ఇంకా అనేక సౌకర్యాలు పొందుతున్నట్లు కర్నాటక జైళ్ల శాఖ మాజీ డీఐజీ రూప మౌద్గిల్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన సంగతి ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. జైళ్ల శాఖ ఉన్నతాధికారులకు శశికళ రూ.2 కోట్లు ముడుపులు చెల్లించి ఆ సౌకర్యాలు పొందుతున్నట్లుగా డీఐజీ రూప చేసిన ఆరోపణలపై కర్నాటక ప్రభుత్వం రిటైర్డు ఐఏఎస్ వినయ్‌కుమార్ విచారణ జరుపుతున్నా, ఆ విచారణలో పురోగతి ఏమాత్రం లేదని తెలుస్తోంది. కానీ, శశికళ దర్జా జీవితాన్ని కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. జైలు నిబంధనల ప్రకారం శిక్ష అనుభవిస్తున్న ఖైదీ నెలకు రెండుసార్లు మాత్రమే తన కోసం వచ్చే వారితో భేటీ సౌకర్యం ఉంటుందని నరసింహమూర్తి పేర్కొన్నారు. కానీ శశికళ కోసం వచ్చే వారికోసం ప్రత్యేకగదిని ఏర్పాటుచేయడం, ఆమెకోసం వచ్చేవారితో ఎప్పుడుపడితే అప్పుడు నిరభ్యంతరంగా మాట్లాడుతుండటం వంటి జైలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని తెలిపారు.


అయితే గతనెలలో ఆరుసార్లు శశికళ తనవారితో మంతనాలు నెరపారని, అలాగే ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఖైదీలను కలుసుకోవాల్సి ఉండగా, శశిని కలుసుకున్న వారు సాయంత్రం 6 గంటలు దాటినా ఆమెతోనే ఉన్నారు. గతనెల 11వ తేదీన షకీలా, వివేక్, కీర్తన, జయ, వెట్రివేల్, తమిళ్‌సెల్వన్, నాగరాజ్ మొత్తం ఏడుగురు శశితో మాట్లాడారని, వారిలో నలుగురు బంధువులమని పేర్కొనగా, మిగిలినవారు ఏమీ స్పష్టం చేయకుండానే కలుసుకోవడం గమనార్హం అని తెలిపారు. అలాగే జులై 5వ తేదీన డాక్టర్ వెంకటేష్, టీటీవీ దినకరన్, పళనివేల్, ఎమ్మెల్యే కేవీ రామలింగం, తమిళ్‌మగన్ హుస్సేన్, వెట్రివేల్ తదితరులు సందర్శకుల సమయం దాటిపోయినా కూడా గంటలతరబడి ఆమెతో కూర్చుని మాట్లాడుకున్నారని చెప్పారు.

గత నెల 28న ఒక ఖైదీ తండ్రి చనిపోగా ఈ విషయాన్ని చెప్పేందుకు ఖైదీ భార్య, మరో మహిళ ఉదయం 8 గంటలకు రాగా సాయంత్రం 5 గంటల వరకు జైలు అధికారులు అనుమతించలేదని ఆయన తెలిపారు. ధనవంతులకు వెసులుబాట్లు, పేదలకు కఠిన నిబంధనలా అని మూర్తి ప్రశ్నించారు. తనకోసం వచ్చే సందర్శకులతో గంటల తరబడి మాట్లాడుతూ జైలులో ఆమె దర్బార్ నిర్వహిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. సాధారణ ఖైదీగా ఉన్న శశిను సిస్టర్ అని మర్యాదగా సంబోధిస్తూ సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం కింద సేకరించిన వివరాలను సాక్ష్యాధారాలతో సుప్రీం కోర్టులో పిటిషన్ వేయనున్నట్లు మూర్తి పేర్కొన్నారు.

## ఢిల్లీ అల్లర్ల కేసులపై పున:పరిశీలన

**న్యూఢిల్లీ :** ముప్పయి మూడేళ్ళ క్రితం నాటి ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన 241 కేసులను మూసివేయడంపై పునఃపరిశీలన జరిపేందుకు ఇద్దరు మాజీ న్యాయమూర్తుల నేతృత్వంలో ఒక కమిటీని సుప్రీంకోర్టు నియమించింది. ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన అల్లర్లకు సంబంధించి 250 కేసులు నమోదు కాగా, వీటిలో 241 కేసులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)విచారణ జరిపి మూసివేసింది. దీనిపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ కేసులను పునఃపరిశీలించేందుకు ఒక కమిటీని సుప్రీంకోర్టు ధర్మాసనం నియమించింది.

# శాసనసభ, హైకోర్టు భవనాల నమూనాలు సిద్ధం



**అమరావతి, ఆంధ్రప్రభ :** అమరావతి రాజధానిలో నిర్మించబోయే రాష్ట్ర శాసనసభ, హైకోర్టు భవంతులకు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన సూచనల ప్రకారం కొత్త ఆకృతులను (డిజైన్లను) సిద్ధం చేసినట్లు పోస్టర్ అండ్ పార్టనర్స్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. వీటిలోపాటు అమరావతి రాజధానిలో పరిపాలనా నగరానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై 400 పేజీల నివేదికను ఈనెల 24, 25 తేదీల్లో ప్రభుత్వానికి సమర్పిస్తామని వారు తెలిపారు. బుధవారం రాత్రి వెలగపూడి సచివాలయం నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోస్టర్ అండ్ పార్టనర్స్ సంస్థ ప్రతినిధుల బృందంతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గత సమావేశంఓ సిఎం చెప్పిన మార్పుల ప్రకారంగా శాసనసభ భవంతిని కోహినూర్ వజ్రాకారంలో, హైకోర్టు భవంతిని బౌద్ధస్థూపాకారంలో మార్చి ఈ నవీన ఆకృతులకు రూపకల్పన చేసినట్లు పోస్టర్అండ్ పార్టనర్స్ సంస్థ ప్రతినిధి క్రిష్ ముఖ్యమంత్రికి వివరించారు. హైకోర్టు భవంతికి సంబంధించిన నిర్మాణ, విస్తరణ వ్యూహాలు, వినియోగించాల్సిన భవన నిర్మాణ సామాగ్రి గురించి ఫోస్టర్స్ ప్రతినిధులు తమ ప్రజెంటేషన్‌లో వివరాలు అందించారు. రాజధానిలో కొత్తగా నిర్మించిన పోలీస్ హెడ్ క్వార్టర్స్ భవంతుల గురించి ముఖ్యమంత్రి ఈసందర్భంగా ప్రస్తావించారు. ఇవి తనకు బాగా నచ్చాయని చెప్పారు. చుట్టూ పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణంలో ఐకానిక్ కట్టడాలుగా వీటిని తీర్చిదిద్దారని ప్రశంసించారు. రాజధానిలో నిర్మించే ప్రతీ భవంతిని ఇదే విధంగా విలక్షణంగా తీర్చిదిద్దాల ని సిఎం సూచించారు. తాను సూచిం చిన ఆకృతులకు తగినట్లు నిర్మాణాలు చేపట్టడంలో ఏవైనా పరిమితులు, ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని, ముందస్తుగా మరికొన్ని ప్రత్యామ్నాయ ఆకృతులను సిద్ధం చేసిన పెట్టుకోవాలని సిఎం ఫోస్టర్ బృందానికి సూచించారు. చివరిగా ఇవి ప్రపంచంలోనే అత్యుత్తమ నిర్మాణాలుగా ఖ్యాతి గడించాలన్నదే తన ఉద్దేశమన్నారు. సెప్టెంబరు 30న నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించుకున్నామని, ఆలోగా తుది ఆకృతులు, సవివర ప్రణాళికలు సిద్ధమయ్యేలా గడువు పెట్టుకున్నామని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎపి సిఆర్‌డిఎ) కమిషనర్ శ్రీధర్ ముఖ్యమంత్రికి వివరించారు. వారధి కూడలిలో ప్రతిపాదించిన 'బుద్ధ చక్రపై అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సినీ ఆర్ట్‌డైరెక్టర్ ఆనందసాయి ఆధ్వర్యంలో రూపొందించిన కొన్ని ఆకృతులను సమావేశంలో సమర్పించారు. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదించారు. 27 అడుగుల ఎత్తులో బుద్ధ చక్రను రూపొందించను న్నారు. బేస్‌మెంట్‌తో కలుపుకొని కట్టడం మొత్తం 40 అడుగుల మేర ఉంటుంది. 'బుద్ధ చక్రను మొత్తం శాండ్ స్టోన్‌తో నిర్మిస్తారు. దీని తయారీకి ప్రత్యేకయంత్రసామాగ్రిని ఉపయోగించను న్నారు. 'బుద్ధ చక్ర నిర్మాణాన్ని నాలుగు నెలలకాలంలో పూర్తి చేస్తారు. రూ.9 కోట్లు కేవలం రాతి నిర్మాణానికే ఖర్చు కాగలదని అంచనా వేశారు. 2018 జనవరి నాటికి మొత్తం కట్టడాన్ని పూర్తి చేస్తామని ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి వెల్లడించారు. శాఖమూరు పార్కును ప్రహరీ గోడ లేకుండా నిర్మించాలని సీఎం చంద్రబాబు చేసిన సూచన మేరకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసి సమావేశం ముందుంచింది. రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి పి.నారాయణ, సిఆర్‌డిఏ కార్యదర్శి అజయ్‌జైన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి సతీశ్‌చంద్ర, అదనపు కార్యదర్శి ఎ.వి.రాజమౌళి పాల్గొన్నారు.

## ఖాకీలపై రాళ్ల దాడి జనంపై విరిగిన లాఠీ



**శ్రీకాకుళం, కెఎన్ఎన్ బ్యూరో:** వంశధార రెండవ దశ నిర్మాణాలకు సంబంధించి నిర్వాసితులు సహకరిస్తూ, మట్టితీత పనులు ముమ్మరంగా జరుగుతున్న పరిస్థితులలో బుధవారం ఒక్కసారిగా పాడలి గ్రామానికి చెందిన నిర్వాసితులు పోలీసులపై రాళ్లతో దాడులకు దిగడం, తరువాత పోలీసులు వారిపై లాఠీచార్జి చేయడంతో పరిస్థితి అక్కడ ఉద్రిక్తంగా మారింది. పాడలి గ్రామం లో నిర్వాసిత ప్రజలతో కలిసి ప్రొక్లైనర్‌పై కర్రలతోను, రాళ్లతో దాడి చేసి అడ్డుకున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై పోలీసులు దాడిచేయడంతో అతను చనిపోయారన్న వార్త ఎవరో చెప్పడంతో ఆగ్రహించిన గ్రామస్థులు పోలీసులపై రాళ్లు విసిరారు. పోలీసులు కూడా గ్రామస్థులపై లాఠీఛార్జి చేయగా కొందరు గ్రామస్థులు కూడా గాయపడ్డారు. జిల్లా ఎస్పి త్రివిక్రమవర్మ సంఘటనా స్థలానికి వెంటనే వెళ్లి గాయపడిన వారిని హిరమండలం, కొత్తూరు ఆసుపత్రులకు చికిత్సకు తరలించారు.

# వట్టి బోషాణంకు గట్టి బందోబస్తు




**● ఖాళీ ఖజానాలకు ఖాకీల కాపలా ● ప్రభుత్వ బొక్కసానికి ఏటా రూ. 5 కోట్ల వృధా ● ఇదీ రాష్ట్రంలో జిల్లా ఖజానాల తీరు**

**అమరావతి, ఆంధ్రప్రభ :** దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 70 వసంతాలు దాటినా, ఇప్పటికీ బ్రిటీష్ కాలం నాటి పోకడలు రాష్ట్రంలో అవ ఎ ్రతూనే ఉన్నాయి. దీనికి నిదర్శన ే రాష్ట్ర ్యాప్తంగా 13 జిల్లాల్లో ఖజానాలకు రక్షణ పేరుతో ఏటా రూ.5 కోట్లు ృధా కా ్డం. గత కొన్నేళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా అధికార యంత్రాంగం పాత పద్ధతులనే అవలంబిస్తోంది. నవ్యాంధ్రప్రదేశ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో దేశంలోనే ముందుందని పాలకులు చెబుతుండగా, ఇంకా పాత చింతకాయపచ్చడి పద్ధతులనే అవలంబించడం విడ్డూరంగా ఉంది.

రాష్ట్రంలోని 13 జిల్లా కేంద్రాల్లోని ట్రెజరీ కార్యాలయాల్లో బ్రిటీష్‌కాలంలో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. వీటిలో స్టాంపులు, ప్రభుత్వ సొమ్ము, పరీక్ష పేపర్లు, నల్ల మందు, కోర్టులో వివాదాస్పద డాక్యుమెంట్లు, నగలు తదితరాలు భద్రపరుస్తారు. వీటికి ఐదుగురితో కూడిన పోలీసులు బృందం అనుక్షణం కాపలా కాస్తుంటుంది. ఐతే దేశవ్యాప్తంగా కుదిపివేసిన 'తెల్గి' స్టాంపుల కుంభకోణం నాటి నుంచి రాష్ట్రంలో స్టాంపుల విక్రయాలు నిలిపివేశారు. స్టాంపుల స్థానే అంతే విలువతో కూడిన చలానాలను రిజిస్ట్రేషన్‌కు వినియోగిస్తున్నారు. గత దశాబ్దకాలంగా ట్రెజరీ కార్యాలయాల్లో స్టాంపుల నిల్వలకు మంగళం పాడారు. అలాగే వివిధ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచడం జరిగేది. ఇటీవల కాలంలో ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు దగ్గరలో ఉన్న పోలీసుస్టేషన్లలో భద్రపరుస్తున్నారు. దీంతో పరీక్షా పత్రాలకు కూడా ఇక్కడ నుంచి రక్షణ అవసరం లేకుండా పోయింది. అదేవిధంగా గతంలో కొందరు వ్యాధిగ్రస్థులకు నల్లమందును సరఫరా చేసేవారు. వైద్యుని నుంచి ధృవీకరణ తీసుకున్న రోగులకు ఖజానా కార్యాలయాలంలోని స్ట్రాంగ్ రూమ్‌లో నిల్వ ఉంచిన నల్లమందు సరఫరా చేయడం జరిగేది. ఐతే కొన్ని దశాబ్దాలుగా ఈ కార్యక్రమం కూడా నిలిచి పోయింది. ఇక మిగిలింది కోర్టులో వివాదాలు, ఆస్థి తగాదాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, బంగారం బాక్సుల్లో పెట్టి ఖజానాలో భద్ర పరుస్తున్నారు. దీనికి రక్షణగా ప్రతి జిల్లా కేంద్రంలోని ఖజానా వద్ద ఐదుగురుతో కూడిన పోలీసు బృందాన్ని, వీరికి తోడు వాచ్‌మెన్ కూడా రక్షణగా ఏర్పాటు చేశారు. వీరందరికీ నెలకు ఒక్కో జిల్లాకు జీత భత్యాల కింద ఏడాదికి సుమారు రూ.40 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తోంది. సాలీనా 13 జిల్లాల్లోని ఖజానాలకు సుమారు 5 కోట్ల వరకు రక్షణ నిమిత్తం ప్రభుత్వం వెచ్చిస్తోంది. కొన్ని ఖజానాల్లో బ్రిటీష్‌కాలంలో రంగూన్ టేకుతో తయారు చేసిన బోషాణాల పెట్టెలు నిరుపయోగంగా ఉండటంతో మూలన పడేశారు. దీంతో జిల్లా కేంద్రాల్లోని ఖజానా కార్యాలయాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లు ఎక్కువగా ఉపయోగ పడకపోయినా రక్షణ సిబ్బంది జీతభత్యాలు మాత్రం భారీగా చెల్లింపు అవుతోంది. ప్రస్తుతం ఖజానాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లో గల కోర్టు డాక్యుమెంట్లను భద్రపరచడానికి బ్యాంకుల్లో మాదిరిగా లాకర్లు ఏర్పాటు చేస్తే సరిపోతుందని నిపుణులు భావిస్తున్నారు. రక్షణ సిబ్బంది లేకపోయినా ఖజానాకు కాపలాగా ఉండే వాచ్‌మెన్ సరిపోతాడని వారంటున్నారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంలో సీసీ కెమేరాలు, అలారాలు వినియోగిస్తున్న నేపథ్యంలో కేవలం కోర్టుకు సంబంధించిన డాక్యుమెంట్లను భద్ర పరిచేందుకు కోట్ల రూపాయలు ఖర్చు అవసరమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రతియేటా స్ట్రాంగ్ రూమ్‌లకు సున్నాలు కొట్టడం, పురుగులు చేరకుండా కలరా ఉండలు వేయడం, సరైన వెలుతురు కోసం లైటింగ్ ఏర్పాటు, ఏడాదికోమారు ఆర్‌అండ్‌బీ శాఖ తనిఖీ చేసి ఇవన్నీ సక్రమంగా ఉన్నట్లు ధృవీకరించాల్సి ఉంది. ఐతే ఈ నిబంధనలు రాష్ట్రంలో ఎక్కడా అమలు కావడంలేదని ఈ నేపథ్యంలో ప్రభు త్వం స్పందించి ఖాళీ ఖజానాలకు రక్షణ పేరుతో ఏటా కోట్లాది రూపాయలు వృధా చేయడాన్ని అరికట్టాలని విశ్లేషకులు కోరుతున్నారు.

## తిరుమలలో ఘనంగా ఉట్లోత్సవం

**● అర్జిత సేవలు రద్దు ● ఉత్సాహంగా పాల్గొన్న యువకులు ● మాడ వీధుల్లో విహరించిన స్వామి**



**తిరుమల, కెఎన్ఎన్ :** శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతి సంవత్సరం శ్రావణ నాడు గోకులాష్టమి ఆస్థానాన్ని నిర్వహించిన మరునాడు ఉట్లోత్సవాన్ని (శిక్యోత్సవం) నిర్వహించడం ఆనవాయితీ,బుధవారం నాడు ఈ ఉట్లోత్సవాన్ని తిరుమలలో వైభవంగా నిర్వహించారు.ఉట్లోత్సవాన్ని పురష్కరించుకొని టీటీడీ ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం,ఊంజల్‌సేవ,ఆర్జితబ్రహ్మోత్సవం,వసంతోత్సవం,సహస్రదీపాలంకరణసేవలనురద్దు చేసింది. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి స్వయాన శ్రీ మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై,శ్రీ కృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరువీధులలో ఊరేగుతూ దాదాపు 16 ప్రాంతాలలో తిరుగాడుతూ ఉత్సాహంగా తిలకిం చారు. ముందుగా ప్రాతఃకాలారాధనం,మధ్యాహ్నికారాధనం అయిన తర్వాత ఈ ఉత్సవమూర్తులు శ్రీవారి ఆలయంలోనికి పూల అర చెంత మలయప్పస్వామిని పోటు అరచెంత శ్రీకృష్ణస్వామిని వేంచేపు చేసి హారతులందించారు.అనంతరం పెద్దజీయంగార్ మఠానికి వేంచేపు చేసి ఆరగింపు హారతి,బహుమాన నివేదనలు నిర్వహించారు.అనంతరం హథీరాంజీ మఠం, కర్ణాటక సత్రాలు వంటి ఇతర ప్రాంతాల్లో కూడా ఉత్సవర్లు కలియతిరుగుతూ ఉట్లోత్సవంలో పాల్గొన్నరు. బుధవారం మధ్యహ్నం 1 గంటకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు అత్యంత కోలాహలంగా సాగిన ఈ ఉట్లోత్సవంలో స్థానికులు,భక్తులు ఉల్లాసంగా పెద్ద సంఖ్యలో పాల్గొని ఉట్లను పగులగొట్టారు.సర్వసాధారణంగా సర్వజగద్రక్షకుడైన స్వామి వారి చిద్విలాసాన్ని తిలకించి పులకించడం భక్తుల వంతైతే ఉట్లోత్సవం నాడు భక్తుల ఉత్సాహాన్ని తిలకించడం స్వామి అమ్మవార్ల వంతు కావడం విశేషం.ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్ తిరుమల జేఈవో శ్రీనివాస రాజు, ఆలయ డిప్యూటీ ఈవో కోదండరామారావు,విజిఓ రవీంద్రారెడ్డి, పెద్దజియరంగార్, చిన్నజియంగార్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహా విశాఖ ఎన్నికలకు తొలి అడుగు

- గ్రేటర్ 81 వార్డులకు విస్తరణ
- 72 నుంచి 81 వార్డులకు పెంపు
- 311 జీవో విడుదల
- భీమిలి నుంచి 1వ వార్డు ప్రారంభం
- ముగింపు తిరిగి భీమిలీ సమీపంలోనే
- 2011 జనాభా లెక్కల ఆధారంగా వార్డుల విభజన
- గ్రేటర్ జనాభా 18,81,686గా ప్రకటన




**విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. మహావిశాఖ నగరపాలక సంస్థ ఎన్నికలకు తొలిఅడుగు పడింది. గత ఐదేళ్లకుపైగా జీవీఎంసీకి పాలకవర్గం లేదు. అయితే న్యాయస్థానంలో కేసులు పెండింగ్‌లో ఉండడంతో ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చింది. చివరకు కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల విషయమై హైకోర్టు తీవ్రంగా స్పందించడంతో ప్రభుత్వం జీవీఎంసీ ఎన్నికలకు ఇక సిద్ధం కాకతప్పలేదు. ఈ మేరకు జీవీఎంసీ వార్డుల విభజనకు సంబంధించిన జీవో నెంబర్ 311ను బుధవారం విడుదలయ్యింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే ..

మహావిశాఖ నగరపాలక సంస్థ పాలకవర్గం పదవీకాలం 2012, ఫిబ్రవరి 26తో ముగిసింది. అప్పటి నుంచి జీవీఎంసీ ప్రత్యేకాధికారుల పాలనలోనే కొనసాగుతుంది. ఆ తరువాత రాష్ట్ర విభజన జరిగిన రోజే (సెప్టెంబర్ 2, 2014) గ్రేటర్‌లో అనకాపల్లి, భీమిలి మున్సిపాలిటీలు, మరో పది పంచాయితీలను ప్రభుత్వం విలీనం చేసింది. ఇందులో అనకాపల్లి వైపు ఐదు పంచాయితీల నుంచి విలీనానికి సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. కానీ భీమిలి వైపు ఉన్న కె.నగరంపాలెం, కాపులుప్పాడ, చేపలుప్పాడ, నిడిగట్టు, జె.వి.అగ్రహారం పంచాయతీల విలీనానికి సంబంధించి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో తదుపరి ఆ ఐదు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. ఇదే సమయంలో గ్రేటర్‌లో అనకాపల్లి, భీమిలి మున్సిపాల్టీలు విలీనంపై తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, భీమిలికి చెందిన గాడు చిన్నికుమారి లక్ష్మి భీమిలి విలీనాన్ని వ్యతిరేకిస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ తరువాత కూడా ఒకటి రెండు రిట్‌లు న్యాయస్థానంలో దాఖలయ్యాయి. వీటిపై జీవీఎంసీ, రాష్ట్రప్రభుత్వం హైకోర్టులో కౌంటర్లు వేస్తూ వచ్చింది. న్యాయస్థానంలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం కూడా విలీనమైన ప్రాంతాలను కలుపుతూ వార్డుల విభజన జరపలేదు.

### ఇక 81 వార్డులుగా విస్తరించనున్న జీవీఎంసీ

ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి వార్డుల విభజనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జీవో నెంబర్ 311ను బుధవారం విడుదల చేసింది. వార్డుల విభజనకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. 2011 జనాభా లెక్కలు ఆధారంగా వార్డుల విభజన ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జీవీఎంసీ పరిదిలో 17,30,320 మంది నివసిస్తున్నట్లు పేర్కొంది. ఇక 2011 ప్రకారం అనకాపల్లి జనాభా 86,612, భీమునిపట్నం మున్సిపాలిటీ జనాభా 54,865, అనకాపల్లి వైపు విలీనమైన ఐదు పంచాయతీల జనాభా 9,889 కలిపి మొత్తం 18,81,686గా ప్రకటించింది.

### భీమిలి నుంచి తొలి వార్డు ప్రారంభం - ముగింపు సమీపంలోనే

వార్డుల విభజన ప్రక్రియ గుండ్రంగా వృత్తాకారంలో చేపట్టనున్నారు. తొలివార్డు భీమిలిలో ప్రారంభం కాగా అనకాపల్లి వరకు వార్డులు విభజించుకుంటూ వెళ్లి తిరిగి భీమిలికి అత్యంత సమీపంలో (1వ వార్డుకు దగ్గర) 81వ వార్డు విభజన కానుంది. గతంలో 72 వార్డులుగా విభజించినప్పుడు కూడా తొలి వార్డు పైనాపిల్ కాలనీ వద్ద ప్రారంభం కాగా ఆఖరి వార్డు 72 అక్కడకు సమీపంలోని పాత అడవివరం గ్రామం వద్ద ముగిసింది. ఇప్పుడు కూడా అదే రీతిలో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి కానుంది.

**ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 81 వార్డులు వివరాలు**

| | |
|---|---|
| 2011 జనాభా లెక్కల ప్రకారం జీవీఎంసీ జనాభా : | 17,30,320 |
| అనకాపల్లి జనాభా (2011 లెక్కల ప్రకారం) : | 86,612 |
| భీమునిపట్నం మున్సిపాలిటి జనాభా (2011): | 54,865 |
| అనకాపల్లి వైపు ఐదు గ్రామ పంచాయతీలు (2011): | 9889 |
| విలీనం తరువాత మొత్తం గ్రేటర్ జనాభా : | 18,81,686 |
| పది లక్షల జనాభాప్రకారం వార్డులు : | 63 |
| 7,30,320 జనాభాకు వార్డులు : | 18 |
| **మొత్తం వార్డులు :** | 81 |

## అవార్డులు అందుకున్న అధికారులకు అభినందనలు

**అమరావతి, ఆంధ్రప్రభ :** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ పనితీరు అవార్డులు, రివార్డులు అందుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆయా శాఖల సిబ్బంది, ఉన్నతాధికారులు అభినందనలతో ముంచెత్తారు. బుధవారం ఆ శాఖల కమిషనర్ కార్యాలయంలో జరిగిన అవార్డు గ్రహీతల అభినందన కార్యక్రమంలో ఆ శాఖల కమిషనర్ బి. రామాంజనేయులు, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని అవార్డులు అందుకున్న జాయింట్ కమిషనర్లు ఎం. శివప్రసాద్, జి.బాల సుబ్రమణ్యం, విశాఖపట్నం జిల్లా డ్వామా పిడి కళ్యాణ్ చక్రవర్తిలను అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ బి. రామాంజనేయులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నేతృత్వంలో నిరంతర పర్యవేక్షణలో పనిచేస్తున్నందువలనే గ్రామీణాభివృద్ధి శాఖ విజయబాటలో వెళ్తోందని, ఎన్నడు లేని విధంగా ఈ శాఖ అనేక అవార్డులను అందుకుంటోందని అన్నారు. అలాగే అవార్డులు అందుకున్న అధికారులు ముగ్గురు తమ అనుభవాలను రంగరించి, అధిక శ్రమ చేస్తూ గ్రామీణాభివృద్ధి పథకాలను ముందుకు తీసుకువెళ్తున్నారని, వారి శ్రమకు తగిన గుర్తింపు ఈ అవార్డులని అంటూ వారి సేవలను కొనియాడారు. అధికారులు అవార్డు , రివార్డు రెండింటిని అందుకోవడం, ఒకే శాఖ మూడు అవార్డులు సాధించడం తనకెంతో గర్వంగా ఉందని అంటూ ముందు ముందు మరింత బాధ్యతతో పనిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ బి. రామాం జనేయులు ఆ శాఖల అధికారులు, సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని, అవార్డు గ్రహీతలను అభినందించారు.

## కిలీ మంజారో శిఖరాన్ని అధిరోహించిన బీసీ హాస్టల్ విద్యార్థి

**బీసీ సంక్షేమశాఖ ఆర్థిక సాయంతో అధిరోహించిన చరణ్**



**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్రంలోని బీసీ సంక్షేమ శాఖ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్న పి చరణ్ రాజ్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన కిలీ మంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించారు. శిఖరాన్ని అధిరోహిం చిన చరణ్ రాజ్ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న చిత్రపటాన్ని ఆవిష్కరించాడు. సికింద్రాబాద్‌లోని బీసీ కాలేజ్ హాస్టల్‌లో ఉంటూ డీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న చరణ్‌రాజ్ బీసీ సంక్షేమ శాఖ అందించిన ఆర్థిక సాయంతో ఈ ఘనతను సాధించాడు. చరణ్ రాజ్ గతంలో మౌంట్ రేనాక్‌తోపాటు మౌంట్ స్టాక్‌ను కూడా అధిరోహించాడు. చరణ్ రాజ్ సాహసాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న, ముఖ్య కార్యదర్శి అశోక్ కుమార్, ఇన్‌ఛార్జ్ కమిషనర్ విజయ్‌కుమార్, అదనపు సంచాలకులు కిరాడ్ అలోక్ కుమార్ అభినందించారు. తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింప చేసిన చరణ్‌రాజ్ అభినందనీయుడని కొనియాడారు.

# విత్తన భాండాగారంగా నంద్యాల

**ప్రపంచ శ్రేణి ప్రమాణాలే లక్ష్యం: మంత్రి సోమిరెడ్డి**



**నంద్యాల, ఆంధ్రప్రభ :** నంద్యాలను ప్రపంచ విత్తన భాండాగారంగా తీర్చిదిద్దాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. ప్రపంచశ్రేణి ప్రమాణాలు నెలకొల్పడమే లక్ష్యమంగా ముందుకు సాగుతోందన్నారు. అదేవిధంగా ఓర్వకల్లును పారిశ్రామికంగా అభివృద్ధి చేసి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే దిశగా తమ ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. నంద్యాల ఎన్నికల ప్రచార బాధ్యతలను నిర్వహిస్తున్న ఆయన బుధవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రభ ప్రతినిధితో మాట్లాడుతూ తాజా పరిణామాలను వివరించారు. ప్రజల సంక్షేమ, రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, నంద్యాలలో పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటర్లు నంద్యాలను సువర్ణాధ్యాయంగా పరిగణించి టీడీపీని గెలిపించాల్సిన ఆవశ్యకతను మంత్రి నొక్కి చెప్పారు. కర్నూలులోని ఆసుపత్రిని సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌గా తీర్చి దిద్దుతామని, సిమెంట్, సోలార్ విద్యుత్ తదితర పరిశ్రమలను కర్నూలులో ఏర్పాటుచేయడానికి కృషి చేస్తున్నామని, ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ భేదాలు సృష్టించాలని భావిస్తున్నవారికి బుద్ధి చెప్పాలని ఓటర్లకు మంత్రి పిలుపునిచ్చారు. గత పన్నెండేళ్ళుగా రెండుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన శిల్పా మోహన్ రెడ్డి నియోజకవర్గాన్ని పూర్తిగా గాలికి వదిలివేయడంతో నంద్యాల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయిందన్నారు. ఎన్నికలలో ఓడిపోతామనే భయంతోనే వైసీపీ నేతలు వక్రీకరించి మాట్లా డుతున్నారని తెలిపారు.ఎలు, మౌజన్‌లకు 3 వేల రూపా యలు ఇస్తున్నారన్నారు . జగన్మోహన్ రెడ్డి ముస్లింలకు ఎమ్మెల్సీ ఇస్తామనడం అసంబద్ధమైనదన్నారు. కేవలం ముస్లింలను మభ్యపెట్టేందుకు ఇలా వ్యాఖ్యానిస్తున్నారని మండిపడ్డారు. విద్యా సంస్థల అధినేత కేశవరెడ్డి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనుచరుడని, వైఎస్ హయాంలో కేశవరెడ్డి భారీ ఎత్తున సొమ్మువసూలు చేశారన్నారు. అక్రమ వసూళ్ళపై అప్పుడు మాట్లాడకుండా ఇప్పుడు ఎన్నికలన దృష్టిలో పెట్టుకుని మాట్లాడడమేమిటి అని ఆయన ప్రశ్నించారు అధికార వ్యామోహంతో ఉన్మాదిలా ప్రవర్తిస్తున్న జగన్‌ను నంద్యాల ఓటర్లు విశ్వసించరన్నారు. పలు కేసులలో ముద్దాయిగా వున్న జగన్‌కు సేవ చేసే అవకాశమే లేదన్నారు. వైసీపీనేతలు నంద్యాలలో నెల రోజులుగా ఎందుకు తిష్ట వేశారో జగన్ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. నంద్యాల సమగ్ర అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

### రైతులకు ఉచితంగా విత్తనాలు

రాష్ట్రంలోని 217 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు వేరుశనగ పంట వేయలేకపోయారని మంత్రి సోమిరెడ్డి అన్నారు. రైతులు వేరుశనగకు బదులు ప్రత్యామ్నాయ పంటలను వేసుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలను అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. రాయలసీమలోని కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు, ప్రకాశం, విజయనగర జిల్లాల్లోని రైతాంగం ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు వందశాతం రాయితీతో 1.5 లక్షల క్వింటాళ్ళ విత్తనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. దీనికి కావల్సిన రూ. 105 కోట్ల నిధులు రాష్ట్ర విపత్తు నిధుల నుంచి కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. భూసార పరీక్షల ఫలితాలు తెలియజేసే స్థాయిలో హెల్త్ కార్డుల ఆధారంగా ఖరీఫ్ కాలంలో 44.175 మెట్రిక్ టన్నుల జిప్సం, జింక్, బోరాన్, సూక్ష్మ పోషక ఎరువులను రైతులకు ఉచితంగా అందించామన్నారు. రాష్ట్రంలోని రైతులకు రూ. 2.5 లక్షల రాయితీతో ముందుగా రూ. 6 వేల ట్రాక్టర్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, కానీ రైతుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని అదనంగా మరో 4 వేల ట్రాక్టర్లను మంజూరు చేసిందని మంత్రి తలిపారు.

# స్వచ్ఛ రైల్ - స్వచ్ఛ భారత్

**ప్రారంభించిన కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** స్వచ్ఛ రైల్ - స్వచ్ఛ భారత్, స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించడం ద్వారా కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ దక్షిణ మధ్య రైల్వేలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట శాసనసభ్యులు జి. కిషన్‌రెడ్డి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి రోజు రైళ్లను, రైల్వే స్టేషన్‌లను, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ కార్యక్రమం ఉద్దేశించబడింది. ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. పరిశుభ్రతను పాటించడంతో భారతమాతకు సేవ చేసినవారం అవుతామన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనవలసి ఉందన్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఈ నెల 16 నుండి 31 వరకు తమ జోన్ పరిధిలో స్వచ్ఛతాపక్వాడా పాటిస్తున్నామని వెల్లడించారు. రైళ్లు, రైల్వే స్టేషన్‌లు పరిశుభ్రంగా ఉంచడం జరుగుతుందన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఎప్పుడైనా పరిశుభ్రతలో ముందంజలోనే ఉందని పేర్కొన్నారు. ప్రమాణాల మేరకు పరిశుభ్రతను మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి, రాష్ట్ర శాసనసభ్యులు, రైల్వే అధికారులు రైల్వే ప్లాట్ ఫారంలను చీపురు తో శుభ్రం చేశారు. స్వచ్ఛ భారత్‌ను సాధించడంలో ప్రభుత్వాలు, సంస్థల కృషికి ప్రజల తోడ్పాటు అవసరమని బండారు దత్తాత్రేయ వెల్లడించారు.

### రైల్ నిలయంలో స్వచ్ఛ రైల్ ప్రతిజ్ఞ

రైల్ నిలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అధికారులు, ఉద్యోగులతో స్వచ్ఛ రైల్ - స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రైల్వే సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం కూడా నిర్వహించారు. స్వేచ్ఛ రైల్ - స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఉద్దేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన భారత్‌లో మెరుగైన ప్రగతిని సాధించాలనే మహాత్ముని కల నెరవేర్చే విధంగా ప్రతి ఒక్కరు స్వచ్ఛ భారత్‌లో పాల్గొనవలసి ఉందని వినోద్‌కుమార్ యాదవ్ కోరారు. వారంలో రెండు గంటల చొప్పున సంవత్సరంలో 100 గంటల పాటు పరిశుభ్రతకు సమయం కేటాయించడం జరుగుతుందని రైల్వే ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు.

### 20 నుండి రైల్వే కాంట్రాక్టర్ల టూల్‌డౌన్ నిరసన

రైల్వే కాంట్రాక్టు పనుల్లో జూన్ 30కి ముందు కేటాయించిన టెండర్లకు కొత్తగా అమలులోకి వచ్చిన జీఎస్‌టీ పన్నును విధించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20 నుంచి టూల్ డౌన్ నిరసనను చేపట్టనున్నట్లు ఇండియన్ రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ప్రకటించింది. సంఘం ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, జూలై ఒకటి నుండి అమలులోకి వచ్చిన జిఎస్‌టీ విధానాన్ని పాత కాంట్రాక్టులకు అమలు చేయడం వల్ల దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ. 3 కోట్ల విలువైన పనులు నిలిచిపోనున్నాయని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే జిఎస్‌టి మండలికి, కేంద్ర ఆర్థిక మంత్రికి, రైల్వే మంత్రి దృష్టికి తేవడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో 20 నుండి టూల్ డౌన్ చేస్తున్నట్టు వెల్లడించారు.

### నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌కు బొద్దాడి బుజుర్గులో ఆల్ట్

ముంబాయి - నాగ్‌పూర్, ముంబాయి - నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌ను ఇక మీదట బొద్దాడి బుజుర్గులో ఒక నిమిషం పాటు ఆపాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం గురువారం నుండి అమలులోకి రానుంది.

### నేడు స్వచ్ఛ భారత్‌లో పాల్గొననున్న రైల్వే సహాయ మంత్రి రాజన్ గోహేన్

రైల్వే సహాయ మంత్రి రాజన్ గోహేన్ గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరిగే స్వచ్ఛ రైల్ - స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్‌తో పాటుగా ఉన్నతాధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొనబోతున్నారు. రైళ్లు, రైల్వే స్టేషన్‌లు, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఉద్దేశించిన కార్యక్రమానికి విస్తృత ప్రచారం నిర్వహించి ప్రయాణికుల్లో కూడా పరిశుభ్రత పైన అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నారు. దక్షిణ మధ్య రైల్వే ఇతర జోన్ల కంటే కూడా పరిశుభ్రతలో ముందంజలో ఉంది. మరింత మెరుగైన పరిశుభ్రతను సాధించడానికి చర్యలు తీసుకుంటుంది.

## గల్ఫ్‌లో తెలుగు కార్మికుల కష్టాలు

**అసోసియేషన్ చొరవతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరిన 300 మంది కార్మికులు**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆరు నెలలుగా తిండి లేక, చేసేందుకు సరైన పనిదొరక్క ఇబ్బందులు పడ్డ గల్ఫ్ బాధితులు ఎట్టకేలకు హైదరాబాద్ చేరారు. ఒమన్‌లోని పెట్రో కంపెనీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 300 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్కర్లు ఉన్నారు. ఆరు నెలలుగా కంపెనీ కార్మికులకు జీతాలివ్వడం లేదు. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేక కార్మికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ ఆర్థిక సహకారంతో వారంతా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బుధవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా బాధితులంతా అసోసియేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు తెలుగు రాష్ట్రాలనుంచి పలువురు గల్ఫ్‌కు పయనమవుతున్నారు. ఏదో విధంగా అక్కడ డబ్బులు సంపాదించి తమ కుటుంబాలను ఆదుకోవాలన్న గంపె డాశతో వారు ఏమీ ఆలోచించకుండా గల్ఫ్‌కు వెళుతున్నారు. తీరా గల్ఫ్‌కు చేరిన అనంతరం వారి పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారుతోంది. ఉన్నత ఉద్యోగాలు దొరుకుతాయని భ్రమతో కొందరు గల్ఫ్‌కు వెళుతున్నారు. ఉద్యోగాల కోసం గల్ఫ్‌కు వెళుతున్న వారు అక్కడ తమకు తగ్గ పని దొరకక అల్లాడుతున్నారు. ఒకవేళ దొరికినా ఆ కంపెనీ ఎంతకాలం ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. దీంతో, స్వస్థలాన్ని వదులుకుని తాము గల్ఫ్‌కు వచ్చినందుకు తగిన శాస్తి జరిగిందని లోలోపల కుమి లిపోతు న్నారు. కాగా, అక్కడినుంచి తిరిగి స్వస్థలానికి రావడానికి గల అవకాశాలు లేకపో వడంతో కొందరు తమ సమస్యను సోషల్ మీడియా ద్వారా వారి వారి కుటుం బసభ్యులకు విజ్ఞప్తి చేశారు. వీరంతా కలిసి తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులను కలవడంతో వారు సమస్యను పరిష్కరించారు. బాధితులకు విమాన టిక్కెట్లనున తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడంతో భారత విదేశాంగ శాఖ సహాయంతో వారిని స్వదేశం చేర్చారు.



## లంక అభిమానులతో విరాట్, అనుష్క

**కాండీ:** లంకపై టెస్టు సిరీస్‌లో భారత జట్టు తిరుగులేని విజయాలు సాధించిన తర్వాత విరామాన్ని కోహ్లి బృందం తమదైన శైలిలో గడుపుతోంది. మంగళవారం నాడు ఓ హోటల్‌లో విరాట్ తన స్నేహితురాలు అనుష్కతో కలిసి లంక అభిమానులతో సందడి చేశాడు. వీరితో పాటు కోచ్ రవిశాస్త్రి కూడా ఉన్నాడు. అభిమానులు ఈ ముగ్గురితో కలిసి ఫొటోలు దిగారు. ఈ ఫొటోలను విరాట్ ఫ్యాన్ క్లబ్ సోషల్ మీడియాలో పెట్టింది.



ప్రపంచకప్‌కు జట్టు ఎంపికలో ఫిట్‌నెస్‌కే తొలి ప్రాధాన్యమని భారత జట్టు చీఫ్ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. 2019 ప్రపంచకప్ బరిలో అత్యుత్తమ ఫీల్డింగ్ జట్టును దించాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పాడు. ఫిట్‌నెస్ ఉన్నవాళ్లే జట్టులోకి ఎంపికవుతారని, అలాంటి వాళ్లే ముందుకు దూసుకుపోగలుగుతారని అన్నాడు. ప్రస్తుతానికి ఫిట్‌నెస్‌కే ప్రాధాన్యమని విస్పష్టంగా చెప్పాడు. జట్టు అన్ని అంశాల్లోనే సరిగా ఉండేట్టు చూడడం కోచ్ బాధ్యత అన్నాడు. మైదానంలో అత్యుత్తమ ఫలితాలివ్వడం కెప్టెన్ విధి అని చెప్పాడు. కెప్టెనే జట్టును ముందుండి నడిపించేది. ఇతర విషయాలకు మితిమీరిన ప్రాధాన్యం ఇవ్వడం అనవసరమన్నాడు. రవిశాస్త్రి ఇంకా ఏమన్నాడంటే..

# ఫిట్‌నెస్ ఉంటేనే...

- ...ప్రపంచకప్‌కు వస్తారు
- అత్యుత్తమ ఫీల్డింగ్ జట్టుతో వెళ్తాం

ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగుతాం. ఐతే టెస్టుల్లో కూడా అద్భుత ఫలితాలు సాధించాల్సిందే. ఇపుడు జట్టు ముందు రెండు లక్ష్యాలు న్నాయి. ఈ రెండు లక్ష్యాల విషయంలోనూ ఆటగాళ్లలో ఒకే విధమైన ఉత్సాహం, జోరు ఉండాలి. రెండు లక్ష్యాల సాధన కోసం భిన్నమైన స్థాయిల్లో సమాయత్తం కావాలి. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా మాదిరిగా అత్యుత్తమ టెస్టు క్రికెట్ ఆడుతూ, ఇతర ఫార్మాట్లలోనూ మెరుగ్గా రాణించాలి. ప్రతి నాలుగేళ్లకు ప్రపంచకప్ వస్తుంది. అభిమానుల ఆశల్ని దృష్టిలో ఉంచుకొని దాని ప్రాధాన్యతను అర్థంచేసుకున్నాం. ఐతే జట్టుకు అసలైన పరీక్ష టెస్టు క్రికెట్‌లోనే ఎదురవుతుంది. రానున్న ఏడాదిలో టీమ్‌ఇండియా ఎన్నో టెస్టులు ఆడబోతోంది.

**క్రమశిక్షణే కారణం:** జట్టులో తిరుగులేని క్రమశిక్షణ ఉండబట్టే లంకలో తొలిసారి క్లీన్‌స్వీప్ చేయగలిగారు. రెండో టెస్టులో పాండ్య ఒక్కడే రెండో నో బాల్స్ వేశాడు. మూడో మ్యాచ్‌లో షమి ఒకే ఒక నోబాల్ విసిరాడు. ఇవి మినహా ఎక్కడా తప్పులు చేయలేదు. కానీ రెండు మూడు క్యాచ్‌లు విడిచిపెట్టారు. అక్కడే మెరుగుపడాలి. క్యాచ్‌లు జారవిడిచే అలవాటును విడిచిపెట్టాలి. అందుకు తీవ్రంగా ప్రాక్టీసు చేయాలి.

**కుర్రాళ్లలో తిరుగులేని ప్రతిభ:** జట్టులోని కుర్రాళ్లు ఫీల్డింగ్ కోచ్ భరత్ అరుణ్‌కు చాలా కాలం నుంచి తెలుసు. కుల్‌దీప్‌ను అండర్ 16 స్థాయి నుంచి భరత్ గమనిస్తున్నాడు. మరికొంత మంది కుర్రాళ్ల గురించి కూడా అతనికి బాగా తెలుసు. దీనివల్ల చాలా ఉపయోగాలున్నాయి. కుల్‌దీప్, బుమ్రా, అక్షర్‌లలో ప్రతిభకు కొదవలేదు. వీరంతా అరుణ్‌తో కలిసి పనిచేసిన వాళ్లే.

**పాండ్య తేడా చూపించాడు:** హార్దిక్ పాండ్య బంతితో, బ్యాట్‌తో తన ప్రత్యేకత చాటాడు. అతనింకా టెస్టులకు కొత్తే. కానీ తాను ఎంత త్వరగా నేర్చుకుంటాడో చెప్పాడు. కోహ్లి చెప్పినట్టు లంకతో సిరీస్‌లో దొరికిన ఆణిముత్యం పాండ్య. ఇద్దరే పేసర్లను తీసుకున్నపుడు పాండ్య జట్టులో సమతూకం తీసుకురాగలడు. షమి, యాదవ్ నిర్విరామంగా బౌలింగ్ చేస్తున్నారు. పేస్‌కు అనుకూలించని పిచ్‌పై తీవ్రంగా శ్రమిస్తున్నారు. 145 కిలోమీటర్ల వేగం తగ్గకుండా బౌలింగ్ చేస్తున్నారు.

**ఇది విరాట్ జట్టు:** నేను ఎప్పుడూ చెప్పేది ఇదే. విరాట్ బాధ్యతలు తీసుకోకముందు అది ధోనిసేన. అతను కొందరు కుర్రాళ్లను తీర్చిదిద్దాడు. వారిపుడు రాణిస్తున్నారు. జట్టుకు నాయకుడు కెప్టెనే. దానికి కొనసాగింపుగా కోచ్ పాత్ర ఉంటుంది. జట్టు అన్ని అంశాల్లోనే సరిగా ఉండేట్టు చూడడం కోచ్ బాధ్యత. మైదానంలో అత్యుత్తమ ఫలితాలివ్వడం కెప్టెన్ విధి. గతంలో పని చేసినపుడు కూడా ఇదే సూత్రాన్ని పాటించాను. కానీ నేను కాని మరొకరు కాని ఇంతకన్నా చేసేది ఏమీ ఉండదు. కెప్టెనే జట్టును ముందుండి నడిపించేది. ఇతర విషయాలకు మితిమీరిన ప్రాధాన్యం ఇవ్వడం అనవసరం. ఆటగాళ్ల మధ్య విశ్వాసం, నమ్మకం ఉండేట్టు చూడడం నా బాధ్యత.

**సాహా అద్భుతం:** కీపింగ్, బ్యాటింగ్, క్యాచింగ్‌లలో సాహా అద్భుత ప్రదర్శన ఇస్తున్నాడు. కొన్నేళ్లుగా అతను దేశవాళీ క్రికెట్లో నిలకడగా రాణిస్తున్నాడు. అతను తీవ్రంగా శ్రమిస్తాడు. అతనిలో విశ్వాసం మెండు. టెస్టుల్లో ధోని లోటును తీరుస్తున్నాడు. ధోనీ నీడనుంచి బాగా ఎదిగాడు. లంకతో సిరీస్‌లో ఇలాంటి పిచ్‌పై అతని కీపింగ్‌ను చూస్తే ప్రపంచంలో అతనే అత్యుత్తమ కీపర్ అనాలి.

## వాళ్లకు చుక్కలు చూపిస్తా..



**కాండీ:** లంక అంటేనే రెచ్చిపోయే భారత వన్డే జట్టు ఓపెనర్ రోహిత్ శర్మ రానున్న వన్డేల్లో వారికి మరోసారి చుక్కలు చూపిస్తానని అన్నాడు. కోల్‌కతలో 2014లో జరిగిన వన్డేలో శ్రీలంకపై చెలరేగి 264 పరుగుల ప్రపంచ రికార్డు స్కోరు సాధించిన సంగతి ఇంకా లంక ఆటగాళ్ల మది నుంచి చెరిగిపోయి ఉండదు. వారిపై ఆ రికార్డును కొనసాగించాలని రోహిత్ కృతనిశ్చయంతో ఉన్నాడు. లంకకు పీడకలగా మిగులుతానని వైస్ కెప్టెన్ రోహిత్ అంటున్నాడు. గాయం నుంచి కోలుకుని తిరిగి ఆటలోకి అడుగుపెట్టిన రోహిత్‌కు ఆకాశమే హద్దుగా చెలరేగిపోవడానికి లంక కంటే మంచి ప్రత్యర్థి ఉండరు. ''నన్ను వైస్ కెప్టెన్‌గా నియమించడం గౌరవంగా భావిస్తున్నాను. పదేళ్ల క్రితం భారత్ తరపున ఆడాలనుకునే వాడిని. దాని గురించి ఇప్పుడు ఎక్కువగా ఆలోచించడం లేదు. ఈ మధురక్షణాలను ఆస్వాదిస్తున్నాను. గత కొన్నేళ్లు అద్భుతంగా సాగుతున్నాయి. అదే ఒరవడిని కొనసాగించాలనుకుంటున్నాను'' అని చెప్పాడు.

అద్భుతమైన సీజన్‌తో పాటు ఐపీఎల్‌లో ముంబయికి మూడో టైటిల్ గెలిపించి పెట్టిన రోహిత్‌ను సెలెక్టర్లు కోహ్లి డిప్యూటీగా నియమించారు. ''వైఎస్ కెప్టెన్ అయినా నాలో ఎలాంటి మార్పు లేదు. అక్కడ ఐపీఎల్‌లో కెప్టెన్‌ను. ఇక్కడ తెరవెనుక పాత్ర పోషించాలి. ఐపీఎల్‌లో నేనే ముందుంటాను'' అని రోహిత్ అన్నాడు.

## జట్టులోకి థిసారా, మిలింద

- లంక కెప్టెన్‌గా ఉపుల్ తరంగ

**కొలంబో:** భారత్‌తో జరిగే ఐదు వన్డేల సిరీస్ కోసం లంక జట్టు ఆల్‌రౌండర్లు థిసారా పెరెరా, మిలింద సిరివర్ధనలకు మళ్లీ పిలుపునిచ్చింది. టెస్టుల్లో ఆడిన ఎడమ చేతివాటం స్పిన్నర్ మిలింద పుష్పకుమార, ఎడమచేతి వాటం సీమర్ విశ్వ ఫెర్నాండోలను కూడా వన్డే జట్టులోకి తీసుకున్నారు. వీరిద్దరు ఇంతవరకు ఒక్క వన్డే కూడా ఆడలేదు. జట్టుకు ఉపుల్ తరంగ సారథ్యం వహిస్తాడు. గాయం కారణంగా పేసర్ నువాన్ ప్రదీప్, అసెలె గుణరత్నే జట్టుకు దూరమైన సంగతి తెలిసిందే. అభిమానులు జట్టుకు మద్దతివ్వాలని కెప్టెన్ తరంగ కోరాడు. ''ప్రతి జట్టుకు కష్టకాలం ఉంటుంది. ఎంత గొప్ప దేశమైనా ఎప్పుడో ఒకపుడు అన్ని జట్లకు ఈ అనుభవం తప్పదు. జట్టు ఆత్మవిశ్వాసం ఇనుమడించాలంటే అభిమానుల మద్దతు చాలా అవసరం'' అని తరంగ అన్నాడు. ''మేం దేశం కోసం ఆడతాం. దేశానికి, దేశ ప్రజలకు గౌరవం తేవడమే మా లక్ష్యం. అందుకే మాకు మద్దతివ్వాలని అభిమానుల్ని కోరుతున్నాను'' అని చెప్పాడు. వన్డే సిరీస్ 20న ఆరంభమవుతుంది.



మిలింద



థిసార

**జట్టు:** ఉపుల్ తరంగ (కెప్టెన్), ఏంజెలో మాథ్యూస్, నిరోషన్ డిక్వెల, గుణతిలక, కుశాల్ మెండిస్, చమర కపుగెదర, మిలింద సిరివర్ధన, మిలింద పుష్పకుమార, అకిల ధనంజయ, లక్షన్ సందకన్, థిసారా పెరెరా, వనిందు హసరంగ, లసిత్ మలింగ, చమీర, విశ్వ ఫెర్నాండో.



## బంతి తలకు తగిలి క్లబ్ క్రికెటర్ దుర్మరణం

**లాహోర్:** క్రికెట్లో మరో విషాదకర సంఘటన. బ్యాటింగ్ చేస్తుండగా బంతికి తలకు తగిలి పాకిస్థాన్‌లో ఓ క్లబ్ క్రికెటర్ దుర్మరణం పాలయ్యాడు. జుబైర్ అహ్మద్ సోమవారం ఖైబర్ ఫక్తున్‌ఖవా రాష్ట్రంలోని మర్దన్ జిల్లాలో ఓ క్లబ్ మ్యాచ్‌లో ఆడుతుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. జుబైర్ ఫకర్ జమాన్ అకాడమీ ఆటగాడు. బ్యాటింగ్ చేస్తున్న సమయంలో అతను తలకు హెల్మెట్ ధరించలేదని తెలిసింది. జుబైర్ మృతికి ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డీన్‌జోన్స్ ట్విటర్లో సంతాపం వ్యక్తంచేశాడు.

### మైదానంలో మర్దర్లు..

**జెంటిల్మన్ గేమ్‌గా పేరున్న క్రికెట్లో జుబైర్ ఘటన వంటి విషాదాలు గతంలోనూ చోటు చేసుకున్నాయి. భారత ఆటగాళ్లు రమణ్ లాంబా, అంకిత్ కేసరి సైతం మైదానంలో చోటు చేసుకున్న దుర్ఘటన వల్లే ప్రాణాలు కోల్పోయారు.**

1998లో 38 ఏళ్ల లాంబా ఢాకాలో ఓ క్లబ్ తరపున మ్యాచ్ ఆడుతుండగా బంతి తలకు బలంగా తగిలి మైదానంలోనే కుప్పకూలిపోయాడు. వికెట్‌కు దగ్గరగా ఫీల్డింగ్ చేస్తున్న లాంబా తలకు మెహ్రాబ్ హుస్సేన్ కొట్టిన బంతి బలంగా తాకింది. లాంబాను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల పాటు కోమాలో ఉన్న అతను మెదడుకు తీవ్ర గాయాల కారణంగా తుది శ్వాస విడిచాడు.



లాంబా

**అంకిత్ కేసరి (2015):** 20 ఏళ్ల అంకిత్ కేసరి దురదృష్టం వశాత్తు మైదానంలో తగిలిన గాయంతో అకాలమరణం పాలయ్యాడు. కోల్‌కత సాల్ట్‌లేక్ మైదానంలో సహచరుడు సౌరభ్ మండల్‌తో అనూహ్యంగా ఢీకొనడంతో తలకు బలమైన గాయం తగిలి ఆసుపత్రి పాలయ్యాడు. మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఓడాడు. గుండె పోటుతో తుది శ్వాస విడిచాడు.



అంకిత్

**ఫిల్ హ్యూస్ (2014):** ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ 25 ఏళ్ల ఫిల్ హ్యూస్ కూడా బంతి తలకు తగిలి ప్రాణాలు కోల్పోయాడు. ఆసీస్ స్థానిక జట్ల మ్యాచ్లో ఓ బౌలర్ వేసిన ప్రమాదకర బౌన్సర్ తలకు బలంగా తాకడంతో అతని కపాలం పగిలింది. ఫిల్‌కు రెండు రోజుల పాటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసినప్పటికీ వైద్యులు అతణ్ని బతికించలేకపోయారు.



హ్యూస్

**డారెన్ రాండల్ (2013):** దక్షిణాఫ్రికాకు బ్యాట్స్‌మన్ రాండల్ దేశవాళీ మ్యాచ్‌లో బంతిని పుల్ చేయబోయి ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. బంతి తలకు తగలండతో 32 ఏళ్ల రాండల్ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. ఆసుపత్రికి తరలించినా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడని వైద్యులు నిర్ధరించారు.

**అల్కిన్ జెన్కిన్స్ (2009):** మైదానంలో సంభవించిన మరో విషాదకర సంఘటనలో 72 ఏళ్ల ఇంగ్లిష్ అంపైర్ ప్రాణాలు విడిచాడు. ఫీల్డర్ విసిరిన బంతి తగలడంతో ఆయనను విమానంలో ఆసుపత్రికి తరలించినప్పటికీ కొద్ది సేపట్లోనే తుది శ్వాస విడిచాడు.

**జార్జ్‌సమ్మర్స్ (1870):** క్రికెట్ మైదానంలో తొలిసారి విషాదకర సంఘటన 1870లో చోటుచేసుకుంది. ఆ సంఘటనలో 25 ఏళ్ల ఇంగ్లిష్ బ్యాట్స్‌మన్ సమ్మర్స్ ప్రాణాలు కోల్పోయాడు. నాటింగ్‌హామ్ తరపున బ్యాటింగ్ చేస్తున్న సమ్మర్స్ తలకు బౌలర్ జాన్ ప్లట్ వేసిన షార్ట్‌పిచ్ బంతి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ ఘటన తర్వాత అతను కోలుకుని రైలులో తిరిగి వెళ్లిపోయాడు. కానీ గాయం తిరగదోడి నాలుగు రోజుల తర్వాత తుది శ్వాస విడిచాడు.



## ఆనంద్, కాస్పరోవ్ గేమ్ డ్రా

**సెయింట్ లూయిస్ (యుఎస్):** రిటైర్మెంట్‌కు గుడ్‌బై చెప్పి మళ్లీ చెస్‌లోకి అడుగుపెట్టిన మాజీ ప్రపంచ ఛాంపియన్ గారీ కాస్పరోవ్ (రష్యా)తో ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో విశ్వనాథన్ ఆనంద్ గేమ్ డ్రాగా ముగిసింది. చెస్ అభిమానుల్లో ఎనలేని ఆసక్తిని రేకెత్తించిన ఈ గేమ్‌ను ఆనంద్ డ్రా చేయగలిగాడు. ర్యాపిడ్ చెస్‌లో ఓ రౌండ్లో విజయం సాధించిన ఆనంద్ ఆరో రౌండ్‌ను కాస్పరోవ్‌తో డ్రా చేసుకున్నాడు. అంతకుముందు కాస్పరోవ్ తొలి ఓటమిని చవిచూశాడు. మొదటి రోజు మూడు డ్రాలతో గట్టెక్కిన కాస్పరోవ్.. రష్యాకే చెందిన ఇయాన్ నెపోమ్నియాట్షి చేతిలో ఓడాడు.

## ఖన్నా, అమితాబ్‌లను తప్పించండి

**న్యూఢిల్లీ:** లోథా కమిటీ సంస్కరణ లకు అనుగుణంగా పని చేయని అధ్యక్షుడు సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి సహా బీసీసీఐ కార్యవర్గ సభ్యులను తొలగించాలని సుప్రీంకోర్టును బోర్డు పరిపాలక కమిటీ (సీఓఏ) కోరింది. ఈ మేరకు కమిటీ ఐదో స్టేటస్ నివేదిను సుప్రీంకు సమర్పించింది. కోశాధికారి అనిరుధ్ చౌదరిని కూడా తొలగించాలని సీనియర్ క్రికెటర్ డయానా ఎడుల్జీ, వినోద్ రాయ్‌లతో కూడిన కమిటీ ఆ నివేదికలో విన్నవించింది. ఎన్నికలు అయ్యేంతవరకు పరిపాలన, నిర్వహణను సీఈఓ రాహుల్ జోహ్రి నేతృత్వంలోని ప్రొఫెషనల్ బృందానికి అప్పగించాలని వారు కోరారు. లోథా సంస్కరణలను అమలు చేయడంలో విఫలమైన అధ్యక్షుడు అనురాగ్ ఠాకుర్, కార్యదర్శి అజయ్ షిర్కేలను తొలగించినట్లే ఖన్నా, అమితాబ్, అనిరుధ్‌లను తప్పించాలన్నారు.



స్టీలర్స్, తలైవాస్ మ్యాచ్ దృశ్యం

## స్టీలర్స్ 25.. తలైవాస్ 25

- టైటాన్స్‌కు పరాజయ పరంపర

**అహ్మదాబాద్:** ప్రొ కబడ్డీ అంతర్ జోనల్ పోరులో హర్యానా స్టీలర్స్, తమిళ్ తలైవాస్ మ్యాచ్ టైగా ముగిసింది. బుధవారం హోరాహోరీగా సాగిన ఈ పోరులో రెండు జట్లూ 25-25 స్కోరుతో నిలిచాయి. ఫామ్ పుణికిపుచ్చుకున్న తలైవాస్ గెలుపును కైవసం చేసుకునేట్టే కనిపించింది. ప్రపంజన్ తలైవాస్‌కు ఏడు ర్యాపిడ్ పాయింట్లు సాధించిపెట్టగా.. సురేందర్ నాడా కూడా హర్యానాకు ఏడు పాయింట్లు స్కోర్ చేశాడు. తొలి అర్థం ముగిసేసరికి తలైవాస్ 17-14 ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్థంలో పోరు మరింత హోరాహోరీగా సాగింది. రెండు జట్లు సమంగా స్కోరు చేస్తూ వెళ్లాయి. మ్యాచ్ మొత్తం తలైవాస్ కొద్దిపాటి ఆధిక్యాన్ని కొనసాగించినా.. చివర్లో స్టీలర్స్ పుంజుకుని ఓ దశలో 22-22తో సమంగా నిలిచింది. ఆట మరో రెండు నిమిషాల్లో ముగుస్తుందనగా ఆశిష్ స్టీలర్స్‌ను 25-24తో ఆధిక్యంలో నిలిపాడు. చివరి నిమిషంలో డాంగ్ జియోన్ స్కోరు చేసి తలైవాస్‌ను 25-25తో నిలిపాడు. దీంతో మ్యాచ్ టైగా ముగిసింది. మరో వైపు తెలుగు టైటాన్స్ పరాజయ పరంపర కొనసాగుతోంది. గుజరాత్ ఫార్చ్యూన్స్ చేతిలో 19-29 తేడాతో ఓటమి చవిచూసింది. టైటాన్స్‌కిది ఆరో పరాజయం. ఎనిమిది మ్యాచ్‌లాడిన టైటాన్స్ ఓ గెలుపు, ఓ డ్రా, ఆరు పరాజయాలతో 12 పాయింట్లతో జోన్‌లో నాలుగో స్థానంలో నిలిచింది.

## ఐదో వన్డేలో భారత్ యూత్ గెలుపు

**టాంటన్ (ఇంగ్లాండ్):** ఇంగ్లాండ్ యూత్ జట్టుతో వన్డే సిరీస్‌లో భారత యువ జట్టు మరో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన ఐదో వన్డేలో భారత్ ఒక వికెట్ తేడాతో గెలిచింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ యూత్ 9 వికెట్లకు 222 పరుగులు చేసింది. బ్రూక్ ఒక్కడే 49 పరుగులతో రాణించాడు. తక్కిన బ్యాట్స్‌మెన్ పెద్దగా పరుగులు చేయలేదు. భారత బౌలర్లలో చహర్ 63 పరుగులిచ్చి నాలుగు వికెట్లు దక్కించుకున్నాడు. తర్వాత భారత్ 49.2 ఓవర్లలో 9 వికెట్లకు 226 పరుగులు చేసి జయకేతనం ఎగురవేసింది. షా (52) అర్ధసెంచరీ సాధించగా, దేశాయ్ 44 పరుగులు చేశాడు.



Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: M Satish Chandar, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.